


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083


# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 08 మంగళవారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 204
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# రామయ్యకు పట్టాభిషేకం



- హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ
- స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ
- భద్రాద్రిలో మిన్నంటిన రామనామ స్మరణలు





**భద్రాచలం ఏప్రిల్ 7 నవభూమి ప్రతినిధి**

కళ్యాణ రాముడు రారాజుగా మారారు. తక్కువేమీ మనకు రాముడు ఒక్కడుండు వరకు అంటూ భక్తులు చేసిన శ్రీరామ నామ స్మరణలు మిన్నంటాయి. అర్చకుల వేద మంత్రోచ్ఛారణతో మిథిలా ప్రాంగణం పులకించింది. దక్షిణ అయోధ్యపురి భద్రగిరి భక్తులతో అలరారింది. శ్రీరామ పట్టాభిషేకం వేడుక నేత్రపర్వంగా సాగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ ఈ వేడుకకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వేడుకలైన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం తదితర మహోత్సవాలకు హాజరైన భక్తజనం తీపి జ్ఞాపకంతో వెనుదిరిగింది

**వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో మిథిలా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకం వేడుక భక్తులను అలరించింది. తొలుత రామాలయం భద్రుని మండపంలో అర్చక స్వాములు స్వామివారి పాదుకలకు అభిషేకం జరిపారు. రాజ లాంఛనాలతో పవిత్ర పావన గౌతమీ నదీ తీరం నుంచి తీర్థములు తీసుకొచ్చారు. భాజా భజంత్రీల సందడి, సన్నాయి మేళాలు,భక్తుల కోలాటంతో శ్రీ సీతారామచంద్ర

# అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.4వేల కోట్ల నిధులు

- అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ. 4285 కోట్లు విడుదల
- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి 25 శాతం నిధుల విడుదల
- అందులో కేంద్రం వాటా రూ. 750 కోట్లు
- 25 శాతం నిధులను అడ్వాన్సుడుగా ఇవ్వాలని సీఆర్డీఏ వినతి

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 4285 కోట్లు విడుదల చేసింది. రాజధానిలో నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి 25 శాతం నిధులను విడుదల చేసింది.అందులో కేంద్రం వాట రూ. 750 కోట్లు. అమరావతిలో పనులు ప్రారంభమవుతోన్నందున 25 శాతం నిధులను అడ్వాన్సుడుగా ఇవ్వాలని సీఆర్డీఏ కోరింది. ఈ నేపథ్యంలో ఈ నిధులను కేంద్రం విడుదల చేసింది. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 4285 కోట్లు విడుదల చేసింది. రాజధానిలో నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి 25 శాతం నిధులను విడుదల చేసింది.అందులో కేంద్రం వాట రూ. 750 కోట్లు. అమరావతిలో పనులు ప్రారంభమవుతోన్నందున 25 శాతం నిధులను అడ్వాన్సుడుగా ఇవ్వాలని సీఆర్డీఏ కోరింది. ఈ నేపథ్యంలో ఈ నిధులను కేంద్రం విడుదల చేసింది.

# టీడీపీ నేతకే గవర్నర్ పదవి?



- టీడీపీలో సీనియర్లకు గవర్నర్ల పదవులు?
- అశోకగజపతి,యనమలకు ఛాన్స్
- ఫస్ట్ ఛాన్స్ అశోక గజపతికే?

**అమరావతి-నవభూమిబ్యూరో:** తెలుగుదేశం పార్టీకి వాజ్ పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే చాలా ప్రాధాన్యత దక్కింది.: తెలుగుదేశం పార్టీకి వాజ్ పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే చాలా ప్రాధాన్యత దక్కింది. అప్పట్లో టీడీపీకి చెందిన వారికి గవర్నర్ పదవులు కూడా ఇచ్చారు. అయితే 2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక మాత్రం మిత్రులకు గవర్నర్ పదవులు ఇవ్వడం అన్నది పెద్దగా లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీ 2014కీ బీజేపీతో పొత్తు పెట్టుకుని ఏపీలో అధికరంలోకి వచ్చింది. కేంద్రంలో కూడా బీజేపీ పాలన వచ్చింది. ఆ సమయంలో తెలంగాణాకు చెందిన సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుకి గవర్నర్ పదవి మీద మోజు ఉండేది ఆయన తనకు ఆ అవకాశం ఇప్పించాలని బాబుని కోరారు. దానికి చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు.బడుగు వర్గాలకు చెందిన ఆయనను రాజ్ భవన్ మెట్లెక్కించాలని బాబు త్రికరణశుద్ధిగానే తలచారు. కానీ అయిదేళ్ళ పాలనలో ఆనాడు బీజేపీ పెద్దలు టీడీపీకి ఒక్క గవర్నర్ పోస్టు కూడా ఇవ్వలేదు. వచ్చిన పదవులు అన్నీ తమకే అన్నట్లుగా వ్యవహరించారు. అలా మోత్కుపల్లి నర్సింహులు ఆశలు అయితే నెరవేరలేదు. దాంతో ఆయన బాబు మీద ఆగ్రహం పెంచుకుని పార్టీకి దూరం కావడమే కాకుండా 2019 ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం కూడా చేశారు. ఇదంతా ఫ్లాష్ బ్యాక్. ఇపుడు చూస్తే మళ్ళీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంది. పొత్తు పెట్టుకుని ఏపీలో

# సామాన్యుడిపై గ్యాస్ బండ

- గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ. 50 పెంచిన కేంద్రం
- నాన్ సబ్సిడీ వినియోగదారులతో పాటు సబ్సిడీ గ్యాస్ అందుకొంటున్న ఉజ్వల లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తింపు
- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడి

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ఇప్పటికే కుదేలైన పేద, మధ్యతరగతి ప్రజలపై కేంద్రంలోని మోదీ సర్కారు మరో పిడుగు వేసింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ. 50 పెంచింది. ఈ మేరకు సోమవారం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడించారు. నాన్ సబ్సిడీ వినియోగదారులతో పాటు సబ్సిడీ గ్యాస్ అందుకొంటున్న ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందని మంత్రి తెలిపారు. తాజా పెంపుతో తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధర రూ. 920 వరకూ చేరినట్టు పలువురు వినియోగదారులు మండిపడుతున్నారు.

**సీఎన్జీపై రూ.1 పెంపు**




## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసు

# నేడు సంచలన తీర్పు

- 2013లో జరిగిన పేలుళ్లలో 18 మంది మృత్యువాత..130కి గాయాలు
- అప్పట్లో ఎన్ఐఏ ఫాస్ట్ ట్రాక్ కోర్టు యాసిన్‌తో సహా ఐదుగురికి మరణశిక్ష
- ఎన్ఐఏ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన ముద్దాయిలు
- సుదీర్ఘ విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు నేడు తుది తీర్పు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలుగురాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్ సుఖ్ నగర్ బాంబు పేలుళ్ల కేసులో ఏప్రిల్ 8(మంగళవారం)న తెలంగాణ హైకోర్టు తుది తీర్పు ఇవ్వనుంది. దీంతో హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2013లో జరిగిన పేలుళ్లలో 18 మంది చనిపోయారు. ఈ ప్రమాదంలో130 మందికి గాయాలు అయ్యాయి. ఈ కేసు విచారణ జరిపిన ఎన్ఐఏ ఫాస్ట్ ట్రాక్ కోర్టు మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది యాసిన్ భత్కల్ సహా ఐదుగురికి మరణశిక్ష విధించింది. అయితే.. తీర్పును సవాల్ చేస్తూ ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఏం జరిగింది..? 2013 ఫిబ్రవరి 21న హైదరాబాద్ నగరంలోని దిల్ సుఖ్ నగర్‌లో పేలుళ్లు సంభవించాయి. ఈ దాడిలో 18 మంది చనిపోయారు, 130 మందికి గాయాలు అయ్యాయి. (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) దర్యాప్తు జరిపింది. విచారణలో 157 మంది సాక్ష్యాలను రికార్డ్ చేసింది. ఈ దర్యాప్తులో ఇండియన్ ముజాహిద్దీన్

# మరో అధునాతన నగరం

- రాజధానిలోనే 50 ఎకరాల్లో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రభుత్వ యోచన
- ప్రధానంగా టెక్నాలజీ, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ రంగాల్లో
- అమరావతిని దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయం
- గతంలో నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం రాజధానిలో నవ నగరాలు



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. 2015లో శంకుస్థాపన జరిగిన ఈ మహానగరం నిర్మాణం వైసీపీ పాలనలో పడకేసిన విషయం తెలిసిందే. గత ఏడాది అధికారంలోకి వచ్చిన నుంచి అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాలని అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం రోజుకో థీమ్‌ను ముందుకు తెస్తోంది. ఇప్పటికే నవనగరాల కాన్సెప్ట్‌తో రాజధాని నిర్మాణానికి ప్లాన్ చేయగా, ఇప్పుడు ఏఐ సిటీ, క్వాంటమ్ కంప్యూటరింగ్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక తాజాగా రాజధానిలోనే 50 ఎకరాల్లో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజధాని అమరావతిలో అత్యాధునిక వసతులతోపాటు, దేశంలో ఎక్కడా లేని వసతులు సమకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా టెక్నాలజీ, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ రంగాల్లో అమరావతిని దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాజధాని పునఃనిర్మాణ పనులతోపాటే కొత్త కొత్త ప్రాజెక్టులను తెరపైకి తెస్తోంది. గతంలో నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం రాజధానిలో నవ నగరాలు ఉంటాయి. ఈ నవ నగరాల్లో దేనికది తీసిపోని విధంగా నిర్మించడంతోపాటు అత్యాధునిక వసతులు కల్పించనున్నారు. అయితే గత ఏడాది నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు అమరావతికి అదనపు హంగులు అద్దాలని డిసైడ్ అయ్యారు. దీనిలో భాగంగా డ్రోన్ సిటీ, ఏఐ సిటీ, క్వాంటమ్ కంప్యూటర్ హబ్ వంటి టెక్నాలజీ రంగాలకు పెద్దపీట వేశారు. ఇక హైదరాబాద్ లోనే గతంలో చంద్రబాబు నిర్మించిన జీనోమ్ వ్యాలీని తలదన్నేలా అమరావతిలో కొత్తగా సైన్స్ సిటీని ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆలోచన ప్రకారం అమరావతిలో సైన్స్ సిటీ ఏర్పాటుకు కేంద్రం కూడా ఓకే చెప్పిందంటున్నారు. సుమారు 50 ఎకరాల్లో నిర్మించనున్న సైన్స్ సిటీకి దాదాపు రూ.200 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగా లేనందున కేంద్రమే ఈ నిధులను భరించేలా సీఎం చంద్రబాబు ఒప్పించారని అమరావతిలో టాక్ నడుస్తోంది. అమరావతిలో నిర్మించనున్నా ఈ సైన్స్ సిటీలో పది మ్యూజియమ్స్, ఇంక్యుబేషన్ సెంటర్లు, గ్లోబల్ రీసెర్చ్ కొలాబరేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా కొత్త పరిశోధనలను ప్రోత్సహించేలా యువత కోసం నైపుణ్యాల పెంపు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

## తెలంగాణ బీజేపి

# అధ్యక్షుడికి తీవ్రపోటీ

- ఆశావాహుల జాబితాలో హేమాహేమీలు!
- బీసీ నాయకుడికి ఇవ్వాలన్న అధిష్టానం
- బండి సంజయ్ వైపు కేడర్ మొగ్గు
- డీకే అరుణ,ధర్మపురి,అర్వింద్,శేఖర్ యత్నాలు

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** రాబోయే ఎన్నికలో తెలంగాణ రాష్ట్రంలో మేమే అధికారంలోకి వస్తాము ఇది బీజేపీ అగ్రనాయకులే కాదు ద్వితీయ స్థాయి నాయకులలోనూ వినిపిస్తున్న మాట. జాతీయ నాయకత్వం కూడా తెలంగాణా రాష్ట్రంలో అధికార పార్టీకి తమ పార్టీనే ప్రత్యామ్నాయం కావాలని, ఆ దిశగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపిక చెయ్యాలని భావించి, ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నా, ఇంకా వెల్లడి చేయకపోవటంతో ఆశావహుల జాబితా పెరిగిపోతుంది. బీజేపీ తెలంగాణా కొత్త అధ్యక్షుడి ప్రకటన కోసం భేటీ ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరికి అవకాశం ఇవ్వాలి అన్న దానిపై బీజేపీ అధినాయకత్వం వడపోత కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్టానికి చెందిన ఎనిమిది మంది ఎంపీలు, ఎమ్మెల్యేలతో గత నెలలో ఢిల్లీలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో, అలాగే జాతీయ హెూంశాఖ మంత్రి అమిత్ షాతో కూడా భేటీ అయ్యారు. దీనికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారని, ప్రకటన చేస్తారని బీజేపీ క్యాడర్ భావించింది. బీసీ సామాజిక వర్గానికి అధ్యక్ష బాధ్యతలు ఇచ్చే ఆలోచన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే ఈ సారి అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలి అని బలంగా వినిపిస్తున్న క్రమంలో తెర మీదకు రోజుకో కొత్త పేర్లు వస్తున్న పరిస్థితి ఉంది. బీసీలకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్న క్రమంలో ఆశావహుల జాబితా పెరిగిపోతుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలో పోటీ నిలిపి, అన్ని స్థానాలను గెలుచుకోవాలనే ఆలోచనలో ఉంది. బీసీ నినాదంతో అన్ని పార్టీలు ఇదే

## వివాదంలో

# వైసీపీ ఎమ్మెల్యే?

2

## సీతమ్మకు తాళి..! హిందూ సంఘాల ఫైర్..!

**కర్నూలు-నవభూమిబ్యూరో:**

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అనూహ్యంగా ఓ వివాదంలో చిక్కుకున్నారు. నిన్న శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఆయన సీతమ్మ వారికి తాళిబొట్టు కట్టి కలకలం రేపారు. రాములోరి కళ్యాణంలో విరూపాక్షి పాల్గొన్న సందర్భంగా చోటు చేసుకున్న ఈ ఘటన నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది. దీనిపై హిందూ సంఘాలు ఫైర్ అవుతున్నాయి. కర్నూలు జిల్లా ఆలూరు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన బుసినే విరూపాక్షి.. నిన్న శ్రీరామనవమి సందర్భంగా రాములోరి కళ్యాణంలో పాల్గొని సీతమ్మకు తాళి కట్టేశారు. దీంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. ఆలూరు నియోజకవర్గంలోని సొంత ఊరు చిప్పగిరిలో జరిగిన రాములోరి కళ్యాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో సీతమ్మకు ఎమ్మెల్యే విరుపాక్షి ఎలా తాళి కడతారని హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. విరూపాక్షి రాములోరి కళ్యాణంలో పాల్గొని సీతమ్మకు తాళికట్టిన వీడియో వైరల్ అవుతోంది. ఇందులో విరూపాక్షి పంతులుగారి సమక్షంలోనే భాజాభజంత్రీల మధ్య ఇలా సీతమ్మకు తాళి కడుతున్నట్లు కనిపించింది. దీంతో అక్కడే

## సెక్స్ వర్కర్లపై

# కేసులు పెట్టొద్దు

## మధ్యప్రదేశ్ పోలీసులు కీలక నిర్ణయం

2


**ఇండోర్-నవభూమిబ్యూరో:**

ఇకపై రాష్ట్రంలో సెలిక్స్ వర్కర్లపై ఎటువంటి వ్యభిచార కేసులు నమోదు చేయకూడదని స్పష్టం చేశారు మధ్యప్రదేశ్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై రాష్ట్రంలో సెలిక్స్ వర్కర్లపై ఎటువంటి వ్యభిచార కేసులు నమోదు చేయకూడదని స్పష్టం చేశారు. అంతేకాకుండా వారిని మానసికంగా హింసించరాదని కూడా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, వ్యభిచారం నిర్వహిస్తున్న హెూటళ్లు, దాబాలు , ఇతర స్థలాల యజమానులపై మాత్రం ఇండియన్ ట్రేడ్ అండ్ ప్రాస్టిట్యూషన్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. అమాయక మహిళలను బలవంతంగా లేదా ప్రలోభాలతో పడుపు వృత్తిలోకి దించుతున్న వారిని కఠినంగా శిక్షించాలనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సెలిక్స్ వర్కర్లను బాధితులుగా చూడాలని, వారిని వేధించకూడదని సూచించారు. వారిని

# 8 నుంచి నాంపల్లిలో పుస్తక ప్రదర్శన.. ఒక్కో బుక్‌పై 60 శాతం డిస్కౌంట్!



**హైదరాబాద్-నవభూమి:**తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 7: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నాంపల్లి ప్రాంగణంలో గల పుస్తక విక్రయ కేంద్రంలో ఈ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇది తెరిచి ఉంటుందని వెల్లడించారు. ఈ పుస్తక ప్రదర్శలో ప్రతి పుస్తకంపై 60 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. ప్రాచీన గ్రంథాలు, సాహిత్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచకావ్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు తగ్గింపు ధరలలో విక్రయానికి సిద్ధంగా ఉంటాయని, సాహితీవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, భాషా ప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



## 'కుల గణన'పై ఎవరూ మాట్లాడొద్దు



**హైదరాబాద్-నవభూమి:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల(ఎస్ఈఈఈపీసీ) గణన సర్వేపై ప్రభుత్వం, రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సర్వేపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల బృందం(ఐఈడబ్ల్యూజీ) సూచించింది. ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్స్ వర్కింగ్ గ్రూపు చైర్మన్ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీహెచ్ఆర్‌డీ)లో బృందం సమావేశమైంది.

తాము కుల గణన వివరాలను సమగ్రంగా సమీక్షించి, విశ్లేషించే వరకు సర్వేపై అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యాఖ్యానించవద్దని బృందం హెచ్చరించింది. ఈ మేరకు కుల గణన సర్వేను బృందం సమీక్షించింది. సర్వేకు అనుసరించిన విధానం, శాస్త్రీయ పద్ధతిని బృందం అభినందించింది. కాగా, సర్వే డేటాను అధ్యయనం చేయడం, విశ్లేషించడంలో కృత్రిమ మేధ(ఏఐ) సాధనాల వినియోగంపై రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్.. ఆయన బృందం ఎక్స్‌పర్ట్స్ గ్రూపునకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది.

## గుట్టుగా వ్యాధులు



**హైదరాబాద్-నవభూమి:**అధిక రక్తపోటు.. పైకి ఏ లక్షణమూ కనిపించదు! లోలోపలే శరీరానికి తీరని నష్టం చేస్తుంది!! మధుమేహం.. అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలున్నా చాలామంది పట్టించుకోరు!! ఈ రెండింటికీ తోడు.. ఇటీవలికాలంలో బాగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్!! పరీక్ష చేస్తే కానీ బయటపడని ఈ జీవనశైలి రుగ్మతలు తమకు ఉన్నాయన్న విషయం కూడా తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాలం గడిపేస్తున్నట్లు అపోలో ఆస్పత్రి సోమవారం విడుదల చేసిన 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న అపోలో ఆస్పత్రుల్లో 25 లక్షలమందికిపైగా వ్యక్తులకు చేసిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా రూపొందించిన నివేదిక ఇది. దాని ప్రకారం.. తెలంగాణలోని పలు అపోలో ఆస్పత్రుల్లో 44,448 మందికి పరీక్షలు చేయగా.. వారిలో 10,427 మంది (23%) అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్టు తేలింది. మరో 24,246 మంది (55%) ప్రీహైపర్‌టెన్షన్ (అంటే బీపీ రావడానికి ముందు) దశలో ఉన్నట్టు వెల్లడైంది. అలాగే.. 40,897 మందికిగాను 10,355 మంది (25%) మధుమేహ బాధితులు ఉండగా.. డయాబెటిస్ రావడానికి ముందు దశలో ఏకంగా 14 వేల మంది (34%) ఉన్నారు. ఇక.. పరీక్షలు చేయించుకున్నవారిలో 63 శాతం మంది ఊబకాయంతో.. 19% మంది అధికబరువుతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. డిస్‌లిపిడెమియా (అంటే అసాధారణ స్థాయిలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఉండడం)తో బాధపడుతున్నవారు 47% మంది ఉన్నారు. కుంగుబాటు, వ్యాకులత వంటి మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు చెరో 3 శాతం మంది ఉన్నట్టు తేలింది. కాలేయ సంబంధిత పరీక్షలు 32,333 మందికి చేయగా.. వారిలో 49 శాతం మంది గ్రేడ్ 1 ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. మరో 5 శాతం మంది రెండో దశ ఫ్యాటీ లివర్‌తో.. 80 మంది గ్రేడ్ 3, ఆరుగురు గ్రేడ్ 4 ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నట్టు తేలింది. నిత్యం కాసేపు ఎండలో ఉంటే ఉచితంగా వచ్చే డి విటమిన్ లోపంతో బాధపడుతున్నవారు ఏకంగా 82 శాతం మంది ఉండడం గమనార్హం.

**దేశవ్యాప్త గణాంకాలు..**

దేశవ్యాప్తంగా 4.5 లక్షల మందికి బీపీ పరీక్ష చేయగా.. వారిలో 26% మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. 23% మంది మధుమేహంతో, 65 శాతం మంది ఫ్యాటీలివర్‌తో, 46 శాతం మంది అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయే) సమస్యతో బాధపడుతున్నట్టు అపోలో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా.. ఫ్యాటీలివర్ బారిన పడినవారిలో 85 శాతం మందికి అసలు మద్యపానం అలవాటే లేదని.. అథెరోస్క్లెరోసిస్ బాధితుల్లో 2.5 శాతం మంది 40 ఏళ్లలోపువారే కావడం ఆందోళనకరమని నివేదిక పేర్కొంది. అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. అపోలో పరీక్షలు చేసినవారిలో మెనోపాజ్‌కు ముందు మధుమేహం బారిన పడినవారు 14% ఉంటే.. మెనోపాజ్ తర్వాత ఆ సంఖ్య 40 శాతానికి చేరిందని పేర్కొంది. బాలల్లోనూ, యువతలోనూ పెరుగుతున్న ఊబకాయంపై ఆ నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల పిల్లల్లో 8 శాతం మంది, కాలేజీ విద్యార్థులు 28 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. యువతలో 19 శాతం మందిలో ముందస్తు రక్తపోటు (ప్రీహైపర్‌టెన్షన్) సమస్య కనిపించడం. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం, యువతలో ఒత్తిడి పెరిగిపోవడం ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. ఇక.. దేశవ్యాప్తంగా 53 వేల మందికి నిద్ర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు చేయగా వారిలో 24 శాతం మంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఏప్నియాతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. రక్తహీనత సమస్యతో 45% మంది మహిళలు, 26% మంది పురుషులు బాధపడుతుండగా.. విటమిన్ డి లోపం స్త్రీ, పురుషుల్లో వరుసగా 77%, 82 శాతంగా ఉంది. విటమిన్ బి12 లోపం 38 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళల్లో ఉన్నట్టు తేలింది. 40 ఏళ్లలోపు వారిలో ఈ లోపం మరింత స్పష్టంగా కనిపించింది. బి12 లోపం ఉన్నవారు వైద్యులను సంప్రదించి, దాన్ని సరిచేసుకోకపోతే.. పలు ఆరోగ్యసమస్యల బారినపడే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ముందస్తు వైద్యపరీక్షలు, జీవనశైలి మార్పుల వంటివాటి అవసరాన్ని నివేదిక నొక్కిచెప్పింది.

**ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై దృష్టిపెట్టాలి**

బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలున్నా.. వాటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవట్లేదని, అలా కాకుండా ముందుగా పరీక్షలు చేయించుకుంటే వీటిలో చాలా జబ్బులు వచ్చే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని నివేదిక సూచించింది. నివేదికలోని అంశాలపై అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాపరెడ్డి మాట్లాడారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ అంటే భవిష్యత్‌లో నిర్ణయం తీసుకునే అంశం కాదని, ప్రస్తుతం దేశ శ్రేయస్సుకు అదే మూలస్తంభం అని ఆయన అభిప్రాయపడ్డారు.

మద్యం సేవించకపోయినా ఫ్యాటీ లివర్ వ్యాధి రావడం.. కొత్త రోగనిర్ధారణ పరీక్షల అవసరాన్ని తెలియజేస్తోందని, సంప్రదాయ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఎంతమాత్రం సరిపోవని అపోలో ఆస్పత్రుల ఎండీ సునీతా రెడ్డి అన్నారు.

## పదో తరగతి పాస్ అయ్యారా..? శిక్షణతో పాటు.. వెంటనే ఉపాధి.. వచ్చే నెలలోనే..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు తక్షణ ఉపాధి అవకాశాలను అందించే లక్ష్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రాంతాల్లో ఈ అత్యాధునిక శిక్షణ కేంద్రాలు వచ్చే నెలలో ప్రారంభం కానున్నాయి. ఈ వినూత్న ప్రాజెక్టు కోసం మొత్తం రూ. 2,379 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ కీలక భాగస్వామిగా 86.75 శాతం ఆర్థిక సహాయం అందిస్తోంది. గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడమే దీని ముఖ్య ఉద్దేశ్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రయత్నంలో భాగంగానే.. ఇప్పుడు మరింత విస్తృత స్థాయిలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లిలో ఉన్న ఐటీఐ ప్రాంగణంలో ఐదు ఏటీసీల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఉపాధి శిక్షణ అధికారులు ఈ కేంద్రాలకు 'ఏటీసీ 4.0' అని నామకరణం చేశారు. ఇది ఇండస్ట్రీ 4.0 అత్యాధునిక సాంకేతికతలపై శిక్షణను సూచిస్తుంది.

ఈ కేంద్రాల్లో అందించే శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే విద్యార్థులకు ఉద్యోగాలు లభించేలా ప్రత్యేకంగా సిలబస్‌ను రూపొందించారు. అంతేకాకుండా.. పరిశ్రమల్లో వెంటనే విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కోర్సులు ఉండనున్నాయి. వీటిలో అడ్వాన్స్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫయర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ వంటి ఆధునిక కోర్సులు ఉన్నాయి. వీటితో పాటు ఆటోక్యాడ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి ముఖ్యమైన సాంకేతిక అంశాలను కూడా విద్యార్థులకు నేర్పించనున్నారు. సంవత్సరం లేదా రెండు సంవత్సరాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వెంటనే ఉద్యోగాలు ఇచ్చేందుకు ఇప్పటికే 19 ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపించాయని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధి శిక్షణ సహాయ సంచాలకులు ఎస్వీకే నగేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త కోర్సులను సులభంగా అర్థం చేసుకునేలా సిలబస్‌ను రూపొందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 కేంద్రాల్లో వర్చువల్ రియాల్టీ ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆయన చెప్పారు. దీని ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# టీడీపీ నేతకే గవర్నర్ పదవి?

**(1వపేజీ తరువాయి)**టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఈసారి కూడా టీడీపీలో చాలా మంది సీనియర్లు తమకు తగిన పదవుల కోసం చూస్తున్నారు. గవర్నర్ గా చేయాలని విజయనగరం జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు చూస్తున్నారు. ఆయన ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు అన్నీ చేశారు. కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ఇక రాజకీయంగా పూర్తి స్థాయి విరమణ చేసే దశలో ఉన్న తనకు రాజ్ భవన్ తగిన వేదికగా ఆయన భావిస్తున్నారు. రాజ్యాంగం పట్ల పూర్తి అవగాహన ఉన్న అశోక్ కి గవర్నర్ పదవి ఇస్తే బాగానే రాణిస్తారు అని అంటున్నారు. అలాగే మరో సీనియర్ నేత యనమల రామక్రిష్ణుడు ఎమ్మెల్సీ పదవీ కాలం కూడా మార్చి 30తో పూర్తి అయింది. దాంతో ఆయన కూడా సరైన గౌరవం కోరుకుంటున్నారు. తనకు ఇస్తే రాజ్యసభ పదవి లేదా గవర్నర్ పదవి అయినా ఇవ్వాలని ఆయన ఆశిస్తున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి బలమైన నేతగా రాజకీయ మేధావిగా ఉన్న యనమలకు ఈ అత్యున్నత పదవి దక్కితే సముచితంగా ఉంటుందని అంతా భావిస్తున్నారు. ఈ ఇద్దరే కాదు, టీడీపీలో మరికొందరు సీనియర్ల చూపు కూడా రాజ్ భవన్ మీద ఉందని అంటున్నారు. అయితే గవర్నర్ పదవుల విషయంలో టీడీపీకి వాటా ఎంత కేంద్ర బీజేపీ పెద్దలు ఒక పోస్ట్ అయినా ఇస్తారా అన్న చర్చ అయితే ఉండనే ఉంది. నిజానికి బీజేపీ పెద్దల ఆలోచనలు చూస్తే పదవులు అన్నవి తమ పార్టీలో మొదటి నుంచి చేసిన వారికే ఇవ్వాలని భావిస్తారు. మరీ ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. సోము వీర్రాజుని ఎమ్మెల్సీగా చేసినా నరసాపురం ఎంపీగా కేంద్ర మంత్రిగా శ్రీనివాసవర్మను చేసినా బీజేపీ ఇదే సిద్ధాంతాన్ని అనుసరిస్తుంది. పార్టీలో ఎంతో మంది నేతలు చేరవచ్చు కానీ పదవుల విషయంలో ప్రయారిటీ ఇలా పెట్టుకుంటుంది. మరి బీజేపీలో చేరిన వారికే ఈ పరిస్థితి ఉంటే మిత్రుల విషయంలో వేరేగా చెప్పాల్సింది లేదు అని అంటున్నారు. గవర్నర్ పదవులు ఇవ్వాలనుకుంటే ఏదో ఒక చోట ఇవ్వవచ్చు. ఈశాన్య రాష్ట్రాలలో అయినా సర్దుబాటు చేయవచ్చు. కానీ ఆ పదవులు కూడా బీజేపీలో వరిష్ట నేతలకే అన్న రూల్ పెట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. అందువల్ల టీడీపీ వాటా ఎంత అంటే జవాబు చెప్పడం కష్టమే అని అంటున్నారు. అయితే 2014లో రాజకీయం వేరు, ఇపుడు వేరు అన్నది కూడా ఉంది కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి టీడీపీ మద్దతు అవసరంగా ఉంది. దాంతో టీడీపీకి ఒక గవర్నర్ పదవి అయినా ఇస్తారు అన్న ఆశలు ఉన్నాయి. ఆ ఒక్కటీ మాత్రం దక్కేది అశోక్ కే అంటున్నారు. ఆయన మోడీకి బాగా నచ్చిన రాజకీయ నాయకుడు కావడం వల్ల ఆ విధంగా టీడీపీ కోటా తమ మాట అని ఉభయకుశలోపరి గా చేసుకుని ఈ పదవి ఇవ్వవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# రామయ్యకు పట్టాభిషేకం

**(1వపేజీ తరువాయి)**స్వామి వారిని ఊరేగింపుగా మిథిలా ప్రాంగణముకు తీసుకొచ్చారు. శిల్పకళా శోభిత కళ్యాణ మండపంపై స్వామివారిని వేంచేంప జేశారు. అర్చక స్వాములు తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణం ధరింప చేశారు. శ్రీరామ పట్టాభిషేక పారాయణం గావించారు.ఋగ్వేద ము, యజుర్వేదం, సామవేదం, ఆదరణ వేదం, విష్ణు పురాణం, భగవత్ శాస్త్రం తదితర పారాయణ ములు కూడా గావించారు. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ చేశారు. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ గావించారు. 11 శ్లోకాలను పట్టించి స్వామివారికి హారతి ఇచ్చారు. అర్చక స్వాములు భక్తులచే పలు స్తోత్రాలను పఠింపజేశారు. శ్రీరామ నామ స్మరణలతో మిథిలా ప్రాంగణం ప్రతిధ్వనించింది. పట్టాభిషేకం అనంతరం భక్తులపై అర్చక స్వాములు పుణ్య నదీ జలాలను చల్లారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శ్రీరామ పట్టాభిషేకం వేడుకకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మహోత్సవాన్ని ఆద్యాంతం తిలకించారు. తొలుత రామాలయంను గవర్నర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఐటీడీఏ పిఓ రాహుల్, రామాలయం ఈవో రమాదేవి తదితరులు పట్టాభిషేకం వేడుకలో పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య వేడుకలైన శ్రీ సీతారాముల వారి కళ్యాణం, శ్రీ రామ పట్టాభిషేకంకు దేశ నలుమూలల నుంచి హాజరైన భక్తజనం తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగింది. ఈ వేడుకల విజయవంతంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రామాలయం ఈవో కీలక భూమిక పోషించారు

# సామాన్యుడిపై గ్యాస్ బండ

**(1వపేజీ తరువాయి)**కిలో సీఎన్‌జీపై రూ. 1 పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గతవారం ఇన్‌పుట్ సహజ వాయువు ధరలను ప్రభుత్వం దాదాపు 4 శాతం పెంచిన నేపథ్యంలో తాజాగా సీఎన్‌జీ ధరలను కిలోకు రూ.1 చొప్పున పెంచింది.

ఇది దేశ రాజధానితోపాటు ఇతర నగరాలకు వర్తిస్తుంది. ఢిల్లీలో కిలో సిఎన్‌జీ ధర రూ. 75.09కి చేరుకుందని నగరానికి చెందిన గ్యాస్ రిటైలర్ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ఎక్స్ వేదికగా తెలిపింది.

**పదకొండేండ్లూ భారమే**

2014లో మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వంటగ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరిగాయి.

2014లో రూ. 399గా ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర.. తాజా పెంపుతో రూ. 920కు చేరింది. అంటే పదకొండేండ్ల వ్యవధిలో గ్యాస్ ధరలు ఏకంగా 130. 57 శాతం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్యారెల్ ముడిచమురు ధర నాలుగేండ్ల కనిష్ఠానికి చేరినప్పటికీ, దేశీయంగా ఇంధన ధరలను మాత్రం కేంద్రంలోని ఎన్డీయే సర్కారు సవరించకపోగా గ్యాస్ ధరలను పెంచింది. దీంతో కేంద్ర సర్కారు వైఖరిపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల

**(1వపేజీ తరువాయి)**ఉగ్రవాద సంస్థ సహ వ్యవస్థాపకుడు యాసిన్ భత్కల్ ప్రధాన నిందితుడని తేలింది. నిందితులలో అసదుల్లా అఖ్తర్, వకాస్, తెహసీన్ అఖ్తర్, ఎజాజ్ షేక్, సయ్యద్ మక్బూల్ నిందితులుగా ఉన్నారు. మూడేళ్లపాటు జరిపిన విచారణ అనంతరం.. నిందితులపై మరణశిక్ష పడింది. ఈ కేసుతో పాటు పలు ఉగ్రదాడుల్లో కీలకంగా వ్యవహరించిన యాసిన్ భత్కల్‌ను 2013లో బీహార్- నేపాల్ బోర్డర్‌లో పట్టుకున్నారు. దిల్లీ(2008), దిల్ సుఖ్ నగర్ పేలుళ్ల కేసుతో పాటు ఇతర కేసుల్లో దోషిగా తేలడంతో తీహార్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

# తెలంగాణ బీజేపి అధ్యక్షుడికి తీవ్రపోటీ

**(1వపేజీ తరువాయి)**సమయంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైంది కాబట్టి తెలంగాణాలో బీజేపీని ప్రజలకు ప్రత్యామ్నాయంగా చూపించాలని భావిస్తుంది. ఇక తెలంగాణలో బీసీ నినాదంతో ముందుకు వెళ్లాలి బీసీలను తమవైపే తిప్పుకోవాలి అని అన్ని పార్టీల వాళ్ళు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే బీసీ సామాజిక వర్గం నుంచి పీ సి సి గా మహేష్ గౌడ్ కి అవకాశం కల్పించింది. బీజేపీ బీసీ రథ సారథి ఎంపిక వెనుక ఎన్నికల హామీలో బాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాట కల్పిస్తామని చెబుతుంది . మరి కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టాలి అంటే బీజేపీ రథ సారథిగా బీసీకి అవకాశం ఇచ్చి బీసీ ఓటు బ్యాంకును తమ ఖాతాలో వేసుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఎంపీ ఈటెల రాజేందర్ కు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్టుగా తెలుస్తుంది. బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీలో జోష్ ఇక బీజేపీ తెలంగాణా రథసారధిగా బండి సంజయ్ పని చేసిన సమయంలో పార్టీ దూకుడు చూపించింది. బండి సంజయ్ ను మార్చకుండా ఉంటే తెలంగాణా రాష్ట్రంలో బీఆర్ఎస్ కు అప్పుడు ప్రత్యామ్నాయంగా బీజేపీనే కనిపించి ఉండేది అన్నది తెలంగాణా రాష్ట్రంలో అందరూ ప్రధానంగా చర్చించిన అంశం. బండి సంజయ్ ను మార్చటమే పార్టీకి చేటు చేసిందని భావించిన వారు కూడా లేకపోలేదు. పోటీలో బండి సంజయ్, ఈటల రాజేందర్ బండి సంజయ్ ను మార్చటం వల్లే అనూహ్యంగా కాంగ్రెస్ పేరు తెరమీదకు వచ్చిందని, ఫలితంగా తెలంగాణా రాష్ట్రంలో బీజేపీ అధికారం పోగొట్టుకుందని భావించిన వారు కూడా లేకపోలేదు. ఇక ప్రస్తుతం కూడా బండి సంజయ్ కు అవకాశం ఇస్తే మళ్ళీ బీజేపీ దూకుడు చూపించే అవకాశం ఉంటుందని అంటున్నారు. బండి సంజయ్ ఇప్పటికే కేంద్ర మంత్రిగా ఉన్న క్రమంలో బీసీల నుండి ఈటల రాజేందర్ కు అవకాశం ఇచ్చినా బీజేపీ బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. ఆశావహుల తీవ్ర ప్రయత్నాలు ఇక బీసీల పేరే వినిపిస్తున్న క్రమంలో డీకే అరుణ,రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, పేరాల శేఖర్ ఇలా చాలా మంది సీనియర్ల పేర్లు తెరమీదకు వస్తున్నాయి. ఎవరికి వారు తమకు అవకాశం కావాలని కోరుతున్నట్టు సమాచారం. బీసీ సామాజిక వర్గాలవారిగా అవకాశం వస్తె ప్రభుత్వాన్ని ఎండగడతా అని ధర్మపురి అరవింద్ చెప్తున్నారు. ఇక ఆశావహులు అందరూ ఎవరికి వారు తాము ఏమి చెయ్యగలమో చెప్తున్నారు. అధ్యక్షుడి ప్రకటన జాప్యానికి కారణం ఎమ్మెల్సీ పలితాలేనా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎన్నికలో బీజేపీ రెండు చోట్ల విజయం సాధించడంతో బీజేపీ శ్రేణుల్లో నయాజోష్ మొదలైంది . ఇకనుండి ఏ ఎన్నికలు వచ్చిన బీజేపీనే గెలుస్తుంది అనే నమ్మకంతో ఉన్న బీజేపీ నాయకత్వం ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకోనుంది. పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని పార్టీ సంఘటన కార్యదర్శి చంద్ర శేఖర్ తివారి సూచించారు.

## వివాదంలో వైసీపీ ఎమ్మెల్యే?

**(1వపేజీ తరువాయి)**ఉన్న వారంతా ఆయన్ను ఎందుకు వారించలేదనే చర్చ జరుగుతోంది. అలాగే ఆయన తాళి కట్టిన తర్వాత అయినా వారు గుర్తించలేదని అర్థమవుతోంది. అక్కడికి వచ్చిన భక్తులు కూడా ఈలలు వేస్తూ ఈ కార్యక్రమంలో సందడి చేసినట్లు దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనిపై విరూపాక్షి కానీ, వైసీపీ కానీ ఇప్పటిపరకూ స్పందించలేదు.

## సెక్స్ వర్కర్లపై కేసులు పెట్టొద్దు

**(1వపేజీ తరువాయి)**నేరస్తులుగా పరిగణించడం కాకుండా, వారి పునరావాసానికి కృషి చేయాలని తెలిపారు. వ్యభిచారం చేయించే వారిపై దృష్టి సారించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అభిప్రాయపడ్డారు. మధ్యప్రదేశ్ పోలీసుల ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మానవ అక్రమ రవాణా, మహిళల అక్రమ వ్యాపారాన్ని అరికట్టడానికి ఈ విధానం ఎంతవరకు ఉపయోగపడుతుందో వేచి చూడాలి. అయితే, సెలిక్స్ వర్కర్ల పట్ల పోలీసుల దృక్పథంలో వచ్చిన ఈ మార్పును పలువురు హర్షిస్తున్నారు. వారి మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి.. వారిని గౌరవంగా చూడటానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని భావిస్తున్నారు. మొత్తానికి మధ్యప్రదేశ్ పోలీసుల ఈ సంచలన నిర్ణయం వ్యభిచారం , సెక్స్ వర్కర్ల పట్ల సమాజం యొక్క దృక్పథాన్ని మార్చే దిశగా ఒక ముందడుగు అని చెప్పవచ్చు. ఈ కొత్త విధానం అమలులోకి వస్తే, సెక్స్ వర్కర్లు కొంతవరకు ఊరట చెందే అవకాశం ఉంది.

## కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు..

**(1వపేజీ తరువాయి)**2020 తర్వాత తొలిసారి భారీగా పతనమైన నిఫ్టీ భారత స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. ప్రపంచ మార్కెట్‌లో ప్రతికూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా సైతం పన్నులు ప్రకటించింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తప్పదనే సంకేతాల మధ్య భయాందోళనలు పెరిగాయి. భారత స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. ప్రపంచ మార్కెట్‌లో ప్రతికూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా సైతం పన్నులు ప్రకటించింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తప్పదనే సంకేతాల మధ్య భయాందోళనలు పెరిగాయి. దానికి తోడు అమెరికాలో మాంద్యం భయాలు ఎక్కువయ్యాయి. దాంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఫలితంగా మార్కెట్‌లో భారీగా అమ్మకాలు జరిగాయి. సెన్సెక్స్ మూడుశాతానికిపైగా నష్టపోయింది. సెన్సెక్స్. నిఫ్టీ దాదాపు పదినెలల కనిష్ఠానికి చేరాయి. నిఫ్టీలో లిస్టయిన కంపెనీల విలువ రూ.20లక్షల కోట్ల వరకు పతనమైంది. క్రితం సెషన్ (శుక్రవారం ముగింపు 75,364.69) తో పోలిస్తే సెన్సెక్స్ 71,449.94 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు 4వేల పాయింట్ల దాకా పతనమైంది. కేవలం పది సెకన్లలోనే మార్కెట్‌లో రూ.18లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. ఇంట్రాడేలో 73,403.99 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 71,425.01 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది.

చివరకు 2,226.79 పాయింట్ల నష్టంతో 73,137.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే బాటలో కొనసాగింది. ప్రారంభంలోనే వెయ్యి పాయింట్లకుపైగా పతనమైంది. చివరకు 742.85 పాయింట్ల నష్టంతో 22,161.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పది నెలల తర్వాత కనిష్ఠానికి చేరుకున్నాయి. ముఖ్యంగా నిఫ్టీ 2020 మార్చి తర్వాత భారీగా పతనమైంది. మార్కెట్‌లో దాదాపు 559 షేర్లు పురోగమించగా, 3,372 షేర్లు కుప్పకూలాయి. నిఫ్టీ అత్యధికంగా ట్రెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడింది. ఇక మార్కెట్‌లో మెటల్ ఇండెక్స్ 6.7 శాతం, రియల్టీ ఇండెక్స్ 5.6 శాతం, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో, ఎనర్జీ, ఐటీ 2.5 నుంచి 4 శాతం తగ్గడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.4 శాతం నుంచి 4 శాతం చొప్పున తగ్గాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు సైతం భారీ నష్టాల్లో కొనసాగాయి. 2008 తర్వాత ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోయాయి. మాంద్యం భయాలు మెటల్ కంపెనీల షేర్లు భారీగా నష్టాలను చవిచూశాయి.

### బట్టతలపై జుట్టు మొలిపిస్తా.. పెద్దఎత్తున ప్రచారం

**హైదరాబాద్-నవభూమి:** బట్టతలపై జుట్టు మొలిపిస్తానని ప్రచారం చేయడంతో పాతబస్తీలోని ఓ దుకాణం ఎదుట భారీ ఎత్తున బారులు తీరుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీకి చెందిన వజీర్‌నగరానికి వచ్చి ఫతేదర్వాజ-చందూలాల్ బారాదరి రహదారిపై బిగ్‌బాస్ పేరుతో హెయిర్ సెలూన్‌ఏర్పాటు చేశాడు. బట్టతలపై వెంట్రుకలు మొలిపించే మందు తనవద్ద ఉందంటూ ప్రచారం చేశాడు. బట్టతలతో విసిగిపోతున్నవారు నెల రోజులుగా అతడి సెలూన్ ముందు బారులు దీరుతున్నారు. ప్రస్తుతం రోజుకు వంద మంది క్యూ కడుతున్నారు.

వజీర్ ముందుగా బాధితులకు గుండుగీసి ఏదో మందును పూస్తున్నాడు. మందుకు డబ్బులు తీసుకోవడం లేదు. గుండు గీసినందుకు రూ.వంద వసూలు చేస్తున్నాడు. గుండు బయట గీయించుకుని వస్తే ఉచితంగానే మందు రాస్తానని ఆఫర్ ఇస్తున్నాడు. బట్టతలకు ఉచితంగా మందు ఇస్తుండడంతో నగరం నలుమూలల నుంచి జనం రావడం మొదలైంది. దీంతో ఆ రహదారిపై ట్రాఫిక్ జామ్ కూడా అవుతోంది.



## తరచు బీహార్‌కు రాహుల్... వ్యూహాత్మకంగా కాంగ్రెస్



పాట్నా: కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి బీహార్ లో పర్యటించారు. గత మూడు నెలల్లో ఆయన బీహార్‌లో పర్యటించడం ఇది మూడోసారి. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఎన్డీయే కూటమిని గద్దెదింపాలనే వ్యూహంతోనే కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోందని తెలుస్తోంది. ఇందులో భాగంగానే బెగుసరాయ్ జిల్లాలో కాంగ్రెస్ నిర్వహించిన 'పలాయన్ రోకో, నౌకరీ దో' పాదయాత్రలో రాహుల్ గాంధీ సోమవారంనాడు పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు ఎన్ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జి కన్హయ్య కుమార్ నేతృత్వం వహించారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీతో కలిసి పనిచేయనున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించింది. బీహార్‌లో అదనపు సీట్లు దక్కించుకునే అవకాశంపై కాంగ్రెస్ ఎలాంటి స్పష్టత ఇవ్వనప్పటికీ ఆ పార్టీ నేతలు మాత్రం ఎన్నికల్లో తమ పార్టీ 'ఏ' టీమ్‌గా ఉండబోతోందని, బీ టీమ్‌గా కాదని చెబుతున్నారు. ఆ క్రమంలో బీహార్‌లో మరిన్ని సీట్లు రాబట్టుకోవడమే కాంగ్రెస్ పార్టీ తాజా వ్యూహంగా చెబుతున్నారు. బీహార్‌లో ఎంప్లాయిమెంట్ ఎజెండాకు మద్దతుగా తాను యాత్రలో పాల్గొంటున్నట్టు రాహుల్ గాంధీ ప్రకటించడం కూడా ఇందులో భాగంగానే అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో ఆర్జేడీ పొత్తుతో కాంగ్రెస్ 70 సీట్లలో పోటీ చేసినప్పటికీ 19 సీట్లు మాత్రమే దక్కించుకుంది.



# ట్రంప్ దెబ్బకు.. భారత్ వైపు ఆ దేశాల చూపు.. దిగుమతులపై కేంద్రం నిఘా?



**న్యూయార్కు-నవభూమి:** మన దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 26 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అలాగే చైనా ఉత్పత్తులపై 34 శాతం, వియత్నాంపై 46 శాతం, థాయ్‌లాండ్ పై 36 శాతం వరకు విధిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా దేశాల నుంచి భారత్‌కు భారీగా దిగుమతులు అయ్యే అవకాశం ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం పరిశీలన నిమిత్తం అంతర్ మంత్రిత్వ బృందం ఏర్పాటు చేసింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ దేశాల వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపనుంది. భారత్ నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై ఏకంగా 26 శాతం మేర సుంకాలు విధించింది అమెరికా. ఇక చైనా ఉత్పత్తులపై 34 శాతం, థాయ్‌లాండ్ పై 36 శాతం, వియత్నాంపై 46 శాతం మేర సుంకాలు విధించింది. ఈ పరిస్థితుల్లో ఆయా దేశాల నుంచి అమెరికాకు వెళ్లాల్సిన ఉత్పత్తులు, మన దేశానికి దిగుమతి అయ్యే అవకాశాలు ఉన్నాయి. అలా మన దేశంలోకి ఇబ్బడిముబ్బడిగా దిగుమతి కాకుండా చూసేందుకు కేంద్రం అప్రమత్తమైంది. నిఘా నిమిత్తం కేంద్రం ఒక అంతర్ మంత్రిత్వ బృందాన్ని ఏర్పాటు చేసింది.

ఈ బృందంలో రెండు విభాగాలు ఉంటాయి. ఒకటి వాణిజ్య, రెండోది రెవెన్యూ విభాగాలు ఉండగా వాటితో పాటు పరిశ్రమల, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగ అధికారులూ ఉంటారు. దిగుమతుల్లో హెచ్చుతగ్గులు సాధారణ స్థితిలో ఉండేలా గగన, సముద్ర మార్గాల ద్వారా వచ్చే దిగుమతులపై వీరు నిఘా వేస్తారు. అమెరికాకు బదులుగా భారత్‌కు మళ్లే దిగుమతుల్లో ముఖ్యంగా వినియోగదారు వస్తువులు, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఉక్కు వంటివి ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, దేశీయ పరిశ్రమ తనకు కావాల్సిన వస్తువులు అందుబాటు ధరల్లో పొందేందుకు ఇది మంచి అవకాశమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఎగుమతులకు అవకాశాలు..

అమెరికా భారత్‌పై 26 శాతం సుంకాలు విధించింది. ఈ క్రమంలో మన ఎగుమతిదారులకు కొత్త మార్కెట్లు అన్వేషఇంచేందుకు, విక్రయాలకు కేంద్రం సాయం అందించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వీరికి అందుబాటు రేట్లలో లోన్లు ఇవ్వడం, ఐరోపా సమాఖ్య, ఒమన్, బ్రిటన్, న్యూజిలాండ్ వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై వేగంగా చర్చించడం వంటివి చేయవచ్చని పేర్కొన్నారు. అమెరికా మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా ఆస్ట్రేలియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, రష్యా, సింగపూర్, సౌదీ అరేబియా, ఇండోనేషియా, నెదర్లాండ్స్, తుర్కియో, యూఏఈ, బ్రిటన్, వియత్నాం వంటి దేశాలను గుర్తించారు.

## విదేశీ విద్యార్థుల మీద భారీ బాంబ్ వేసిన ట్రంప్



**న్యూయార్కు-నవభూమి:** అగ్ర రాజ్యం అమెరికాలో భావస్వేచ్ఛ ఎక్కువన్న మాట తరచూ వినిపిస్తుంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. ఆ వాదనల్లో ఎలాంటి నిజం లేదన్న విషయాన్ని తేల్చి చెప్పేలా నిర్ణయాలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే.తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయం పెను సంచలనంగా మారింది. అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో పలువురికి ఈమెయిల్స్ వచ్చాయి. వీటి సారాంశం.. మీ వీసా రద్దైంది. మీ దేశానికి మీరు వెళ్లిపోండని. ఇండియాకు వస్తే జైలుకే..యూట్యూబర్ అన్వేష్ కు మాస్ వార్నింగ్.. దీనికి కారణం.. విదేశీ విద్యార్థులు ఆందోళనల్లోనూ.. నిరసనల్లో పాల్గొనటమే. ఇలా పాల్గొన్న విద్యార్థుల్ని దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లుగా పేర్కొంటూ రాత్రికి రాత్రి వీసా రద్దు చేసినట్లుగా పేర్కొంటూ ఈమెయిల్స్ పంపారు. ఈ తరహా ఈమెయిల్స్ ను అందుకున్న వారిలో భారత విద్యార్థులు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. వీసాలు రద్దైన విద్యార్థులు తక్షణమే దేశాన్ని వీడాలని.. లేదంటే బలవంతంగా వారి దేశాలకుతరలిస్తామన్న హెచ్చరికలు చేయటం గమనార్హం. విశ్వవిద్యాలయాల్లో జరిగిన వివిధ ఆందోనల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన విదేశీ విద్యార్థులతో పాటు.. ఆందోళనల్లో పాల్గొన్న వారికే కాకుండా ఆ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన వారికి కూడా ఇదే తరహాలో ఈమెయిల్స్ వెళ్లాయి. చివరకు ఈ పోస్టులకు లైకులు కొట్టిన వారికి వార్నింగ్ లు వెళ్లటం విశేషం. బ్యూరో ఆఫ్ కాన్సులర్ ఆఫైర్స్ వీసా నుంచి విదేశీ విద్యార్థులకు ఈమెయిల్స్ వెళుతున్నాయి. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ నుంచి అందుతున్న ఈ మెయిల్స్ లో.. "అమెరికా జాతీయ చట్టంలోని సెక్షన్ 221(ఐ) ప్రకారం.. మీ వీసా రద్దు అయ్యింది. ఈ మేరకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ కు బాధ్యత వహించే అధికారులకు సమాచారం వెళ్లింది. మీ వీసా రద్దు అంశం గురించి సంబంధిత కాలేజీ యాజమాన్యానికి తెలియజేయొచ్చు" అని పేర్కొంటున్నారు. ఈ మెయిల్స్ వచ్చిన వారు తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోం యాప్ ను ఉపయోగించుకోవాలన్న సూచన చేసింది. ఆన్ లైన్ లో యాక్టివ్ గా ఉండటం వల్ల కలిగే పరిణామాలు.. భావ ప్రకటనా స్వేచ్ఛపై పరిమితులు ఆందోళనకు గురి చేసేలా మారాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్వేచ్ఛగా.. ప్రజాస్వామ్య బద్ధంగా అభిప్రాయాల్ని వెల్లడించే అగ్రరాజ్యంలో ఇకపై అలాంటివేమీ ఉండన్న హెచ్చరిక తాజా వ్యవహారం స్పష్టం చేస్తుందని చెప్పక తప్పదు.

## ఫేక్ అసభ్యకర వార్తలను ఆపేందుకు ఛాంబర్ పాలసీ




**హైదరాబాద్ - నవభూమి:** తెలుగు సినీపరిశ్రమలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇకపై తప్పుడు వార్తలను, అసభ్యకర వార్తలను ప్రచారం చేసే మీడియా సంస్థలపై కొరడా ఝులిపించేందుకు తెలుగు ఫిలించాంబర్ ఒక కొత్త పాలసీని రూపొందిస్తోంది. ఆ మేరకు మీడియా సమక్షంలో ఛాంబర్ ప్రతినిధులు మీడియా సమక్షంలో ఒక సమావేశం నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. సినిమా జర్నలిస్టుల్లో మీడియా, ప్రింట్ మీడియా, ఫోటో జర్నలిస్టులు, యూట్యూబ్ చానెళ్లు, మ్యాగజైన్లు సహా అన్ని మీడియా సంస్థలను పిలిచి ప్రత్యేకించి ఫిలింఛాంబర్ ఒక సమావేశం నిర్వహించింది. నటీనటులపై అసభ్యకర కామెంట్లు, అశ్లీలత, నటీనటులపై అసభ్యకర ప్రశ్నలు వేయడం వంటి వాటిని నివారించాలని ఛాంబర్ నిర్ణయించినట్టు ఈ సమావేశంలో తెలిపింది. తప్పుడు వ్యాఖ్యలతో యూట్యూబ్‌లో థంబ్ నైల్స్ పెట్టేవారిపైనా ఛాంబర్ అభ్యంతరం వ్యక్తం చేసింది. యూట్యూబర్ అన్వేష్‌కు మాస్ వార్నింగ్.. తప్పుడు వార్తలను సృష్టించేవారిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఛాంబర్ భావిస్తోంది. ఇటీవలి సినిమా వార్తలపై చాలా కసరత్తు చేసాక ఈ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఇటీవలి కొన్ని సంఘటనలను కూడా ఛాంబర్ ప్రతినిధులు ప్రస్థావించారు. అలాంటి వాటిని రిపీట్ చేయనివ్వకూడదని నిర్ణయించినట్టు తెలిపారు. క్రియేటివిటీ పేరుతో ఇష్టం వాచినట్టు థంబ్ నెయిల్స్ ఫేక్ న్యూస్ లకు సరిహద్దులను నిర్ణయించాల్సిన తరుణం ఇప్పుడు ఆసన్నమైందని భావిస్తున్నారు.

## సిట్ చేతికి 'బెట్టింగ్ యాప్ కేసులు : ఏం జరుగనుంది?

**హైదరాబాద్ - నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం చట్టవిరుద్ధ బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపింది. టాలీవుడ్ ప్రముఖ నటులు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్స్, యూట్యూబర్స్ పాల్గొన్న కేసులతో సహా అన్ని సంబంధిత కేసులను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని సెషన్స్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా ఈ విషయం వెల్లడైంది. ఈ పరిణామం ఈ వేదికల వ్యాప్తిని రాష్ట్ర ప్రభుత్వం ఎంత తీవ్రంగా పరిగణిస్తుందో తెలియజేస్తుంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రాష్ట్ర అసెంబ్లీలో చట్టవిరుద్ధ బెట్టింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేసిన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ ఈ కేసును చురుకుగా పర్యవేక్షిస్తుండటం ప్రభుత్వ నిబద్ధతను మరింత స్పష్టం చేస్తుంది. గతంలో ఈ కేసులు హైదరాబాద్‌లోని పంజాగుట్ట , మియాపూర్ పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. అయితే ఈ బెట్టింగ్ యాప్‌ల వెనుక ఉన్న నెట్‌వర్క్ యొక్క సంభావ్య పరిధి.. సంక్లిష్టతను, అలాగే ప్రముఖ వ్యక్తుల ప్రమేయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కు అప్పగించాలని నిర్ణయించింది. దీంతో ఈ బెట్టింగ్ విషయంలో మరింత సమగ్రమైన విస్తృతమైన దర్యాప్తుకు ప్రభుత్వం మొగ్గుచూపింది..అయితే, ఇద్దరు నటులు తమ నిర్దోషిత్వాన్ని గతంలోనే ప్రకటించారు. వారు కొన్ని సంవత్సరాల క్రితం నటించిన ప్రకటనలు ఇప్పుడు ప్రసారం కావడం లేదని, అందువల్ల ప్రస్తుత సమస్యకు వాటి ప్రాముఖ్యత తగ్గిపోయిందని వారి వాదన. అంతేకాకుండా తమ కేసులో అవసరమైన చట్టపరమైన పత్రాలు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వారు చెబుతున్నారు. సెలబ్రిటీల వాదనలు ఎలా ఉన్నప్పటికీ కేసులను సిట్‌కు బదిలీ చేయడం ద్వారా ప్రభుత్వం ఈ సమస్యపై అన్ని అంశాలను, ఈ వేదికలను ప్రోత్సహించిన వ్యక్తుల పాత్రతో సహా పూర్తిగా పరిశీలించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## మయన్మార్‌లో మృత్యువిలయం 1000 దాటిన మృతులు.. భారత్ నుంచే తొలిసాయం



**మయన్మార్-నవభూమి:** నిమిషాల వ్యవధిలోనే సంభవించిన ఆరు భారీ భూకంపాలు మయన్మార్‌లో పెను విధ్వంసం సృష్టించాయి. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటి వరకూ 1000 మంది మృతిచెందారని.. దాదాపు 2,400 మంది గాయపడ్డారని మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. భూప్రకంపనలకు భయపడిపోయిన జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పొరుగున ఉన్న థాయ్‌లాండ్‌ను సైతం భూకంపం వణికించింది. రాజధాని బ్యాంకాక్‌లో రిక్టర్ స్కేలుపై 6.4, 7.3 తీవ్రతతో రెండుసార్లు భూకంపం వచ్చింది. భూకంపం ప్రభావం భారత్ సహా ఆగ్నేయాసియా దేశాల్లోనూ కనిపించింది. పలుచోట్ల భూప్రకంపనలు చోటుచేసుకు న్నాయి. థాయ్ లాండ్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి 10 మంది చనిపోగా.. 100 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. అంతర్యుద్ధం కారణంగా మయన్మార్‌లో సైనిక పాలన కొనసాగడంతో అత్యవసర సేవలు తీవ్ర బలహీన మయ్యాయి. దీంతో విపత్తును సమర్థంగా నిర్వహించడానికి అవి సన్నద్ధంగా లేవు. పశ్చి మండేలాలో భవనాలు పేకమేడల్లా కుప్పకూలిపోవడంతో శిథిలాల కింద చిక్కుకున్నవారిని స్థానికులు, ఎమర్జెన్సీ వర్కర్లు బయటకు తీయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. సగైంగ్ పట్టణంలో ఇర్రావడ్డీ నదిపై 100 ఏళ్ల కిందట నిర్మించిన అవా వంతెన ధ్వంసమైంది. ఈ కష్టకాలంలో తమకు అంతర్జాతీయ సాయం కావాలని సైనిక ప్రభుత్వ అధినేత అంగ్ హ్లాంగ్ అభ్యర్థించారు. ఏ దేశమైనా.. ఏ అంతర్జాతీయ సంస్థ సహకారం అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మయన్మార్ పరిస్థితికి చలించిపోయిన భారత్.. అండగా నిలుస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. థాయ్‌లాండ్, మయన్మార్‌లో భూకంపం సృష్టించిన విధ్వంసం ఆందోళన కలిగిస్తోందని, అక్కడి ప్రజలు క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని మోదీ తెలిపారు. వీలైనంత మేర సాయం చేస్తామని మాటిచ్చిన మోదీ.. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో హుటాహుటిన మయన్మార్‌కు టెంట్లు, బ్లాంకెట్స్, వాటర్ ప్యూరిఫైర్లు, అత్యవసర ఔషధాలు సహా 15 టన్నుల రిలీఫ్ సామాగ్రిని భారత వైమానిక దళ విమానంలో ఆ దేశానికి పంపారు. అమెరికాతో పాటు ఐరోపా దేశాలు సాయానికి ముందుకొచ్చాయి. మయన్మార్ పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఆ దేశానికి మేము సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రకటించారు.అటు, థాయ్‌లాండ్‌లో భూకంప తర్వాత పరిస్థితిని సమీక్షించేందుకు ఆ దేశ ప్రధాని షినవత్ర అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. కాగా, థాయ్‌లాండ్‌లో ఉండే భారతీయులు ఎవరూ గాయపడలేదని అక్కడ భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఇదిలా ఉండగా, మయన్మార్‌లో తరుచూ భూకంపాలు చోటుచేసుకోడానికి సగాయింగ్ ఫాల్ట్ కారణమని భావిస్తున్నారు.

## భార్యతో విడాకులు.. ప్రేమ కోసం తపన.. రూ.6.5 కోట్లు హుష్ కాకి..!



**నోయిడా-నవభూమి:** అతడికి కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయి. కానీ ఇంట్లో మనశ్శాంతి లేదు. రోజూ భార్యతో గొడవలు. దాంతో ఇద్దరూ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత విడాకులు తీసుకున్నారు. విడాకుల తర్వాత తనను ప్రేమించే వ్యక్తిని వెతికి పెళ్లి చేసుకోవాలని అతడు నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఓ డేటింగ్ యాప్‌లో తన ప్రొఫైల్‌ను అప్‌లోడ్ చేశాడు. ఓ యువతితో పరిచయం పెంచుకుని రూ.6.5 కోట్లు పోగొట్టకున్నాడు.

వివరాల్లోకి వెళ్తే.. నోయిడాకు చెందిన దల్జీత్ సింగ్ అనే వ్యక్తి భార్యతో విడాకుల అనంతరం మరో తోడు కోరుకున్నాడు. తనను ఎంతగానో ప్రేమించే వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకోవాలని భావించాడు. కొన్నాళ్లు డేటింగ్ చేసి తనకు అన్ని విధాల నచ్చిన మహిళను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఓ డేటింగ్ యాప్‌లో తన ప్రొఫైల్‌ను అప్‌లోడ్ చేశాడు. ఢిల్లీలో ఓ కంపెనీకి డైరెక్టర్‌గా ఉన్న దల్జీత్ సింగ్‌కు అనిత అనే అమ్మాయితో డేటింగ్ మ్యాచ్ కుదిరింది. తన ప్రొఫైల్ ఆమె తనది హైదరాబాద్‌గా పేర్కొన్నది.సాధారణ పలకరింపులతో మొదలైన ఆ ఇద్దరి పరిచయం అతికొద్ది కాలంలోనే దగ్గరి సంబంధంగా మారిపోయింది. ఇద్దరూ ప్రాణ స్నేహితులయ్యారు. దల్జీత్ నమ్మకాన్ని చూరగొన్న తర్వాత అనిత తాను చెప్పిన విధంగా ట్రేడింగ్ చేస్తే భారీగా లాభాలు రాబట్టవచ్చని చెప్పింది. తనకు తెలిసిన మూడు కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని తెలిపింది. దాంతో ముందుగా ఒక కంపెనీలో దల్జీత్ రూ.3.2 లక్షల పెట్టుబడి పెట్టాడు.కొన్ని గంటల్లోనే తన పెట్టుబడిని వాపస్ తీసుకోగా రూ.24 వేల లాభం వచ్చింది. దాంతో అనితపై అతని నమ్మకం రెట్టింపయ్యింది. ఆమె తన మేలును కోరుకునే వ్యక్తని, తనకు మంచి సలహాలు ఇస్తుందని పూర్తిగా నమ్మాడు. అందుకే ఆమె మాటలు నమ్మి తాను అప్పటిదాకా సంపాదించిన రూ.4.5 కోట్లను పెట్టుబడిగా పెట్టాడు. అంతేగాక మరో రూ.2 కోట్ల బ్యాంకు రుణం కూడా తీసుకుని ఇన్వెస్ట్ చేశాడు. అంటే మొత్తం రూ.6.5 కోట్ల పెట్టుబడి పెట్టాడు.తర్వాత తన పెట్టుబడిని తిరిగి తీసుకునేందుకు దల్జీత్ ప్రయత్నించగా పెట్టుబడిలో 30 శాతం కోతపడుతుందని కంపెనీ వెబ్‌సైట్ చూపింది. దాంతో డబ్బును వెనక్కి తీసుకోకుండా అనితను సంప్రదించాలని ప్రయత్నించాడు. కానీ ఆమె అప్పటికే అక్కడి నుంచి జారుకుంది. దాంతో డేటింగ్ యాప్‌లో ఆమె ఇచ్చిన ప్రొఫైల్ ద్వారా ఆచూకీ కనిపెట్టాలని చూశాడు. కానీ ఆ యాప్‌లో ఆమె ఫేక్ ప్రొఫైల్ పెట్టినట్లుగా తేలింది. దాంతో మోసపోయానని గ్రహించిన దల్జీత్ పోలీసులను ఆశ్రయించాడు.

## రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

### ఇకపై టికెట్ కౌంటర్‌లో కొన్నా ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చు!



**న్యూఢిల్లీ-నవభూమి:** రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుభవార్త చెప్పారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్‌కు వెళ్లి కౌంటర్ వద్ద టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు.. వాటిని క్యాన్సిల్ చేసుకోవాలనుకుంటే మళ్లీ కౌంటర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎంచక్కా ఫోన్ తీసి ఆన్‌లైన్‌లోనే దాన్ని రద్దు చేసుకోవచ్చని వివరించారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా 139 నెంబర్‌కు ఫోన్ చేసి అయినా సరే క్యాన్సిల్ చేసుకోవచ్చని తెలిపారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.రైల్లో ప్రయాణించేందుకుగాను రైల్వే స్టేషన్‌కు వెళ్లి కౌంటర్ వద్ద టికెట్లు కొనుగోలు చేస్తుంటారు చాలా మంది. అయితే అనేక కారణాల వల్ల వారు ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటూ.. టికెట్లను క్యాన్సిల్ చేసుకోవాలనుకుంటారు. అయితే ఇప్పటి వరకు ఇందుకోసం కౌంటర్ వద్దకు వెళ్లి క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. ఎంత మంది ఉన్నా ఓపికగా నిల్చుంటేనే టికెట్ వాపసు ఇచ్చేసి డబ్బు తిరిగి పొందవచ్చు. ఇలా ప్రయాణికులకు చాలా సమయం వృథా అవుతున్న విషయాన్ని గుర్తించిన కేంద్ర రైల్వే శాఖ.. ఓ అద్భుతమైన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది.

ముఖ్యంగా కౌంటర్ వద్ద కొనుగోలు చేసిన టికెట్‌ను ఒకవేళ రద్దు చేసుకోవాలనుకుంటే తిరిగి కౌంటర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని.. నేరుగా ఆన్‌లైన్ ద్వారానే దాన్ని రద్దు చేసుకోవచ్చని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అయితే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా 139 నెంబర్‌కు ఫోన్ చేసి టికెట్ రద్దు చేసుకోవచ్చని అన్నారు. రీఫండ్స్ కోసం మాత్రం రిజర్వేషన్ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే బుకింగ్ సమయంలో చెల్లుబాటయ్యే మొబైల్ నెంబర్‌ను మాత్రమే అందిచాల్సి ఉంటుందని అన్నారు. అంతేకాకుండా రైలు ఆలస్యం, రద్దు సమయాల్లో టికెట్లను రద్దు చేయలేమని.. కేవలం సాధారణ పరిస్థితుల్లో మాత్రమే టిక్కెట్లు రద్దు, వాపసు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సదుపాయం వల్ల దేశ వ్యాప్తంగా ఉన్న ఎంతో మంది రైలు ప్రయాణికుల సమయ, శ్రమ ఆదా అవుతుందని వెల్లడించారు.

**టికెట్ ఎలా రద్దు చేసుకోవాలంటే..?**

ముందుగా వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అక్కడ MORE అనే ఆప్షన్ వద్దకు వెళ్తే కౌంటర్ టికెట్ క్యాన్సిలేషన్ అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేస్తే.. కౌంటర్ టికెట్ క్యాన్సిలేషన్ పేజీ ఓపెన్ అవుతుంది. అందులో PNR నంబర్, రైలు నంబర్ సహా క్యాప్చా నమోదు చేయాలి. ఆపై నియమాలు, విధానాలు నిర్ధరించుకుని చెక్ బాక్సును సెలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత సబ్మిట్ బటన్ మీద క్లిక్ చేస్తే.. బుకింగ్ సమయంలో ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు ఓ ఓటీపీ వస్తుంది. దాన్ని మళ్లీ నమోదు చేసి సబ్మిట్ చేస్తే PNR వివరాలు కనిపిస్తాయి. వాటన్నిటినీ ధ్రువీకరించి.. పూర్తి రద్దు కోసం టికెట్ రద్దు చేయండని అనే ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే.. మనకు రావాల్సి డబ్బు మొత్తం స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే ఈ వివరాలతో మొబైల్ నెంబర్‌కు ఓ మెసేజ్ వస్తుంది. దాన్ని తీసుకుని సమీపంలోని స్టేషన్ కౌంటర్లలో చూపిస్తే నేరుగా డబ్బులు పొందవచ్చు.

## ప్లాస్టిక్ వస్తువును గాలిలోకి విసిరిన బాలుడు.. తర్వాత ఏం జరిగిందంటే?



**చండీగఢ్-నవభూమి:** పార్కులో ఆడుకుంటున్న బాలుడు తుంటరి పని చేశాడు. తాడుతో కట్టిన ప్లాస్టిక్ వస్తువును గాలిలోకి విసిరాడు. అయితే పైనున్న హై వోల్టేజీ విద్యుత్ వైరుకు అది తగిలింది. దీంతో పెద్ద శబ్దంతోపాటు మంటలు వ్యాపించాయి. ఆ బాలుడికి తీవ్ర కాలిన గాయాలయ్యాయి. ఇది చూసి అక్కడున్న వ్యక్తులు షాక్ అయ్యారు. భయంతో పరుగులు తీశారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ సంఘటన జరిగింది. 9 ఏళ్ల ఆరవ్ మూడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం వేళ పార్కులో ఆడుకున్నాడు. ఈ సందర్భంగా తాడుతో కట్టిన ప్లాస్టిక్ వస్తువును గాలిలోకి విసిరాడు.కాగా, పార్క్ పైనుంచి వెళు న్న 66 కేవీ హైవోల్టేజీ విద్యుత్ లైన్‌కు ఆ ప్లాస్టిక్ వస్తువు తగిలింది. దీంతో పేలుడు వంటి శబ్దం రావడంతోపాటు తాడు పట్టుకున్న బాలుడికి మంటలు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో షాక్‌తో కిందపడిపోయాడు.మరోవైపు ఇది చూసి అక్కడున్న వారు భయాం దోళన చెందారు. భయంతో దూరంగా పారిపోయారు. ఆ తర్వాత ఆ బాలుడి వద్దకు కొందరు చేరుకున్నారు. తీవ్ర కాలిన గాయాలైన ఆరవ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ బాలుడి పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అమృత్‌సర్‌లోని హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. అయితే ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఏపీ ప్రజల్లో ఎక్కువమందికి ఈ 10 పది రకాల జబ్బులు..

### జిల్లాలవారీగా సర్వే రిపోర్ట్ ఇదే, సంచలన విషయాలు

**అమరావతి-నవభూమి:**ఆంధ్రప్రదేశ్‌లో 80% మంది ప్రజలు పది రకాల జబ్బులతో బాధపడుతున్నారని వైద్య ఆరోగ్య శాఖ నివేదికలో తెలిపింది. ఆసుపత్రుల్లో నమోదయ్యే కేసుల్లో బీపీ, షుగర్, గుండె జబ్బు లు, జీవనశైలి వల్ల వచ్చే వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. శ్వాసకోశ, అంటువ్యా ధులు, కిడ్నీల సమస్యలు, క్యాన్సర్, హైపర్ టెన్షన్, మాతా శిశు ఆరోగ్య సమస్యలు ఇలా వ్యాధులు నమోదవు తున్నాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి సమాచారంతో ఓ నివేదికను తయారు చేశారు. 18 ఏళ్ల వయసు దాటిన 2.15 కోట్ల మందికి స్క్రీనింగ్ చేయించగా.. ఈ విషయాలు బయటపడ్డాయి.. ఇలా భారీగా అనారోగ్య సమస్యలు పెరగడానికి జీవన విధానంలో మార్పులే కారణమని డాక్టర్లు చెబుతున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల వారీగా హెల్త్ రిపోర్టులను వివరించారు.కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల్లో బీపీ, గుండె జబ్బుల కేసులు ఎక్కువగా ఉన్నాయని నివేదికలో తేలింది. అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాల్లో ఈ కేసులు తక్కువగా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. విశాఖ, విజయవాడ, వైఎస్సార్ కడప జిల్లాల్లో మానసిక వ్యాధులు, కుంగుబాటు, మద్యంతో ఆరోగ్యం దెబ్బతిన్న కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఎన్టీఆర్, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ సర్వేలో బీపీతో బాధపడుతున్న వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, పనిఒత్తిడి, ఇతర కారణాలతో మహిళలు అధిక సంఖ్యలో రక్తపోటుకు గురవుతున్నారని తేలింది. బీపీతో పాటు డయాబెటిస్‌తో బాధపడే వారిలో కూడా మహిళలే ఎక్కువ.రాష్ట్రంలో కాలేయ సమస్యలతో బాధుపడుతున్నవారు నెల్లూరు, తిరుపతి, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, శ్రీసత్యసాయి, మన్యం జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు. శ్వాస సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిలో.. నెల్లూరు, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, పశ్చిమగోదావరి, బాపట్ల జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు. నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు. విజయనగరం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, శ్రీసత్యసాయి, మన్యం జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నవారిలో శ్రీకాకుళం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అత్యధికంగా, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నారు. తూర్పుగోదావరి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో హైపర్ టెన్షన్, హార్ట్ స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధుల విషయంలో అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి.కృష్ణా, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో జీవన విధానం వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వాయుకా జులుష్యం, స్మోకింగ్ వంటి కారణాల వల్ల ఆస్తమా, నిమోనియో, సీవోడీపీ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. గ(శ్రీకాకుళం, విజయనగరం, కడప జిల్లాలో వాయుకాలుష్యం, స్మోకింగ్ వంటి కారణాల వల్ల ఆస్తమా, నిమోనియో, సీవోడీపీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు గుర్తించారు.

## సొంత టెలికాం టెక్నాలజీ ఉన్న టాప్-5 దేశాల్లో భారత్ ఒకటి : కేంద్రమంత్రి సింధియా

**న్యూఢిల్లీ-నవభూమి:** సొంత టెలికాం టెక్నాలజీ కలిగిన దేశాల సరసన భారత్ చేరిందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. భారత్ కన్నా ముందు చైనా, ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణా కొరియా మాత్రమే ఈ టెక్నాలజీ ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలికాం కంపెనీలు విలీనవుతున్నాయన్నారు. భారత్‌లో నాలుగు కంపెనీలు ఉన్నాయన్నారు. 2014లో 90కోట్ల మంది మొబైల్ కస్టమర్స్ ఉండగా.. నేడు ఈ సంఖ్య 1.2 మిలియన్లకుపైగా పెరిగిందన్నారు. అప్పుడు 25కోట్ల మంది ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారని.. ప్రస్తుతం 97కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నట్లు తెలిపారు. 2014లో ఆరు కోట్ల మందికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ఉందని.. ఆ సంఖ్య నేడు 94 కోట్లకు చేరుకుందని.. ఇది అమెరికా మొత్తం జనాభా కంటే ఎక్కువ అని తెలిపారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
మంగళవారం
08 । ఏప్రిల్ । 2025
ఎడిట్ పేజీ



## హామీ ఇస్తున్నా.. జైలుకెళ్లేందుకు సిద్ధం.. మమతా దీదీ

**కోల్‌కతా-నవభూమి:** సుప్రీంకోర్టు తీర్పుతో టీచర్ ఉద్యోగాలు కోల్పోయిన వారి గౌరవాన్ని కాపాడేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి తాను మద్దతుగా నిలుస్తానన్నారు. అర్హులైన అభ్యర్థులు టీచర్ ఉద్యోగాలను కోల్పోవడాన్ని తాను అనుమతించనని పేర్కొన్నారు.అయితే వీరికి మద్దతుగా నిలిచినందుకు ఎవరైనా తనను శిక్షించాలనుకొంటే.. జైలుకు వెళ్లడానికి సైతం తాను సిద్ధంగా ఉన్నానని ఆమె కుండ బద్దలుకొట్టారు. తన ప్రమేయం లేని అంశంలోకి తన పేరు లాగుతున్నారంటూ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థులు నిరుద్యోగులుగా మారకుండ ఉండేందు కు తమ ప్రభుత్వం వద్ద ప్రణాళికలున్నాయని ఆమె వివరించారు.

సోమవారం కోల్‌కతాల్లోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో సీఎం మమతా బెనర్జీతో ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి సీఎం మమతా బెనర్జీ పైవిధంగా హామీ ఇచ్చారు. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పునకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. అయితే పరిస్థితిని అత్యంత జాగ్రత్తగా.. న్యాయ బద్దంగా నిర్వహించేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆమె వివరించారు.



## 'చెత్త' రాజకీయాలు !

అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ రెండవసారి ప్రమాణ స్వీకారం చేసే సమయంలో కార్మికవర్గాన్ని ఆకర్షించబోయే శకటం ఒకటి ఇప్పుడు వార్తాంశం అయ్యింది. అది చెత్త సేకరించే వాహనం. చెత్త వాహనానికీ, దేశాధ్యక్షుని ప్రమాణ స్వీకారోత్సవానికీ మధ్య విడదీయరాని ఎన్నికల ప్రచార బంధమే పెనవేసుకుని ఉంది. దేశాధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌ని, ఆయన మద్దతుదారులనీ తక్కువ చేసి చూపే ఉద్దేశంతో అంతా 'చెత్త' అని అభివర్ణించారు. ట్రంప్‌ని తక్కువ చేయాలని చూసిన బైడెన్ వ్యూహం బెడిసికొట్టింది. చెత్త అనే మాటని పట్టుకుని, ట్రంప్ వెంటనే చెత్త సేకరించే ఓ వాహనాన్ని నడుపుతూ తన ఎన్నికల ప్రచారానికి వినూతన ఒరవడి పెట్టారు. ఈ దృశ్యం కార్మిక వర్గాన్ని బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా మిషిగన్, పెన్సిల్వేనియాలో చెత్త నినాదం బ్రహ్మాండంగా పేలింది. ట్రంప్ విజయంలో ఈ రెండూ చాలా కీలకం. ఇప్పుడు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆనాడు ఆయన నడిపిన చెత్త వాహనం డిట్రాయిట్ నుంచి వస్తోంది.సరే, మరి మూడు రోజులలో గృహోన్ముఖం పట్టవలసిన అధ్యక్షుడు జో బైడెన్ నిజంగానే కొన్ని చెత్త మాటలు మాట్లాడారు. పోటీలో కొనసాగినట్టయితే తానే తప్పక విజేతగా నిలిచేవాడినన్నది ఆయన తాజాగా చేసిన ప్రకటన! ఇది ఎవ్వరూ ఊహించనిది! హర్షించనిదీ! చింత చచ్చినా పులుపు చావలేదంటే ఇదే మరి. అవతల కాలిఫోర్నియా కార్చిచ్చుకు తగలబడుతుంటే ఈ పిచ్చి ప్రేలాపన ఏమిటో?! ఈ పైత్యానికి కొనసాగింపుగా డెమొక్రటిక్ పార్టీలో సమైక్యతను కాపాడడానికే పెద్దలు చెప్పడంతో తాను పోటీ నుంచి తప్పుకున్నట్టు బైడెన్ మరో ప్రకటన చేశారు. ఇంతకీ ఎవరా పెద్దలు? ఆ పెద్దలు నడిపిన చెత్త రాజకీయం ఏమిటి? తమకోసం ఏమీ చేయలేదని నల్లవారి శాపనార్థాలు మూటకట్టుకున్న ఒబామా ఒక పెద్ద అయితే, ఈ రోజు కాకపోతే రేపైనా తన జీవిత సహచరిణి అమెరికా అధ్యక్షురాలు కాకపోతుందా అని ఆశగా ఎదురుచూసిన బిల్ క్లింటన్ మరో పెద్ద! నిజమే, ఈ పెద్దలు అతిగా జోక్యం చేసుకోకపోతే ఆ పార్టీకి ఇన్ని కష్టాలు ఉండేవి కావేమో! ఇప్పుడే కాదు, గతంలో కూడా ఈ పెద్దలు తమ పెద్దరికాన్ని పార్టీ మీద రుద్ది, పార్టీ మనుగడని బలహీనపరిచారు. వర్తమాన రాజకీయ చిత్రాన్నే ఉదాహరణగా తీసుకుంటే పార్టీ అభ్యర్థిగా జో బైడెన్‌ను ఎంపిక చేయడానికి ముందు ఆయనతో పోటీ పడిన వ్యక్తి బెర్నీ సాండర్స్. కార్మిక వర్గంలో మంచి పట్టున్న నాయకుడు. బెర్నీ ఎక్కడకు వెళ్లినా మావాడు మంచివాడు అనే పేరు సంపాదించుకున్నాడు. విద్యార్థి దశలో ఉద్యమాలలో పాల్గొని, ఆ తర్వాత కార్మిక వర్గంతో మమేకమై కార్మిక వర్గ పక్షపాతిగా పేరు తెచ్చుకున్నాడు. వెర్మాంట్ సెనెటర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు. 2016లో హిల్లరీ క్లింటన్‌పై, మళ్లీ 2020లో జో బైడెన్‌పై అమెరికా అధ్యక్ష పదవికి తలపడ్డారు. అన్ని విధాలా డెమొక్రటిక్ పార్టీకి ఉజ్వలమైన భవిష్యత్తుకు బంగారుబాట వేయగలిగిన సాండర్స్‌ను ఈ రెండు సందర్భాలలోనూ ఒబామా, క్లింటన్ ద్వయం బరి నుంచి ఉపసంహరించుకునేట్టు చెత్త యంత్రాంగం నడిపారు. సాండర్స్ నాయకత్వ లక్షణాలను కీర్తిస్తూనే ఆయనలోని ప్రగతిశీల భావజాలాన్ని ఒబామా, క్లింటన్ తిరస్కరించారు. సరే పెద్దలు చెబుతున్నారు కదా అని సాండర్స్ వెనుదిరిగారు. మరి హిల్లరీ క్లింటన్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారా అంటే అదీ లేదు. ఎన్నికల ప్రచారంలో చాలా సందర్భాలలో అవాకులు చెవాకులు మామూలైపోయాయి. రిపబ్లికన్లు అంటేనే దేశానికి అరిష్టం అన్నట్టు ఆమె మాట్లాడేవారు. వెళ్లిన ప్రతిచోటా డాబూ దర్పం ప్రదర్శించడం ఆమె విజయావకాశాలను బాగా దెబ్బ తీసింది. డెమొక్రటిక్ పార్టీకి పట్టం కడితే తమ ఉపాధి అవకాశాలపైన తామే నీళ్లు పోసుకున్నట్టు అవుతుందని యువత భావించడం, మరొక పక్క డోనాల్డ్ ట్రంప్ అరచేతిలో వైకుంఠం చూపించడంతో ట్రంప్ విజయం నల్లేరుపై నడకే అయ్యింది. కాని అంత అద్భుతమైన విజయం దరిమిలా మరోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా చాలా తేలికగా గెలవవలసి ఉంది. కాని అలా జరగలేదు. 2020లో జరిగిన ఎన్నికలు జో బైడెన్‌ను అధికార పీఠంపై కూర్చోపెడితే, ఎన్నికల వ్యవస్థనే కూల్చే విఫలయత్నం ట్రంప్ చేశారు. ఆయన ఎంత బుకాయించినా, ఆయన పిలుపు మేరకే ఆయన మద్దతుదారులు వాషింగ్టన్ డి.సి.లోని కేపిటల్‌పై దాడి చేయడం మాయని మచ్చే. తన నడవడికతో, అతి వాచాలత్వంతో తన గొయ్యి తానే తవ్వుకునే పరిస్థితిని ట్రంప్ సృష్టించుకున్నాడు. అంతటితో అమెరికా చరిత్రలో ఆయన శకం ముగిసినట్టు అనిపించింది.కాని అధ్యక్ష భవనంలో అడుగుపెట్టిన నాటి నుంచే జో బైడెన్ మతి స్థిమితం లేని మాటలు, చేతలూ కొట్టొచ్చినట్టు కనిపించాయి. బైడెన్ చేష్టలు పార్టీకి చెరుపు చేస్తాయని మొదటి వారంలోనే బెర్నీ సాండర్స్ డెమొక్రటిక్ పార్టీని హెచ్చరించారు. అయినా పెద్దలు కళ్లు తెరవలేదు. ఫలితంగా బైడెన్ ఇప్పుడు అత్యంత నిష్క్రియాశీలిగా అమెరికా చరిత్ర పుటలలో నిలిచిపోతున్నారు. ఆయన క్రిందపడడం, దేశాధినేతలు, దౌత్య ప్రతినిధులూ ఉన్నప్పుడు వారివైపు గాక అటు ఇటు దిక్కులు చూడడం వంటివి వయసుకు సంబంధించిన సమస్యలు కావచ్చు. వాటితో ఒక దేశాధ్యక్షుని పాలనా సామర్థ్యాన్ని అంచనా వేయడం సబబు కాదు గాని, ఈ నాలుగేళ్లూ ఏ విషయంపైనా స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పలేని వ్యక్తిగా అమెరికన్ ప్రజలు భావిస్తున్న మాట మాత్రం నిజం. ఎన్నో అపవాదులను మూటకట్టుకుని కూడా జో బైడెన్ చివరి రోజులలో తన కుమారుని సహా ఎందరికో క్షమాభిక్ష పెట్టడం దుస్సాహసాలలో మహా దుస్సాహసం! 2014 నుంచి 2024 మధ్య కాలంలో కుమారుడు హంటర్ బైడెన్ చేసిన ఎన్నో నేరాలకు తండ్రి క్షమాభిక్ష పెట్టడం చరిత్రలో ఎన్నడూ కనీవినని దృశ్యం. ఇంతకన్నా చెత్త నిర్ణయం మరొకటి ఉండదు. ఇంకా బ్యాంకులను మోసం చేసినవాళ్లకి కూడా జో బైడెన్ పదుల సంఖ్యలో క్షమాభిక్ష పెట్టడం మరో చెత్త నిర్ణయం. ఒక పక్క ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థి వలసలకు అడ్డుకట్ట వేస్తానంటుంటే, మరో పక్క బైడెన్ తీసుకున్న మరో నిర్ణయం చూసి అందరూ భృకుటి ముడుస్తున్నారు. ఎల్ సాల్వడార్ సహా కొన్ని దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చినవారికి సంవత్సరంన్నర పాటు తాత్కాలిక రక్షిత హోదా కల్పిస్తూ చివరి రోజులలో బైడెన్ తీసుకున్న నిర్ణయం కూడా సహజంగానే వివాదాస్పదంగా మారింది.సరే, వర్తమానానికి కాస్త వెనక్కి వెళ్తే, కమలా హ్యారీస్ ఎంపిక విషయంలో సైతం ఈ పెద్దలు చేసిన జాప్యం ఆక్షేపణీయమే. మళ్ళీ నేనే... మళ్ళీ నేనే... అధ్యక్షుణ్ణి అవుతా... అంటూ బైడెన్ చిన్న పిల్లలు చోకొలేట్ కోసం మారాము చేసినట్టు అంటుంటే, ఇప్పటికే మీ వల్ల పార్టీ పరువు, పదవి పరువూ హుడ్సన్ నదిలో కలిసిపోయాయి, ఇక చాలు, బుద్ధిగా కూర్చొమ్మని చెప్పారా? లేదు. చివరివరకూ బైడెన్ ఆడింది ఆటగా పాడింది పాటగా అనుమతించారు. దేశాధ్యక్ష పదవికి ఒకసారి ఏ పార్టీ వారు ఎన్నికయినా అమెరికన్ ప్రజలు సంప్రదాయబద్ధంగా రెండోసారి కూడా వారినే ఎన్నుకుంటారు

# ఇదే మన ఆరోగ్య భారతం



దేశాభివృద్ధి ప్రజల ఆరోగ్యంమీద ఆధారపడి ఉంటుంది. ఆదాయ అసమానతలు, పేదరికం, విద్య, సామాజిక చైతన్యం, వైద్యుల అందుబాటు, నివసించే ప్రదేశం, భౌతిక వాతావరణం, పర్యావరణం, కాలుష్యం, సామాజిక పరిస్థితులు, ప్రకృతి విపత్తుల్లాంటి అనేక అంశాలు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఆరోగ్యం అంటే కేవలం ఏటువంటి ఆరోగ్య సమస్యలు లేకపోవడమే కాదు. మనిషి శారీరకంగాను, మానసికంగాను, సామాజికంగాను, ఆర్థికంగాను, తను ఉన్న పరిసరాలలో హాయిగా జీవించడాన్ని ఆరోగ్యము అంటారు. నానాటికి దేశ వ్యాప్తంగా కోట్లాది ప్రజల ఆరోగ్య హక్కుకు ముప్పు పెరుగుతోంది. కాలుష్యం వాతావరణ సంక్షోభానికి, స్వచ్ఛమైన గాలిని పీల్చుకునే హక్కును దూరం చేస్తోంది. వాయు కాలుష్యం ప్రతి ఐదు సెకన్లకు ఒక ప్రాణాన్ని తీస్తోంది. ప్రపంచంలో 140 దేశాలు తమ రాజ్యాంగంలో ఆరోగ్యాన్ని మానవ హక్కుగా గుర్తించాయి. అయినా కూడా చాలా దేశాలు తమ ప్రజలు ఆరోగ్య సేవలను పొందేందుకు అర్హులని నిర్ధారించడానికి చట్టాలను ఆమోదించడం లేదా ఆచరణలో పెట్టడం గానీ లేదు. నాణ్యమైన ఆరోగ్య సేవలు, సురక్షితమైన తాగునీరు, స్వచ్ఛమైన గాలి, మంచి పోషకాహారం, నాణ్యమైన నివాసం, మంచి పని పర్యావరణ పరిస్థితులు, స్వేచ్ఛను పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.

**మన దేశంలో హక్కులు:**
మనదేశంలో రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కు బిల్లును ఆమోదించిన తొలి రాష్ట్రంగా నిలిచింది. ఇది రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ అన్ని ప్రజారోగ్య సౌకర్యాలలో ఉచిత సేవలను పొందే హక్కును కల్పిస్తుంది. పశ్చిమ్ బంగా ఖేత్ మజ్దూర్ సమితీ కేసులో సుప్రీంకోర్టు 'సంక్షేమ రాజ్యంలో ప్రజల సంక్షేమాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని, ప్రజలకు తగిన వైద్య సదుపాయాలను అందించడం ప్రభుత్వ బాధ్యత' అని పేర్కొంది. అలాగే పర్మానంద్ కటారా వెర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ' బాధితుడు **అమాయకుడైనా,**నేరస్థుడైనా సరే తగిన నైపుణ్యంతో ప్రాణాలను రక్షించడం వైద్యుని వృత్తి పరమైన బాధ్యత ' అని తెలిపింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 21 జీవించే హక్కును కల్పించింది. అలాగే ఆర్టికల్స్ 38, 39, 42,



43, 47 లలో రాష్ట్రాలు ప్రజలకు కల్పించవలసిన ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యతలను తెలుపుతున్నాయి.

**మన దేశంలో ఆరోగ్య పరిస్థితి:**
భారత్‌లో దాదాపుగా దేశ జనాభాలో 11.4 శాతం మధుమేహంతో జీవిస్తున్నారని 'లాన్సెట్' తెలిపింది. దాదాపు 13.6 కోట్ల మందికి ప్రీడయాబెటిస్ ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ అధ్యయనాలు తెలుపుతున్నాయి. వీటికి సాధారణ డయాబెటిస్ అదనం. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లోనే మధుమేహం ఎక్కువ. దేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. పౌష్టికాహార లోపం మరో సవాలు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 5 సంవత్సరాలు లోపు వయస్సు ఉన్న పిల్లలలో 35.5 శాతం మంది వయసుకు తగ్గ ఎత్తు లేరు. 19.3 శాతం మంది ఎత్తుకు తగిన బరువు లేరు. 32.1 శాతం మంది వారి వయస్సుకు తగ్గ బరువు లేరు. 3 శాతం మంది అధిక బరువుతో బాధ పడుతున్నారు. 15 నుండి 49 మధ్య వయస్సు గల వారిలో 18.7 శాతం మందిలో పోషకాహారలోపం ఉంది. రక్తహీనత కూడా ఎక్కువ మందిలో ఉంది. ప్రపంచంలో తలసరి పడకల సంఖ్య తక్కువగా ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటి. ప్రతీ పదివేల జనాభాకు 15 పడకలు అందుబాటులో ఉన్నాయి. 'ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం, వ్యాధులను నివారించడం, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, సాంకేతికతను మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచాలి ' అని జాతీయ ఆరోగ్య విధానం 2017 తెలిపింది. ఇది 2025 నాటికి క్యాన్సర్, హృదయ సంబంధ వ్యాధులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మధుమేహ అకాల మరణాలను 25 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'భారతదేశ వృద్ధాప్య జనాభా 2050 నాటికి మొత్తం జనాభాలో 20.8%కి రెట్టింపు అవుతుందని ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 అంచనా వేసింది. పెరుగుతున్న వృద్ధాప్య జనాభా వయస్సు సంబంధిత ఆరోగ్య సవాళ్లలో .పెరుగుదలతో కూడి ఉంటుంది.

**అనుకూలాంశాలు:**
2025-26 లో ఆరోగ్య సంరక్షణ రంగానికి 99,858.56 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది దాదాపు 11 శాతం పెరుగుదల. 2024-25 ఆర్థిక సర్వే ప్రకారం దేశ ఆరోగ్య సంరక్షణ వ్యయం 2025లో 2.5%గా ఉండగా 2026 ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 1.9%గా ఉంటుందని అంచనా. ఆయుష్మాన్ భారత్ 2024-25 నుండి 29% పెరుగుదలతో 9,406 కోట్లు. కేటాయించింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీ నుండి కొత్తగా 36 రకాల ప్రాణాలను రక్షించే మందులకు రాయితీలు ఇచ్చారు. 2025-26 నాటికి ప్రభుత్వ ఆసుపత్రులలో 200 కొత్త క్యాన్సర్ డే-కేర్ కేంద్రాలు ప్రారంభిస్తారు. వచ్చే మూడేళ్లలో జిల్లా స్థాయి కేన్సర్ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 10 వేల మెడికల్ సీట్లు, ఐదేళ్లలో 75,000 సీట్లు సాధించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నమూనా రిజిస్ట్రేషన్ వ్యవస్థ ప్రకారం , దేశంలో ప్రసూతి మరణాల నిష్పత్తి 2014-16లో 130 నుండి 2018-20లో లక్ష సజీవ జననాలకు 97 కి 33 పాయింట్లు గణనీయంగా తగ్గింది. శిశు మరణాల రేటు2014 లో 1000 సజీవ జననాలకు 39 నుండి 2020 సంవత్సరంలో 1000 సజీవ జననాలకు 28 కి తగ్గింది. 2014 లో ప్రతి 1000 జననాలకు 26గా ఉన్న నవజాత శిశు మరణాల రేటు 2020 నాటికి ప్రతి 1000 జననాలకు 20 కి తగ్గింది. 2014 లో 1000 జననాలకు 45 గా ఉన్న 5 ఏళ్లలోపు పిల్లల మరణాల రేటు 2020లో 1000 జననాలకు 32 కి తగ్గింది. జాతీయ ఆరోగ్య ఖాతాల అంచనాల ప్రకారం మొత్తం ఆరోగ్య వ్యయం లో ఒక శాతంగా, జేబు నుండి ఖర్చు 2013%-%14లో 64.2% నుండి 2021%-%22లో 39.4% కి తగ్గింది.

**సవాళ్లు:**
ప్రతి 1,000 మందికి 1.3 ఆసుపత్రి పడకలు మాత్రమే ఉన్నాయి. ఇది డబ్ల్యూహెచ్ఓ సూచించిన 1,000 మందికి 3.5 కంటే చాలా తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. 7.7 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు. చైనా తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నారు. 2045 నాటికి ఈ సంఖ్య 13.5 కోట్లకు పెరుగుతుందని అంచనా. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో అనారోగ్యాలతో బాధపడుతున్న వారిలో అత్యధిక సంఖ్యలో మన దేశంలోనే ఉన్నారు. '15 నుండి 49 ఏళ్ళ మహిళలలో 6.4 శాతం, పురుషులలో 4.0 శాతం ఊబకాయంతో ఉన్నారు ' అని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఐదవ రౌండ్ నివేదిక తెలిపింది. దేశంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 2022లో 14.6 లక్షల నుంచి 2025 నాటికి 15.7 లక్షలకు పెరుగుతుందని అంచనా. హృదయ సంబంధ వ్యాధులు మన దేశంలో ప్రధాన ఆరోగ్య సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 1.79 కోట్ల గుండెపోటు మరణాలలో ఐదోవంతు మనదేశంలోనే సంభవిస్తున్నాయి. ఇంకా రక్తపోటు, అవయవాల జబ్బులు , మొదలైనవి అదనం. ముఖ్యంగా యువతలో నిత్యం పొగాకు, మద్యం సేవించే వారి సంఖ్య పెరుగుతూ ఉంది. వీటి వినియోగం వలన ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు పాడైపోతాయి. అంతే కాక వివిధ కేన్సర్లు రావడానికి ఎక్కువ అవకాశం ఉంది. ఇంకా, నిర్మాణ కార్యకలాపాలు పెరుగుదల, ఎక్కువవుతున్న కర్మాగారాలు, వాహనాల సంఖ్య కారణంగా గాలి కాలుష్యం వలన ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. నీటి కాలుష్యము వలన , శుద్ధి చేయని నీరు త్రాగడం వలన పొట్టకు సంబందించిన వ్యాధులు కూడా పెరుగుతున్నాయి.

కారణాలు:మారుతున్న జీవనశైలి, మెరుగైన జీవన ప్రమాణాలు, నగరాలకు వలసలు, అస్తవ్యస్తమైన పని గంటలు, కూర్చునే అలవాట్లు, ఒత్తిడి, కాలుష్యం, ఆహారపు అలవాట్లలో మార్పు, ఫాస్ట్ ఫుడ్ సులభంగా అందుబాటులో ఉండటం వంటివి దేశంలో మధుమేహం పెరగడానికి కొన్ని కారణాలు. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం పొగాకు, మద్యం వినియోగం లాంటివి క్యాన్సర్ రోగులు పెరగడానికి కారణాలు. వీటికి కారణం క్రమరహిత ఆహారపు అలవాట్లు, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వ్యాయామం లేకపోవడం, రాత్రులు ఆలస్యంగా నిద్రపోవడం, ఎక్కువసేపు ఒకే దగ్గర కూర్చొని పనిచేసే ఉద్యోగాలు చేయడం వంటివి ఉన్నాయి.పరిష్కారాలు:ఎదురవుతున్న సవాళ్ళను జాప్యం లేకుండా పరిష్కరించాలి. వైద్యుల సంఖ్య పెంచాలి. ఔషధాలపై అసలు సుంకమే విధించకూడదు. ఇక ప్రజలు కూడా వ్యక్తిగత శ్రద్ధపై దృష్టి పెట్టాలి. మాతా శిశు మరణాల రేటును ఇంకా తగ్గించాలి. గిరిజన ప్రాంతాలలో అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించాలి. ప్రజలందరికీ ఆరోగ్య బీమా పరిధిలోకి తేవాలి. సార్వత్రిక ఆరోగ్య కవరేజీని సాధించడానికి మరియు మొత్తం ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడానికి మౌలిక సదుపాయాల అంతరాలు, మానసిక ఆరోగ్య సమస్యలు, స్థోమత సవాళ్లను పరిష్కరించడం చాలా కీలకం.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# క్రమశిక్షణ - విద్య - విజ్ఞత - ఉన్నత జీవన శైలి



పగలు రాత్రి, కష్టం సుఖం, కలిమిలేమి లనేవి కావడికుండల వంటివి. రెండూ ఒకదానికొకటి లింకులతో అవి వస్తునే ఉంటాయి. అలాగే పోతూనే ఉంటాయి. ఏది, ఏవి శాశ్వతం కాదు. అదే కాల మహిమ, కర్మ ఫలితం కూడా! ఈ మేరకు ఓపికతో ప్రవర్తించడం అనేది సరైన మార్గం. ఓపిక ఎప్పటికైనా ఫలాలను ఇస్తుంది. అందుకే, పెద్దలు ఓపిక లాభదాయకం అని ఏనాడో చెప్పారు. ఓపిక (శాంతం) ముందు సముద్రం కూడా చిన్నదే అన్నారు కదా! అయితే సుఖాలలో పొంగక, కష్టాలలో కృంగక, బ్యాలెన్స్ గా ప్రవర్తించాలి. అన్ని విషయాలలో అన్నివేళలా అప్రమత్తంగా విజ్ఞతతో వ్యవహరించడం వలన అవాంతరాలను సులువుగా అధిగమించవచ్చు. ఇక్కడ ఓపిక, విజ్ఞత, తెలివితో సమయానుకూల చర్యలు, ప్రతిస్పందన అనేది చాలా కీలకం. అందుకే, రాత్రివేళ ఇబ్బందులను పగలే ముందే ఊహిస్తూ తగు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

వర్షాకాలపు ఇబ్బందులు, సమస్యలను ముందే పసిగట్టి వేసవిలోనే తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధాప్య పరిస్థితులు, అవసరాలను ముందే ఊహిస్తూ, వయస్సులో ఉన్నప్పుడే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి.

దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే ఇబ్బందులు తప్పవు మరి. కష్టాలలో నిబ్బరంగా ధైర్యంగా వ్యవహరిస్తే కష్టాలనే అలలు తొలగి తర్వాత నిర్మలత్వం గోచరిస్తుంది. కష్టపడితేనే కదా సుఖం విలువ తెలుస్తుంది. ఎండ వెనకే వాన నిండు హర్షమునిచ్చు రేయి వెనకే పగలు హాయి నిచ్చు బాధ వెనుకే సుఖము బహుళమై చెలగురా వాస్తవమ్ము నార్ల వారి మాట. దీని అర్థం ఎండాకాలం తర్వాత కురిసిన వర్షం ఎంతో సంతోషాన్నిస్తుంది. రాత్రి తర్వాత వచ్చే పగలు హాయి కలిగిస్తుంది. అలాగే కష్టాల తర్వాత కలిగే సుఖం ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది. అన్యాయంగా అక్రమంగా సంపాదిస్తూ అడ్డగోలుగా అన్ని తింటూ, ఎంజాయ్ చేస్తున్నామనుకునే



వారు తరువాత తిన్నది అరగడానికి,నిద్ర రావడానికి కూడా మందులు వాడటం అనేది కర్మ ఫలితమే కదా!


అదే, కష్టపడి పని చేస్తూ ఉన్నదాంట్లోనే కడుపునిండా సంతృప్తిగా భోంచేసి తృప్తిగా కంటి నిండా నిద్రపోవడం కూడా అతి సహజమే. సుఖం అక్కడే గోచరిస్తుంది. ఈ విషయం చీమలను చూసి నేర్చుకోవాలి. ఎప్పుడు క్రమశిక్షణతోనే అవి శ్రమ పడుతూనే ఉంటాయి. ఆహార గుర్తింపు, సేకరణ, కూర్పు, వాటి భద్రతలపైనే ఎప్పుడు దృష్టి సారిస్తుంటాయి. పరిస్థితులు మారుతూ అనుకూలించనప్పుడు సేకరించిన ఆహారాన్ని క్రమశిక్షణతో సమంగా స్వీకరిస్తూ, ప్రతికూలతలను సమర్థవంతంగా ఎదుర్కొంటాయి. అందుకే సోమరిని, చీమల వద్దకు వెళ్లి వాటి నడతను గమనిస్తూ నేర్చుకో అంటూ ఏనాడో స్పష్టం చేయబడింది. నియమ బద్ధమైన జీవితాన్ని గడపడమే క్రమశిక్షణ. క్రమశిక్షణ లేని జీవితాలు చుక్కాని లేని నావ ప్రయాణం వంటివి. క్రమశిక్షణ లోపంతోనే ఓడలు బండ్లవుతాయి.నిర్లక్ష్యం అనే చిల్లు పెద్ద ఓడనే ముంచేస్తుంది. వ్యక్తి యొక్క జీవిత గమనం క్రమశిక్షణబట్టే నడుస్తుంది.అందుకే క్రమశిక్షణ అనేది చిన్ననాటి నుండే అలవర్చబడాలి. క్రమశిక్షణతో గల విద్యార్జన సార్థకమవుతుంది. క్రమశిక్షణతో కూడిన విద్య గుభాళిస్తుంది. దేవుని అద్భుత సృష్టి యావత్తు క్రమశిక్షణకు లోబడి ప్రవర్తించుచుండగా, మనం ఎలా ప్రవర్తిస్తున్నామనే విషయాన్ని ఆత్మ పరిశీలన చేసుకోవాలి. కొందరు బాల్యం నుండే క్రమశిక్షణగా విలువలు అలవర్చుకుని తమ జీవితాలను ఉన్నత రీతుల్లో ఉంచుకున్న వారు అనేకులు. వారు చరిత్రలో ప్రత్యేకతతో నిలిచిపోయారు. ఈ విధంగా కాకుండా క్రమశిక్షణారహిత్యంతో ప్రవర్తించడం వలన సమస్యలకు ఆహ్వానం పలికినట్లే అవుతుంది. క్లుప్తంగా క్రమశిక్షణ అంటే నియమబద్ధమైన జీవితాలను కలిగి ఉండుటయే. నియమబద్ధమైన జీవితాలే ప్రశాంతతతో కొనసాగించబడుతుంటాయి. నైతిక క్రమశిక్షణలేమితో ఘర్షణలు, ఆర్థిక క్రమశిక్షణ లేమితో నష్టాలు, ఆరోగ్య క్రమశిక్షణ లేమితో రోగాలు, ఇలా క్రమశిక్షణ లోపంతో అనేక సమస్యలు గమనించబడుతుంటాయి.

క్రమశిక్షణ - విద్య - విజ్ఞత (చక్కని భవిష్యత్తు)గా అదే ఉన్నత జీవన శైలిగా చెప్పవచ్చు. క్రమశిక్షణను పాటించడం కష్టమే అనిపించినా అందుకు ఫలాలు మాత్రం అతిమధురంగా ఉంటాయి. క్రమశిక్షణతో నేర్చుకున్న విషయాలు కలకాలం నిలుస్తూ చక్కని అభివృద్ధికి బాటలు వేస్తాయి. క్రమశిక్షణ గల జీవితాలే ఆదర్శ జీవితాలుగా, స్ఫూర్తివంతంగా ఉంటాయి. వ్యక్తి అయినా, వ్యవస్థయినా, మరేదైనా క్రమశిక్షణగా విలువలను కలిగి ఉంటే ఖచ్చితంగా రాణిస్తాయి.

డాక్టర్ యం.ప్రభుదయాల్,
మాజీ సెనెట్ మెంబెర్ - కాకతీయ యూనివర్సిటీ,
జీవిత సభ్యులు - ఐఏటిఈ
మండల విద్యాశాఖాధికారి - కొత్తగూడెం.

# సంపూర్ణ ఆయుష్షు

భక్తి



పురాణాల ప్రకారం యముడు సూర్యుడి కుమారుడు. దక్షిణ దిశకు అధిపతి. దండించేవారిలో తాను యముణ్ని అని శ్రీకృష్ణుడు భగవద్గీత, విభూతి యోగంలో చెప్పాడు. స్కంద పురాణం ప్రకారం యముడి సోదరి యమున. యముడు నరకాధిపతి. జీవ నది రూపంలో భూమిపై ప్రవహిస్తున్న యమున అంటే యముడికి ప్రాణం. అగ్నిపురాణం ప్రకారం యమున భూమిపై నదిగా ప్రవహిస్తూనే విష్ణు సన్నిధానంలో విరజానదిగా రూపుదాల్చింది. శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించినప్పుడు- శేషుడు బలరాముడిగా, విరజానది కాళిందిగా ధరణిపైకి ఆయన్ను వెన్నంటి వచ్చారు. కాళింది శ్రీకృష్ణుణ్ని పెళ్లి చేసుకొని ఆ దేవదేవుడి అష్టభార్యల్లో ఒకరిగా మాధవుడి అనురాగాన్ని పొందింది.

ఆమె సోదరుడు వృత్తిధర్మంగా భూమిపైకి వచ్చినా- పాపుల ప్రాణాలు తీసుకొని వెళ్లిపోయేవాడు. యమున మనిషి రూపంలో కాళిందిగా ఉన్నా... నది రూపంలో యమునగా ప్రవహిస్తున్నా- ఒక్కసారైనా తనను చూసేందుకు రావడంలేదని ఆ సోదరి అన్న యముడికోసం పరితపించిపోయేదట. జీవం తీసేందుకు మాత్రమే వచ్చే యముడు కృష్ణుడి భార్యగా ఉన్న కాళింది ఇంటికి వెళ్లలేక, నరకాధిపతిగా తాను స్వర్గంలోని విరజానది సౌభ్రాతృత్వం అందుకోలేక, ఆ అన్నాచెల్లెళ్లు బాంధవ్యాలను మరువలేక పరితపించిపోయేవారని తైత్తిరీయ బ్రాహ్మణంలోని ఒక వ్యాఖ్యానం వివరిస్తోంది.

ఒకసారి యమున తండ్రి సూర్యుణ్ని ప్రార్థించి తన సోదరుణ్ని (యముణ్ని) సమవర్తిగా కాక, ఒక అన్నగా తన ఇంటికి వచ్చేలా చేయమని కోరింది. యముడు నరకాధిపతి కనుక ఆమె తన సోదరుడి ఇంటికి పోలేదు... పోకూడదు! అప్పుడు సూర్యుడు ఏడాదికోసారి కార్తిక శుద్ధ తృతీయ (తదియ) రోజు యమున ఇంటికి వెళ్లి చెల్లెలు (భగిని) చేతి (హస్త) భోజనం భుజించాలని శాసించాడట.


సోదరుడు తన ఇంట విందారగించిన రోజును ఆ చెల్లెలు మహత్తరమైన పర్వదినంగా భావించేది. లౌకికంగా కార్తిక శుద్ధ తదియ రోజు అక్కా చెల్లెళ్ళు అన్నదమ్ములను తమ ఇంటికి ఆహ్వానించి విందుచేసే సంప్రదాయం ఆనాటి నుంచి సంస్కృతిగా మారింది. ఈ విందును భగినీ హస్త భోజనంగా సోదరులు ఆస్వాదించడమూ ఆచారమైంది.

పూర్వం తరచూ సోదరి ఇంటికి వెళ్లడం ఆచారం కాదు. సోదరిని, ఆమె భర్తను వీలైనన్నిసార్లు ఆహ్వానించి ఒడి నింపి సగౌరవంగా మెట్టినింటికి పంపేవారు. సోదరికి, అన్న తమ ఇంటికి వచ్చి ఒక్కపూటైనా ఉండి, తన చేతి వంట తినాలన్న కోరిక సహజం. అందుకే యమ ద్వితీయ రోజు సోదరుణ్ని ఆహ్వానించి కడుపునిండా భోజనంపెట్టి సోదరి సంతృప్తిపడటం అనాదినుంచి వస్తున్న ఆచారం. అందుకే ఈ ఆనందకరమైన రోజును భ్రాతృ ద్వితీయగానూ వ్యవహరిస్తారు. ఈ రోజున సోదరి ఇంట్లో ఆమె చేతి భోజనం చేస్తే సంపూర్ణ ఆయుష్షు కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. ఆడపిల్ల పుట్టింటి రుణం ఉంచుకోకూడదు కాబట్టి సోదరుడు ఊరికేవచ్చి భోజనం చేయకూడదంటారు. అందుకే భోజనం పూర్తయ్యాక సోదరుడు, తాను భుజించిన పళ్లెం (విస్తరి) కింద కొంత మొత్తంలో డబ్బో, లేక బంగారు ఉంగరంతో మెట్టెలో ఉంచడం ఆనవాయితీ! ఈ పండుగను ఉత్తర భారతదేశంలో 'భాయ్-దూజ్' అని, నేపాల్‌లో 'భాయి-టికా' అని పిలుస్తారు. మరుసటి రోజు సోదరుడు, సోదరిని భోజనానికి పిలవాలి. దీన్నే 'సోదరి తృతీయ' అంటారు. పురాణ వాఙ్మయాలు అనుబంధాలకు, ఆత్మీయతలకు పెద్దపీట వేశాయి.

## పసికందులు సురక్షితంగా

పసికందులకు సుతిమెత్తని దుస్తులు ఎంచుకుంటాం. నాణ్యమైన సబ్బులు, పౌడర్లను వాడుకుంటాం. అయితే వాటిలో దాగి ఉండే హానికారక రసాయనాలను మనం నిర్లక్ష్యం చేస్తున్నామా? పసిపిల్లల ఉత్పత్తుల్లో దాగి ఉండే హానికారకాలు, సురక్షితమైన ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!
అత్యధికంగా రసాయనాలకు బహిర్గతమైనవీ, పిల్లల చర్మానికి ఎక్కువ సమయం పాటు తగులుతూ ఉండేవే అత్యంత విషపూరితమైన పసిపిల్లల ఉత్పత్తులని వైద్యులు అంటున్నారు. పసిపిల్లల దుస్తుల తయారీలో ఉపయోగించే ఫార్మాల్డిహైడ్, విషపూరిత రంగులు పిల్లలకు అలర్జీలు, చర్మ సమస్యలను తెచ్చి పెడతాయి. అత్యంత తరచుగా ఉపయోగించే ప్లాస్టిక్ పాల సీసాలు, బొమ్మలు, దయాపర్లు, పౌడర్లు, లోషన్లు, షాంపూల్లో కూడా అత్యధిక విష మోతాదులు ఉంటున్నట్టు వైద్యులు అంటున్నారు. ఇలాంటి విషపూరిత రసాయనాలకు బహిర్గతమయ్యే పిల్లల్లో ఎదుగుదల లోపాలు, శ్వాసకోశ సమస్యలు, నాడీసంబంధ రుగ్మతలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడుకోవాలంటే, విష రహిత, బిస్ఫినాల్ రహిత, సేంద్రియ ఉత్పత్తులను ఎంచుకోవాలి. తరచూ ఉపయోగించే బొమ్మలు, గిన్నెలు, స్పూన్లు లాంటి వాటిని తరచూ శుభ్రంగా కడుగుతూ ఉండాలి. అలాగే పాలు పట్టడం కోసం ప్లాస్టిక్ బదులుగా స్టీలు, లేదా గాజు సీసాలను ఎంచుకోవాలి. అలాగే ఘాటు వాసన కలిగి ఉండే సబ్బులు, షాంపూల వాడకం మానేయాలి. అలాగే ఈ జాగ్రత్తలు పాటించాలి.లేబుల్స్: ఉత్పత్తుల లేబుళ్ల మీద పారాబెన్ ఫ్రీ, సల్ఫేట్ ఫ్రీ, బిపిఎ ఫ్రీ అని రాసి ఉన్న వాటినే ఎంచుకోవాలి

# నేస్తాల అక్షర యజ్ఞం





"ఒకసారి సంపాదిస్తే మనతోనే ఉండేది, ఎవరూ తీసుకోలేనిదీ, ఎంత పంచినా తరగనిది విద్య మాత్రమే. ఎన్నో కారణాలతో విద్యకు దూరమవుతున్న వారిలో భరోసా కల్పించాలనే చిన్న ప్రయత్నం మాది" అంటారు అదితి శ్రీవత్సన్, నేహా గోవిందరాజన్. ఈ చెన్నై అమ్మాయిలు ఏర్పాటు చేసిన 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'... పుస్తక విరాళాలు, ఇతర కార్యక్రమాలతో సర్కారు బడుల్లో చదివే అట్టడుగు వర్గాల పిల్లల వికాసానికి దోహదం చేస్తోంది.
"పుస్తకాలను విరాళంగా సేకరించి, పేద పిల్లలకు పంచాలనే ఆలోచనను నా స్నేహితురాలు అదితి శ్రీవత్సన్ చెప్పినప్పుడు... నేను సంకోచించాను. ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలను చేపట్టడానికి తగినంత వయసు మాకు లేదనేది నా అభిప్రాయం. అప్పుడు అదితి "సమాజానికి ఏదైనా సేవ చెయ్యాలంటే ముప్ఫయ్యేళ్ళో, నలభయ్యేళ్ళో రానవసరం లేదు. మనస్ఫూర్తిగా చేసినప్పుడు ఎలాంటి అనుమానాలు అవసరం లేదు" అంది. 'నిజమే కదా!' అనిపించింది. ఆలస్యం చెయ్యకుండా మా 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టాం" అని గుర్తు చేసుకుంది నేహా గోవిందరాజన్. చెన్నైలో పుట్టి, పెరిగిన ఈ పదిహేడేళ్ళ అమ్మాయిలిద్దరూ మంచి స్నేహితులు. ప్లస్ వన్ విద్యార్థులు. పుస్తకాలంటే ఇష్టం. కనీస చదువులకు నోచుకోని పేద పిల్లలను చూసి ఇద్దరూ బాధపడేవారు. ఎలాంటి సాయమైనా విద్యకు సంబంధించినదే చెయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. కిందటి ఏడాది వేసవి సెలవుల్లో... తమ ఆలోచనలకు ఒక రూపం ఇచ్చారు.

**తాతయ్య స్ఫూర్తితో...**

"చదువుకొనే స్థోమత లేనివారికి ఏదైనా సాయం చేయాలనేది ఒక్కరోజులో నాకు కలిగిన ఆలోచన కాదు. సామాజిక ఒత్తిడుల కారణంగా మా అమ్మమ్మ అయిదో తరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది. ఈ సంగతి నాతో ఎన్నోసార్లు చెప్పి బాధపడింది. బాగా చదువుకోవాలనే కోరిక ఉన్నా... కుటుంబ, ఆర్థిక పరిస్థితుల వల్ల, మౌలిక వనరులు లేకపోవడం వల్లా ఎందరో తమ కలను నెరవేర్చుకోలేకపోతున్నారనే వాస్తవం నన్ను కలవరపెట్టేది. అయితే నా వంతుగా ఏదో చెయ్యాలనే స్ఫూర్తి... రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ అధికారి అయిన మా తాతయ్య ఎ.ఆర్.శ్రీధర్ నుంచి పొందాను. "మనకు ఉన్నదాన్ని పదిమందితో పంచుకోవడం మన బాధ్యత" అని ఆయన చెప్పిన మాటలు నాలో నాటుకుపోయాయి. ఒక రోజు మా ఇంట్లో పాత పుస్తకాలను సర్దుతున్నప్పుడు... దాదాపు వందకు పైగా నా పాత తరగతుల పుస్తకాలు కనిపించాయి. అవన్నీ దుమ్ము కొట్టుకుపోయాయి. వాటిని అవసరం ఉన్నవారికి ఇస్తే ప్రయోజనం ఉంటుందనిపించింది" అంటోంది అదితి. నేహాతో కలిసి ఆ పుస్తకాలను ఒక అనాథాశ్రమానికి తీసుకువెళ్ళింది. అక్కడ అట్టడుగువర్గాల అమ్మాయిలు కూడా ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఈ పుస్తకాలను స్నేహితులిద్దరూ పంచిపెట్టారు. ఆ పిల్లల్లో ఉత్సాహాన్ని, ఆనందాన్ని చూసిన తరువాత... ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళాలనుకున్నారు.

**మొదట్లో భయపడినా...**

తొలి ప్రయత్నంగా.. షోలింగనల్లూర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌కు వెళ్ళారు. పుస్తకాలు విరాళాలుగా ఇవ్వాలని కోరుతూ వాటి సేకరణ వెనుక ఉద్దేశాన్ని వివరించారు. ఎలాంటి స్పందన వస్తుందోనని మొదట భయపడ్డారు. కానీ అక్కడ నివసిస్తున్నవారు ఉత్సాహంగా స్పందించారు. తమ దగ్గర ఉన్న పాత పుస్తకాలు, తమకు అవసరం లేదనుకున్న పుస్తకాలు ఇచ్చారు. "కొద్ది రోజుల్లోనే 350 పుస్తకాలు వచ్చాయి. వాటిలో పాఠ్య పుస్తకాల నుంచి కాల్పనిక సాహిత్యం వరకూ ఉన్నాయి. వాటిని ఒక బాలికల పాఠశాలకు అందజేశాం. మా గురించి విన్న వారు పిలిచి మరీ పుస్తకాలు ఇవ్వడం ఆరంభించారు" అని చెప్పారు అదితి, నేహా.. క్రమంగా స్థానికంగా పనిచేసే సంస్థలు, ఇంటి యజమానుల సంఘాల్లో వారు భాగస్వాములయ్యారు. ఏడాది కాలంలో దాదాపు 4,700కు పైగా పుస్తకాలను పాఠశాలలకు అందజేశారు. వీటివల్ల 3,000 మందికి పైగా పిల్లలు ప్రయోజనం పొందుతున్నారు. అంతేకాదు, ఆరు లైబ్రరీల ఏర్పాటుకు కూడా ఈ స్నేహితులు దోహదం చేశారు.

**ఆంగ్లం... ఆర్థికం**

"ఇప్పుడు ఫౌండేషన్ కార్యకలాపాల పరిధిని విస్తరించాం. ప్రధానంగా రెండు అంశాల మీద దృష్టి పెట్టాం. అవి ఆంగ్ల భాషలో నైపుణ్యం, ఆర్థిక అక్షరాస్యత. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎంతోమంది పిల్లలు ఇంగ్లీష్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. తప్పులు మాట్లాడతామనే భయంతో మాట్లాడడానికి సందేహిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం కోసం కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆంగ్ల సంభాషణా నైపుణ్యాలను పెంచడం కోసం విద్యావేత్తలతో కలిసి ఒక పాఠ్య ప్రణాళిక రూపొందించాం" అంటోంది అదితి. అలాగే "జీవితం సక్రమంగా సాగాలన్నా, సురక్షితమైన భవిష్యత్తు కావాలన్నా ఆర్థిక విషయాల్లో నైపుణ్యం ఎంతో ముఖ్యం. అందుకే ఇంటి బడ్జెట్, ఆదా చేసుకోవడం, ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండడం లాంటి అంశాలను బోధిస్తున్నాం" అని చెబుతోంది నేహా. 'బ్లూ లిలాక్ ఫౌండేషన్' చేపడుతున్న కార్యక్రమాలు పలువురు విద్యార్థులను ఆకర్షించాయి. వారు తమ పాఠశాలల్లో 'బుక్‌డ్రైవ్'లను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింతమందికి పుస్తకాలు ఉచితంగా అందించడానికి వీలవుతోంది. "మా స్నేహితురాలు తనుశ్రీ... ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఫౌండేషన్ వ్యవహారాల్లో మాకు తోడుగా ఉంది. ఏడాది క్రితం ఫౌండేషన్‌ను ప్రారంభించినప్పుడు ఇంత స్పందన వస్తుందని మేమనుకోలేదు. ఇప్పుడు ఇదొక పూర్తిస్థాయి ఉద్యమంగా రూపుదిద్దుకుంది. అవసరం ఉన్న ప్రతి విద్యార్థికి సాయం అందించాలన్నది మా లక్ష్యం. దాని కోసం కృషి చేస్తాం" అని చెబుతున్నారు అదితి, నేహా.

# తెల్లసొనతో మెరుపులు...





గుడ్డులోని తెల్లసొనలో మేనిఛాయను పెంచే పోషకపదార్థాలు చాలా ఉంటాయి. అవి శిరోజాల టెక్చర్‌ని మెరిసేలా చేస్తాయి. జుట్టును ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతాయి. చర్మంలో దెబ్బతిన్న టిష్యూలను బాగు చేసి చర్మం బిగువుగా ఉండేలా తోడ్పడతాయి. శిరోజాల పెరుగుదలకు సైతం సహకరిస్తాయి. తెల్లసొన చిట్కాలు కొన్ని...

. కీర పేస్టులో తెల్లసొన వేసి మెత్తగా చేసి ఆ పేస్టును ముఖానికి రాసుకొని 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. అలా వారానికి రెండుసార్లు చేయాలి. దీనివల్ల చర్మంలో కొల్లాజన్ పెరుగుతుంది. చర్మంలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది. చర్మం మెరుస్తుంది.

చర్మకాంతిని తెల్లసొన పెంచుతుంది. తెల్లసొనలో ఒక టేబుల్‌స్పూను నిమ్మరసం, రెండు టేబుల్‌స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలిపి ఆ పేస్టును ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా తయారవడమే కాకుండా మేనిఛాయ కూడా పెరుగుతుంది.


వయసు కనిపించకుండా ఉండడానికి ఒక ఎగ్ తెల్లసొనలో చక్కెర, పెరుగు ఒక్కొక్క టేబుల్‌స్పూను వేసి పేస్టులా చేసి ముఖానికి రాసుకొని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆతర్వాత ముఖాన్ని చల్లటి నీళ్లతో కడగాలి. దీనివల్ల చర్మం బిగువుగా అవడమే కాదు టోనింగ్ కూడా బాగా ఉంటుంది. చర్మంపై మచ్చలు పోతాయి. ఈ మాస్కు చర్మాన్ని బాగా శుభ్రం చేస్తుంది. దీనివల్ల వయసు కనపడదు. ఇలా వారానికి రెండుసార్లు మాస్కు వేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.


తెల్లసొనలోని పోషకాల వల్ల శిరోజాలు మెరవడంతోపాటు బాగా పెరుగుతాయి. దీనికి చేయాల్సిందేమిటంటే, తెల్లసొనలో కొద్దిగా ఆలివ్ ఆయిల్ వేసి మాడు బాగా మర్దనా చేసి అరగంటపాటు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత మైల్డ్ షాంపుతో తల రుద్ది, నీటితో శుభ్రపరచాలి.

# పండ్లు తింటే బరువు తగ్గుతామా?

**బరువు తగ్గడం కోసం రాత్రి భోజనానికి బదులుగా పండ్లు తినే ధోరణి ఇటీవల ఊపందుకుంది. అయితే పండ్లతో నిజంగానే బరువు తగ్గే వీలుందా? తెలుసుకుందాం!**







మధ్యాహ్నం భారీగా భోంచేసినప్పుడు, రాత్రికి అంతగా ఆకలి వేయకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో, లేదా అజీర్తి తలెత్తినప్పుడు రాత్రి భోజనానికి బదులుగా పండ్లతో సరిపెట్టుకోవడం మంచిదే! అయితే ప్రతి రాత్రీ పండ్లతో సరిపెట్టుకోవడం ఆరోగ్యకరం కాదంటున్నారు వైద్యులు. పండ్లలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు లోపిస్తాయి కాబట్టి ఇదే అలవాటును కొనసాగిస్తే పోషక లోపం తలెత్తే వీలుంటుంది. అలాగే రాత్రి పండ్లతో పొట్ట నింపుకోవడంతో, మరుసటి ఉదయానికి ఆకలి ఎక్కువై భారీ బ్రేక్‌ఫాస్ట్ చేసే అవకాశం ఉంటుందనీ, దాంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయే ప్రమాదం ఉంటుందని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే పండ్లలో విటమిన్లు, పీచు, ఖనిజ లవణాలతో పాటు, సహజ చక్కెరలు కూడా ఎక్కువే! ఇవి రక్తంలోని చక్కెర మోతాదులను పెంచేస్తాయి. ఇదే అలవాటును దీర్ఘకాలం పాటు కొనసాగిస్తే, ఇన్సులిన్ రెసిస్టెన్స్ తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ శక్తిని ఉపయోగించుకోలేకపోతే, కొవ్వుగా శరీరంలో పేరుకుపోతుంది. కాబట్టి ఈ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం పండ్లను పెరుగు, నట్స్‌తో కలిపి తీసుకోవాలి. అలాగే రాత్రిపూట పండ్లను తినడానికి ఇష్టపడేవారు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే, బెర్రీస్, యాపిల్స్, బొప్పాయి, పియర్స్ మొదలైన పండ్లను ఎంచుకోవాలి.

# చిన్న గదులు పెద్దవిగా



కొందరి ఇళ్లు ఉండడానికి చిన్నవే కాని చూసేందుకు చాలా పెద్దగా కనిపిస్తాయి. మీ ఇల్లు కూడా చిన్నదే అయినా పెద్దగా కనిపించాలంటే ఇంటీరియర్ విషయంలో జాగ్రత్తపడితే సరిపోతుంది అంటున్నారు డిజైనర్లు.

చిన్న గది అనగానే లైట్ కలర్ వాడాలి అనుకుంటారు. కాని అది అపోహ మాత్రమే. ఆ గదిని మీరు ఎందుకు ఉపయోగిస్తున్నారు అనే దాన్నిబట్టి కలర్ ఎంపికచేసుకోవాలి. అది బెడ్‌రూమ్ అయితే వామ్ కలర్స్, బాతరూమ్ అయితే కూల్ షేడ్స్ వాడాలి. ముదురు నీలం రంగు వేస్తే హాయిగా అనిపిస్తుంది.

గోడలకు పెయింట్ వేసేటప్పుడు సీలింగ్‌కు పది సెంటిమీటర్లు కిందనుంచి వేయాలి. వదిలేసిన దానికి తెలుపు పెయింట్ వేయాలి. తెలుపు రంగును వాడడం వల్ల సీలింగ్ ఎత్తుగా అనిపిస్తుంది. దాంతో గది పొడవుగా ఉన్నట్టు కనిపిస్తుంది. క్రిస్ప్ వైట్ కలర్‌కి తగ్గట్టుగా టీల్ టోన్స్ (బ్లూ, గ్రీన్ రంగుల మిశ్రమం) వాడితే చాలా బాగుంటుంది.

సన్నగా ఉన్న కారిడార్ గోడలకి ఇరుచివర్లా ముదురు రంగులు వేస్తే విశాలంగా ఉన్న లుక్ వస్తుంది. డ్రమాటిక్ లుక్ కావాలంటే రిచ్ రెడ్ వేసి చూడండి.

గదుల్లో వాడే ఫ్యాబ్రిక్, ఫర్నిచర్‌లకు దగ్గరి రంగులనే గోడలకు పెయింట్ చేయాలి. ఇలా చేయడం వల్ల చూడగానే ప్రశాంతమైన భావన కలుగుతుంది. గది కూడా ఉన్నదానికంటే పెద్దదిగా కనిపిస్తుంది. ఇందుకు గ్రీన్ కలర్ షేడ్స్ బాగుంటాయి.


చిన్న గదికి ఉడ్‌వర్క్, మౌల్డింగ్స్ చేయించుకునేటప్పుడు అవి గోడ రంగుకంటే ఒక షేడ్ డార్క్ ఉండేలా జాగ్రత్తపడాలి. ఇలా చేయడం వల్ల కాంట్రాస్ట్‌గా ఉండి గది పెద్దదిగా కనిపిస్తుంది. లేత బూడిద రంగు గోడలకు, ముదురు బూడిద రంగు ఉడ్‌వర్క్ చేయిస్తే అధునాతనంగా ఉంటుంది.

గోడలకు పెయింట్ చేశాక పెద్ద పెద్ద అద్దాలు పెట్టడం వల్ల ఆ గది వైశాల్యం రెండింతలు పెరిగినట్టు అనిపించి ఉన్నదానికంటే పెద్దదిగా కనిపిస్తుంది.

## ఈ వారం మార్కెట్లు దబిడి దిబిడేనా?



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత స్టాక్ మార్కెట్లు రేపటి వారం అత్యంత ఒడిదుడుకులతో ఉండే అవకాశం కనిపిస్తోంది. అమెరికా తెచ్చిన పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధం.. ప్రపంచ వాణిజ్యాన్ని, తద్వారా ఆయా దేశాల ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తుందని, దీనికి తోడు అమెరికా ఆర్థిక మాంద్య భయాలతో పెట్టుబడిదారులు భయపడుతున్నారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉంటే, వచ్చే వారం వడ్డీ రేటు నిర్ణయం వెలువడుతుండటం, ఈ వారంలో భారతదేశ పారిశ్రామిక, ఉత్పత్తి డేటా కూడా విడుదల కానుంది. అటు, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వస్తుండటం వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిర పోకడలను ఎదుర్కోవచ్చని ట్రేడ్ పండితులు లెక్కలు కడుతున్నారు. అమెరికా సుంకాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణంపై విస్తృత ప్రభావాలను పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.మరోవైపు, చైనా యొక్క మార్చి నెల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ డేటా గురువారం విడుదల కానుంది. యూకే డేటా శుక్రవారం విడుదల కానుంది. ఇక, ఏప్రిల్ 10న %బూ% ఫలితాలతో %ూ4 ఫీ%25 ఇన్ కం సీజన్ ప్రారంభమవుతుంది. ఈ వారం అమెరికా, భారతదేశం నుండి వెలువడే మార్చి డేటాపై కూడా పెట్టుబడిదారులు దృష్టి సారిస్తారని చెబుతున్నారు.దీనికి తోడు ఈ వారం విదేశీ పెట్టుబడిదారుల వాణిజ్య కార్యకలాపాలు, రూపాయి-డాలర్ ధోరణి, క్రూడ్ ఆయిల్ ధరలను మార్కెట్లు ఆసక్తిగా పరిశీలిస్తాయని నిపుణులు తెలిపారు. ఈక్విటీ బెంచ్ మార్క్‌లు శుక్రవారం సర్వత్రా అమ్మకాల కారణంగా క్షీణించిన సంగతి తెలిసిందే. ఇక, వచ్చే వారం భారత మార్కెట్లు 4రోజులే పనిచేస్తాయి. ఈక్విటీ మార్కెట్లు గురువారం "శ్రీ మహావీర్ జయంతి" పండుగ సందర్భంగా సెలవు.




## డెలివరీ చేతికి ఈకామ్ ఎక్స్‌ప్రెస్!




**న్యూఢిల్లీ-నవభూమి:** సరుకు రవాణాలో అగ్రగామి సంస్థగా వెలుగొందడానికి డెలివరీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీంట్లోభాగంగా తన పోటీ సంస్థయైన ఈకామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.1,407 కోట్లు. షేర్ల కొనుగోలు ద్వారా జరగనున్న ఈ ఒప్పందం వచ్చే ఆరు నెలల్లో పూర్తికానున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ఒప్పందానికి కంపెనీ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు, కొనుగోలు అనంతరం ఈకామ్ సంస్థ యథావిధిగానే తన సేవలను కొనసాగించనున్నదని, అలాగే సబ్సిడరీగా కొనసాగుతుందని డెలివరీ ఎండీ, సీఈవో సైద్ సాహిల్ బారు తెలిపారు. ఇరు సంస్థల క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయనున్నట్టు మౌలిక సదుపాయల కల్పన, టెక్నాలజీ, నెట్‌వర్క్, ఉద్యోగాలను నియమించుకోవడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు.

## రూ. 2720 తగ్గిన గోల్డ్ రేటు.. రూ. 9 వేలు పడిపోయిన వెండి.. 2 రోజుల్లోనే మ్యాజిక్!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవలి కాలంలో బంగారం, వెండి రేట్లు వరుసగా పెరిగి.. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలకు ఎగబాకిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా అంతర్జాతీయంగా అనిశ్చితి నేపథ్యంలో.. సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారంవైపు పెట్టుబడులు మళ్లగా రేట్లు అదే స్థాయిలో ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. దీంతో సామాన్యులు కొనాలంటే చుక్కలు కనిపించాయి. పెళ్లిళ్ల సీజన్‌లోనూ డిమాండ్ అంతంతమాత్రంగానే నమోదైంది. అయితే ఉన్నట్లుండి ఒక్కసారిగా ఈ పసిడి, వెండి ధరలు భారీ స్థాయిలో కుప్పకూలాయి. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో.. 2 రోజుల వ్యవధిలో బంగారం, వెండి రేట్లు పడిపోవడం గమనార్హం. అంతర్జాతీయంగా కూడా భారీగా ధరల్లో పతనం కనిపించింది. లేటెస్ట్ రేట్లు ఎక్కడ ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.ఈ ఏడాదిలోనే దాదాపు 20 శాతం వరకు పెరిగిన బంగారం ధరలో.. ఇప్పుడు ఒక్కసారిగా కరెక్షన్ కనిపించింది. ముఖ్యంగా గరిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు (లాభాల స్వీకరణ) పాల్పడటంతో ధరలు దిగొచ్చాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా అంచనాలకు మించి అమెరికాలో ఉద్యోగాల కల్పన నమోదవడం కూడా డాలర్ పుంజుకునేందుకు దోహదం చేసి.. తద్వారా బంగారం రేట్లు దిగొచ్చేందుకు కారణమైందని తెలుస్తోంది.

ఇంటర్నేషనల్ మార్కెట్లో 2 రోజుల కిందట స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 3168 డాలర్ల వద్ద ఆల్ టైమ్ హైని తాకింది. అయితే ఇప్పుడు అది 3038 డాలర్ల స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో 130 డాలర్లకుపైగా తగ్గింది. సిల్వర్ రేటు 34 డాలర్లకుపైగా ఉండగా.. ఇప్పుడు అది 29 డాలర్ల స్థాయికి దిగొచ్చింది.

**బంగారం ధరలు..**

ఇదే ప్రభావం దేశీయంగా కూడా కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగానే దేశీయంగా కూడా గోల్డ్ రేట్లు కదలాడుతుంటాయన్న సంగతి తెలిసిందే. దేశీయంగా తాజాగా ఏప్రిల్ 5న ఉదయం.. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల పుత్తడి ధర రూ. 900 తగ్గడంతో 10 గ్రాములకు రూ. 83,100 కు దిగొచ్చింది. కిందటి రోజు రూ. 1600 తగ్గగా 2 రోజుల్లో రూ. 2500 పతనమైంది. మరోవైపు 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 980 పడిపోవడంతో తులం రూ. 90,660 కి పడిపోయింది. ఇది 2 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 2720 తగ్గడం విశేషం.

**వెండి ధరలు..**

ఇక్కడ మరో విశేషం ఏంటంటే.. బంగారానికి మించి వెండి ధరలు పతనమయ్యాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 5000 పడిపోగా.. కేజీకి రూ. 1.03 లక్షలకు చేరింది. దీనికి ముందటి రోజు కూడా రూ. 4 వేలు పతనం కాగా.. 2 రోజుల్లోనే రూ. 9 వేలు దిగొచ్చిందని చెప్పొచ్చు. అంతకుముందు రోజు కూడా రూ. 2 వేలు తగ్గగా ఇది 3 రోజుల్లో రూ. 11 వేలు పతనమైంది. అంతర్జాతీయంగా అనిశ్చితి ఉన్నప్పటికీ.. ప్రాఫిట్ బుకింగ్, డాలర్ పుంజుకోవడం, అమెరికాలో ఉద్యోగాలు పెరగడం వంటివి బంగారం ధరల పతనానికి దారితీసిందని చెప్పొచ్చు.

## టాటా క్యాపిటల్ రూ.17,000 కోట్ల ఐపీఓ

**న్యూఢిల్లీ-నవభూమి:**టాటా గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ.. టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ ఈ నెల 4న మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ విధానంలో ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ దాదాపు 200 కోట్ల డాలర్లు (సుమారు రూ.17,000 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా టాటా క్యాపిటల్ విలువను 1,100 కోట్ల డాలర్లు (రూ.93,500 కోట్లు)గా లెక్కగట్టినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇష్యూలో భాగంగా రూ.10 ముఖ విలువతో కూడిన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు కొంత మంది వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో తమ వాటాలను విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో టాటా క్యాపిటల్ వెల్లడించింది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలన్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది.ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు 92.83 శాతం వాటా ఉంది.

## రూపే క్రెడిట్ కార్డు యూజర్లకు షాక్.. ఛార్జీలు పెంపు.. మే 1 నుంచే అమలులోకి




**హైదరాబాద్-నవభూమి:** రూపే క్రెడిట్ కార్డ్ ఉపయోగిస్తున్న వారికి బిగ్ షాక్. క్రెడిట్ కార్డు లావాదేవీలపై ఛార్జీలు భారీగా పెరగనున్నాయి. 2025, మే 1 నుంచే కొత్త ఇంటర్ ఛేంజ్ ఫీజులు అమలు చేయనున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. పెరిగిన ఛార్జీలు దేశీయ, అంతర్జాతీయ ట్రాన్సాక్షన్లు వర్తిస్తాయని పేర్కొంది. ఇంటర్‌చేంజ్ ఫీజు అనేది ట్రాన్సాక్షన్ సమయంలో మర్చెంట్ బ్యాంకు, కార్డు ఇష్యూ బ్యాంకుకు చెల్లించే ఫీజు. అయితే ఇది నేరుగా వినియోగదారు నుంచి వసూలు చేయరు. కానీ కొన్ని సందర్భాల్లో వ్యాపారులు ఈ అదనపు ఛార్జీలను వినియోగదారులపై పరోక్షంగా విధిస్తారు.ప్రస్తుతం రూపే క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు సగటు ఇంటర్ చేంజ్ ఫీజులు ఇలా ఉన్నాయి. యుటిలిటీ వ్యాపారాలకు 1 శాతం, ఈ-కామర్స్ లావాదేవీలకు 1.7 శాతం, ప్రయాణాలకు 1.7 శాతం నుంచి 1.8 శాతం వరకు ఉన్నాయి. మరోవైపు యూపీఐ కోసం రూపే క్రెడిట్ కార్డులు ఉపయోగించేవారికి చిన్న చిన్న ట్రాన్సాక్షన్లకు మినహాయింపులు ఉంటాయి.

**మే 1 నుంచి కొత్త ఛార్జీలు**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సర్క్యులర్ ప్రకారం రూపే క్రెడిట్ కార్డుల వేరియంట్లను బట్టి కొత్త ఛార్జీలు ఉన్నాయి. క్లాసిక్ రూపే క్రెడిట్ కార్డ్ పాయింట్ ఆఫ్ సేల్ (%ూూ%) ట్రాన్సాక్షన్లకు 1.10 శాతం, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లకు 1.60 శాతం ఉన్నాయి. ఇక ప్లాటినం రూపే క్రెడిట్ కార్డ్ యుటిలిటీ వ్యాపారాలకు 1.85 శాతం ఉన్నాయి. ఇక సెలెక్ట్ రూపే క్రెడిట్ కార్డ్ యుటిలిటీ వ్యాపారాలకు 2.02 శాతం వసూలు చేయనున్నారు. పెరిగిన ఛార్జీలు రూపే క్రెడిట్ కార్డ్ వినియోగదారులపై పరోక్ష ప్రభావం చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇంటర్ చేంజ్ ఛార్జీలు పెరిగితే, వ్యాపారులు ఈ ఖర్చును వినియోగదారులకు మళ్లిస్తుంటారు. ఫలితంగా రూపే క్రెడిట్ వినియోగదారులపై అదనపు భారం పడుతుంది. నిపుణుల ప్రకారం గతంలో చిన్న వ్యాపారులు, వినియోగదారుల్లో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు రూపే క్రెడిట్ కార్డు యూపీఐ లావాదేవీలకు రూ. 2,000 వరకు ఛార్జీల మినహాయింపు ఇచ్చారు. అయితే ప్రస్తుతం కొన్ని వ్యాపార కేటగిరీ కోడ్‌లపై ఇంటర్ చేంజ్ ఛార్జీలు 1.10 శాతం నుంచి 2.02 శాతం వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ, వ్యవసాయ, రైల్వే వంటి ఎంపిక చేసిన MCCలలో ఇది 0.70 శాతంగా ఉంది.

**అంతర్జాతీయ లావాదేవీలకు**


రూపే డీఎఫ్ఎస్ క్లాసిక్ క్రెడిట్ కార్డు, ప్లాటినం, సెలెక్ట్ క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే అంతర్జాతీయ ట్రాన్సాక్షన్లపై అక్వైరింగ్ బ్యాంకులు ప్రతి ఏటీఎం ట్రాన్సాక్షన్‌కి 1.10 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇక %ూూ% ట్రాన్సాక్షన్లపై క్లాసిక్ క్రెడిట్ కార్డులకు 1.20 శాతం ఇంటర్ చేంజ్ ఫీ చెల్లించాలి. ప్లాటినం, సెలెక్ట్ క్రెడిట్ కార్డులకు 1.80 శాతం, 2 శాతం చొప్పున ఇంటర్ చేంజ్ ఛార్జీలు పడతాయి.

## ఇది డంపింగ్ యార్డ్ కాదు.. బల్దియా పార్కు.. చెత్తాచెదారంతో నిండిపోయిన బొంబూస్ పార్కు

**హైదరాబాద్-నవభూమి:** ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ఉంటున్న జూబ్లీహిల్స్‌లో సైతం పార్కులకు సరైన నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారంతో కంపు కొడుతున్నాయి. జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 పరిధి జూబ్లీహిల్స్ రోడ్డు నెం.36లోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో సుమారు ఎకరం విస్తీర్ణంలో బొంబూస్ పార్క్ ఉంది. బల్దియాకు చెందిన ఈ పార్కులో భారీ వెదురు వృక్షాలతో పాటు యూకలిప్టస్ చెట్లు ఉన్నాయి.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అనేక పార్కులను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ రోడ్ నెం 36లోని బొంబూస్ పార్కులో సైతం వందలాది మొక్కలు నాటారు. పార్కులో సందర్శకులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే వాకర్ల కోసం మెట్లను, ట్రాక్‌ను నిర్మించారు, అయితే ఏడాదిన్నర క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పార్కు నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో పార్కులో పిచ్చిమొక్కలు మొలిచాయి. ఇదిలా ఉంటే కొంతమంది ఆకతాయిలు పార్కు గేటు విరగ్గొట్టి లోపలికొచ్చి మద్యం సేవిస్తున్నారు. సమీపంలోని దుకాణదారులతో పాటు పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి పార్కులో వేయడం ప్రారంభించారు. దీంతో బొంబూస్ పార్కు డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది.వీటన్నింటికీ తోడు పక్కనున్న భవనాలకు సంబంధించిన డ్రైనేజీ నీటిని పార్కులోకి వదిలిపెడుతుండటంతో మురుగు గుంట ఏర్పడింది. దీంతో తీవ్రమైన దుర్వాసనలతో పాటు దోమలకు నిలయంగా మారింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు పార్కు వైపునకు కన్నెత్తి చూడడం లేదని, చెత్తను శుభ్రం చేయాల్సిన శానిటేషన్ విభాగం సైతం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పార్కు ముందు నుంచి నిత్యం సీఎం కాన్వాయ్ వెళ్తుందని, ఇలాంటి ప్రాంతంలో పార్కు డంపింగ్ యార్డుగా మారినా అధికారులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బొంబూస్ పార్కు నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.




## హైదరాబాద్‌లో ఆ స్థలాలకు డిమాండ్.. ఏకంగా 40 లక్షల స్క్వేర్ ఫీట్స్!



**హైదరాబాద్-నవభూమి:**పారిశ్రామిక రంగాలకు కీలకమైన నగరాల్లో మన హైదరాబాద్ ఒకటి. ఇక్కడ మల్టీనేషనల్ కంపెనీలు తమ ఆఫీసులను తెరిచేందుకు మొగ్గు చూపుతున్నాయి. నైపుణ్యం గల మానవ వనరులు, మౌలిక వసతులు సరిపడా ఉండడంతో హైదరాబాద్ నగరంలో వ్యాపార విస్తరణకు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. దీంతో భాగ్యనగరంలో ఆఫీసు స్థలాలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ప్రతి ఏడాది లక్షల చదరపు అడుగుల కార్యాలయాల స్థలాలు లీజుకు వెళ్తున్నాయి. దేశంలోని 8 ప్రధాన నగరాల్లో జనవరి- మార్చి త్రైమాసికంలో చూస్తే ఆఫీసు స్థలాల స్థూల అద్దె ట్రాన్సాక్షన్లు 74 శాతం మేర పెరిగాయి. గత మూడు నెలల్లో 2.82 కోట్ల చదరపు అడ్డుల ఆఫీసు స్థలాలు అద్దెకు వెళ్లినట్లు ప్రముఖ స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ నివేదిక తెలిపింది.విదేశీ కంపెనీలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరచడమే డిమాండ్ పెరిగేందుకు కారణమని నివేదిక తెలిపింది. ఈ మేరకు ఇండియా రియల్ ఎస్టేట్: ఆఫీసు అండ్ రెసిడెన్షియల్ నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. 2025 తొలి త్రైమాసికంలో దేశవ్యాప్తంగా ఆఫీసు స్థలాల మార్కెట్‌కు అసాధారణ గిరాకీ ఉన్నట్లు తెలిపింది. జీసీసీ స్థలాల లీజింగ్ కొత్త గరిష్ఠాలను తాకుతున్నట్లు పేర్కొంది. భారత్‌ను దీర్ఘకాలిక పెట్టుబడి గమ్యస్థానంగా ప్రపంచం గుర్తిస్తోందని తెలిపింది.

బెంగళూరు నగరంలో ఆఫీసు స్థలాల అద్దె ట్రాన్సాక్షన్లు 3 రెట్లు పెరిగినట్లు నైట్ ఫ్రాంక్ నివేదిక తెలిపింది. గత ఏడాది జనవరి- మార్చి త్రైమాసికంలో 35 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలం అద్దెకు వెళ్లగా ఈసారి 1.27 కోట్ల చదరపు అడుగుల స్థలం అద్దెకు తీసుకున్నట్లు పేర్కొంది. ఆ తర్వాత హైదరాబాద్ మహానగరం నిలిచిందినట్లు నివేదిక వెల్లడించింది. హైదరాబాద్‌లో గత ఏడాది 30 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాలు అద్దెకు వెళ్లాయి. ఈసారి అది 31 శాతం వృద్ధితో 40 లక్షల చదరపు అడుగులకు చేరినట్లు నివేదిక తెలిపింది. అంటే దాదాపు 9 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాలు అధికంగా అద్దెకు వెళ్లాయి.ఇక పుణె నగరంలో ఆఫీసు స్థలాల అద్దె లావాదేవీల్లో 91 శాతం వృద్ధి కనబడింది. 37 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాలు అద్దెకు వెళ్లాయి. ఇక ముంబై నగరంలో 24 శాతం వృద్ధితో 35 లక్షల చదరపు అడుగులు, చెన్నై నగరంలో 56 శాతం వృద్ధితో 18 లక్షల చదరపు అడుగుల స్థలం అద్దెకు వెళ్లింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో గత మూడు నెలల్లో 21 లక్షల చదరపు అడుగులు, అహ్మదాబాద్‌లో 2.2 లక్షల చదరపు అడుగులు, కోల్‌కతాలో 1.6 లక్షల చదరపు అడుగుల స్థలాలు లీజుకు వెళ్లాయి

## 2030 నాటికి మనిషిని మించిన మేధస్సు.. మానవాళినే నాశనం



**హైదరాబాద్-నవభూమి:** ఆధునిక సాంకేతికతల్లో ఒకటైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా పురోగమిస్తున్నది. భవిష్యత్తులో ఈ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా మారుతుందన్న భయాందోళనలు చాలా కాలం నుంచి వినిపిస్తున్నాయి. ఆ రోజులు త్వరలోనే రాబోతున్నట్టు తాజా పరిశోధనలో తేలింది. 2030 నాటికి ఏఐ మరింత అభివృద్ధి చెందుతుందని, మానవులతో సమానమైన తెలివితేటలు కలిగిన కృత్రిమ మేధస్సుగా పిలిచే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)గా రూపాంతరం చెంది మానవాళిని శాశ్వతంగా నాశనం చేస్తుందని 'గూగుల్ డీప్‌మైండ్' తన పరిశోధనా పత్రంలో పేర్కొంది.అయితే ఈ ముప్పు ఎలాంటిదో, మానవాళి మనుగడకు ముప్పు ఎలా వస్తుందో వెల్లడించలేదు. ఏజీఐ వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ఈ అధ్యయనం 4 ప్రధాన క్యాటగిరీలుగా విభజించింది. ఏజీఐతో సమాచార దుర్వినియోగం (డాటా మిస్ యూజ్), మిస్ అలైన్‌మెంట్, మిస్టేక్స్, స్ట్రక్చరల్ రిస్క్ లాంటి ప్రమాదాలు ఉన్నాయని ఈ పరిశోధనా పత్రం సహ రచయిత, 'డీప్‌మైండ్' సహ వ్యవస్థాపకుడు షేన్ లెగ్ స్పష్టం చేశారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు గూగుల్, ఇతర ఏఐ కంపెనీలు తగిన నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.

కృత్రిమ మేధస్సును నియంత్రణలో ఉంచడంపైనే ఈ పరిశోధనలో దృష్టి కేంద్రీకరించామని, దాని వల్ల ఎదురయ్యే ముప్పుపై లోతుగా అధ్యయనం చేశామని చెప్పారు. కాగా, మనుషుల కంటే ఎక్కువ తెలివితేటలు కలిగిన ఏజీఐ రాబోతున్నదని, వచ్చే 5 నుంచి 10 ఏండ్లలో దీని ఆవిర్భావం ప్రారంభం కావచ్చని 'డీప్‌మైండ్' సీఈవో డెమిస్ హస్సాబిస్ రెండు నెలల క్రితమే స్పష్టం చేశారు. ఏజీఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన ఉద్ఘాటించారు.

**ఏజీఐ అంటే..**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐకి మరో ముందడుగే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్. ఏఐ అనేది టాస్క్ స్పెసిఫిక్‌గా ఉంటుంది. అంటే మనం ఇచ్చిన పనులను మాత్రమే చేయగలుగుతుంది. కానీ, ఏజీఐ అనేది మానవ మేధస్సు మాదిరిగా అనేక రకాల పనుల నిర్వహణకు అవసరమైన తెలివితేటలను కలిగి ఉండేలా లక్ష్యాలను పెట్టుకుంటుంది. స్పష్టంగా చెప్పాలంటే ఇది మనుషుల మాదిరిగా విభిన్న డొమైన్లలోని జ్ఞానాన్ని అర్థం చేసుకుని, నేర్చుకోవడంతోపాటు ఆ జ్ఞానాన్ని రకరకాల పనుల కోసం అన్వయించగలిగే ఓ యంత్రం.

## పర్సనల్ లోన్.. తనఖా రుణం ఏది బెటర్!



**న్యూఢిల్లీ-నవభూమి:**వ్యక్తిగత రుణానికి తాకట్టు అవసరం లేదు. రుణమూ త్వరగానే లభిస్తుంది. కానీ, వడ్డీయే కాస్త ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. తనఖా రుణాలపై వడ్డీ తక్కువ. పెద్ద మొత్తంలో రుణం తీసుకోవచ్చు. కాకపోతే, ఏదైనా ఆస్తి తాకట్టు పెట్టాల్సిందే. పైగా ప్రహసనంతో కూడిన ప్రక్రియ. మరి ఏది సరైనది..? అంటే, మీ అవసరం, పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత రుణం తీసుకోవాలా..? తనఖా రుణం కోసం ప్రయత్నించాలా..? అనే సందిగ్ధ స్థితిలో ఉన్నవారు సరైన ఎంపిక చేసుకోవడానికి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి తెలుసుకుందాం..వ్యక్తిగత రుణాలతో పాటు తనఖా రుణాలకూ కొన్ని అనుకూలతలు, మరికొన్ని ప్రతికూలతలూ ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం కూడా. ఈ రెండింటి ప్రత్యేకతలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగితే, ఎంపిక సులభమవుతుంది. అలాగే, మీ ఆర్థిక అవసరాన్ని, క్రెడిట్ స్కోర్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.


వ్యక్తిగత రుణం..ఇది తనఖారహిత రుణం. అంటే, ఈ రుణం కోసం ఏమీ తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. ఈ రుణాలను మీ క్రెడిట్ స్కోర్, హిస్టరీ ఆధారంగా మంజూరు చేస్తారు. ఇందులో రుణదాతకు రిస్క్ ఎక్కువ. అందుకే, అధిక వడ్డీ వసూలు చేస్తారు. తాకట్టు అవసరం అవసరం లేకపోవడం, త్వరితగతిన రుణ మంజూరు, తీసుకున్న సొమ్మును ఏ అవసరానికైనా ఉపయోగించుకోగలిగే వెసులుబాటు ఈ రుణ అనుకూలతలు. మిగతా రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రతికూలమే. మీ ఆదాయం, పరపతి స్థాయి, క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మీకు ఎంత రుణం మంజూరు చేయవచ్చనే అంశాన్ని రుణదాత నిర్ణయిస్తారు. ఆదాయం తక్కువగా ఉంటే మీరు ఆశించినంత రుణం లభించకపోవచ్చు. క్రెడిట్ స్కోర్ అంత బాగా లేని పక్షంలోనూ అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైగా, రుణ మొత్తంలోనూ రాజీ పడాల్సిందే.

తనఖా రుణం..ఇది తాకట్టుపై లభించే రుణం. ఇందుకోసం రుణగ్రహీత తనకు చెందిన ఏ ఆస్తినైనా తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సాధారణంగా ఏదైనా స్థిరాస్తి కొనుగోలుకు లేదా ప్రస్తుత ప్రాపర్టీని తాకట్టు పెట్టి నిధులు సమీకరించేందుకు ఈ రుణాన్ని ఎంచుకుంటారు. దీని సానుకూలత విషయానికొస్తే, ఇందులో రుణదాతకు నష్ట భయం తక్కువ. కాబట్టి వ్యక్తిగత రుణంతో పోలిస్తే కాస్త తక్కువ వడ్డీకే లభిస్తుంది. ఆస్తి విలువ ఆధారంగా రుణమిస్తారు కాబట్టి, అధిక మొత్తంలో సొమ్ము లభించే అవకాశం ఉంటుంది. పైగా, తనఖా రుణాల తిరిగి చెల్లింపులకూ చాలా సంవత్సరాలు సమయం లభిస్తుంది. తద్వారా తక్కువ మొత్తంలో నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల్లో సుదీర్ఘకాలం పాటు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ప్రతికూలతల గురించి ప్రస్తావించాలంటే, రుణం కావాలంటే ఏదైనా ఆస్తిని తప్పనిసరిగా తాకట్టు పెట్టాల్సిందే. ఒకవేళ రుణాన్ని తిరిగి చెల్లించలేని పక్షంలో రుణదాత మీ ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రుణ దరఖాస్తు ప్రాసెసింగ్, మంజూరుకూ కొంత సమయం పడుతుంది. ప్రాసెసింగ్ చార్జీలూ అధికమే. ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కూడా ప్రహసనంతో కూడిన ప్రక్రియ.

ఎంపిక ఎలా..?..ఉద్దేశం: ప్రాపర్టీ కొనుగోలుకైతే తనఖా రుణం మేలు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి లేదా ఏదైనా ఆర్థిక అత్యయిక పరిస్థితుల నుంచి బయటపడేందుకైతే వ్యక్తిగత రుణం మెరుగైన ప్రత్యామ్నాయం.సమయం: తక్షణమే నిధులు కావాలంటే వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. కాస్త సమయం పట్టినా ఫర్వాలేదు, పెద్ద మొత్తంలో నిధులు కావాలంటే తనఖా రుణం కోసం ప్రయత్నించవచ్చు.వడ్డీ రేటు: తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు అధిక వడ్డీ అయినా ఫర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. తక్కువ వడ్డీయే మీ ప్రాధాన్యమైతే, తక్షణ అవసరం కాని పక్షంలో తనఖా రుణాన్ని ఎంచుకోండి.క్రెడిట్ స్కోర్: ఈ రెండింటిలో మీ అవసరానికి సరిపోయే రుణాన్ని ఎంచుకోవడంలో క్రెడిట్ స్కోర్, హిస్టరీ చాలా కీలకం. ఎందుకంటే, రుణం ఇవ్వాలా..? వద్దా..? అనే విషయంలో క్రెడిట్ స్కోరే మీ అర్హతను నిర్ణయిస్తుంది. అంతేకాదు, మీ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే రుణ దాత ఎంత వడ్డీ వసూలు చేయాలనే విషయాన్ని నిర్ణయిస్తాడు. కాబట్టి, తీసుకున్న రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా క్రెడిట్ స్కోర్‌ను మరింత పెంచుకోవచ్చు. తద్వారా భవిష్యత్‌లో తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశముంటుంది.

## ఐపీవో బాటలో 3 కంపెనీలు..

**న్యూఢిల్లీ-నవభూమి:**భారతీయ స్టాక్ మార్కెట్‌లో మూడు కంపెనీలు తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లతో (ఐపీఓ) ప్రవేశించడానికి సిద్ధమవుతున్నాయి. ఈ సంస్థలు తమ ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించాయి.ఈ సంస్థ "పార్క్" బ్రాండ్‌తో 13 గుర్తింపు పొందిన మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్వహిస్తోంది. ఐపీఓ ద్వారా రూ. 1,260 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆఫర్‌లో కొత్త షేర్లతో పాటు ప్రస్తుత వాటాదారుల విక్రయానికి కూడా అవకాశం ఉంది. 2024 సెప్టెంబర్ 30 నాటి గణాంకాల ప్రకారం, 3,000 పడకల సామర్థ్యంతో పార్క్ మెడి వరల్డ్ ఉత్తర భారతదేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేట్ ఆసుపత్రుల గొలుసుగా ఉంది. హర్యానాలో 1,600 పడకలతో రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రైవేట్ హాస్పిటల్ చెయిన్‌గా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.





# దేశంలో సగటు పని గంటలు 7.5.. ఢిల్లీలో అత్యధికంగా 9.5 గంటలు

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో ఎక్కడా లేని విధంగా ఢిల్లీలో ప్రజలు అత్యధిక సమయాన్ని తమ ఉద్యోగ కార్యకలాపాల కోసం వెచ్చిస్తున్నట్టు ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌లో సగటున ఉద్యోగి రోజుకు 455 నిమిషాలు అంటే 7.5 గంటలు ఉద్యోగ నిర్వహణలో గడుపుతుండగా ఢిల్లీలో మాత్రం రోజుకు 571 నిమిషాలు లేదా 9.5 గంటలు పనిచేస్తున్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు శాఖ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఈ పని గంటలలో ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లి తిరిగి రావడానికి ఖర్చవుతున్న సమయాన్ని కూడా కలిపినట్టు టైమ్ యూజ్ సర్వే నివేదిక పేర్కొంది.

యూపీలో పురుష ఉద్యోగులతో పోలిస్తే మహిళలు 72 శాతం తక్కువ సమయం పని చేస్తున్నారు. బీహార్‌లో ఇది 71.6 శాతంగా ఉంది.ఢిల్లీ, కేరళలో ఈ తేడా కేవలం 22 శాతం, గోవాలో ఈ తేడా కేవలం 8%.

గ్రామాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు రోజుకు ఉపాధి కోసం వెచ్చిస్తున్న సమయం - సుమారు 424 నిమిషాలు.

పట్టణాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు ఉపాధి కోసం రోజులో వెచ్చిస్తున్న సమయం- 494 నిమిషాలు

వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగుల పని గంటలు

ఢిల్లీ -9.5హర్యానా - 8.2..%తమిళనాడు -8,ఒడిశా, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ - 7,

## సైబర్ మోసంలో 50 లక్షలు పోగొట్టుకున్న వృద్ధ దంపతులు.. ఆత్మహత్య



**బెంగళూరు-నవభూమి:** వృద్ధ దంపతులు సైబర్ మోసానికి గురయ్యారు. రూ.50 లక్షలు పోగొట్టుకున్నారు. సంతానం లేకపోవడంతో ఎవరిపై ఆధార పడటం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. జరిగిన సైబర్ మోసం గురించి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. కర్ణాటకలోని బెళగావి జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. 82 ఏళ్ల డియోగ్జెరోన్ శాంతన్ నజరెత్, 79 ఏళ్ల ఫ్లావియానా వృద్ధ దంపతులు. ఖానాపూర్‌లోని బీడీ గ్రామంలో వారు నివసిస్తున్నారు. మార్చి 27న ఫ్లావియానా బెడ్‌పై మరణించి ఉండటాన్ని పొరుగువారు గమనించారు. రిటైర్డ్ మహారాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్ ఉద్యోగి అయిన డియోగ్జెరోన్ శాంతన్ మృతదేహాన్ని ఆ ఇంటి అండర్ గ్రౌండ్ నీటి ట్యాంక్‌లో గుర్తించారు. ఆయన మెడ, చేతి మణికట్టుపై కత్తి గాయాలున్నాయి.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డియోగ్జెరోన్ శాంతన్ రాసిన సూసైడ్ నోట్‌ను పరిశీలించారు. సుమిత్ బిర్రా, అనిల్ యాదవ్ పేర్లను ఆ నోట్‌లో ఆయన పేర్కొన్నారు. అందులోని వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన టెలికాం డిపార్ట్‌మెంట్ అధికారిగా చెప్పుకున్న సుమిత్ బిర్రా అనే వ్యక్తి డియోగ్జెరోన్‌కు ఫోన్ చేశాడు. ఆయన పేరు మీద మోసపూరితంగా సిమ్ కార్డు కొనుగోలు చేసినట్లు తెలిపాడు. వేధింపులు, అక్రమ ప్రకటనలకు ఆ సిమ్ కార్డును వినియోగిస్తున్నట్లు ఆరోపించాడు.ఆ తర్వాత క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన అనిల్ యాదవ్ వ్యక్తికి ఫోన్ కాల్‌ను ట్రాన్స్‌ఫర్ చేశాడు. సిమ్ కార్డ్ దుర్వినియోగంపై చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని డియోగ్జెరోన్ శాంతన్‌ను అతడు బెదిరించాడు. ఆయన ఆస్తి, ఆర్థిక వివరాలను అడిగి తెలుసుకున్నాడు. భయపెట్టి, వేధించి రూ. 50 లక్షలకు పైగా వసూలు చేశారు.మరోవైపు సైబర్ నేరగాళ్లు తమను మరింతగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని డియోగ్జెరోన్ శాంతన్ ఆ సూసైడ్ నోట్‌లో ఆరోపించారు. జూన్ 4న రూ.7.15 లక్షలకు గోల్డ్ లోన్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. 'ఆ అప్పు తీర్చాలి. బంగారాన్ని విక్రయించాలి. ఆ డబ్బును వారికి చెల్లించాలి' అని ఆ నోట్‌లో రాసి ఉంది.అలాగే తన స్నేహితుల నుంచి అప్పుగా డబ్బు తీసుకున్నట్లు డియోగ్జెరోన్ శాంతన్ ఆ నోట్‌లో ప్రస్తావించారు. భార్య బంగారు గాజులు, చెవిపోగులు విక్రయించి వారికి తిరిగి చెల్లించాలని అభ్యర్థించారు. 'మేం వృద్ధులం. మమ్మల్ని ఆదుకునే వారు ఎవరూ లేరు. ఎవరి దయాదాక్షిణ్యాలపై బతకడం ఇష్టం లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆ నోట్‌లో ఉంది. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థుల చదువు కోసం తమ మృతదేహాలను డొనేట్ చేయాలని అందులో కోరారు.కాగా, సైబర్ నేరగాళ్లతో జరిపిన ఆర్థిక లావాదేవీల వివరాలను డియోగ్జెరోన్ మొబైల్ ఫోన్‌లో పోలీసులు గుర్తించారు. ఆ మొబైల్ ఫోన్, సూసైడ్ నోట్, ఆత్మహత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య ఫ్లావియానా విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. వృద్ధ దంపతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఇద్దరు నిందితులపై ఆత్మహత్యకు ప్రేరేపించడం, సైబర్ మోసం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## వివాదంలో మోహన్‌లాల్ 'ఎల్ 2 ఎంపురాన్'..

### హిందూ వ్యతిరేక చిత్రంగా అభివర్ణించిన ఆర్‌ఎస్‌ఎస్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**స్టార్ నటుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం వివాదంలో చిక్కుకున్నది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఈ మూవీని హిందూ వ్యతిరేక చిత్రంగా అభివర్ణించింది. కాంగ్రెస్ ఈ చిత్రానికి మద్దతు ప్రకటించగా.. బీజేపీ మాత్రం మిన్నకుండిపోయింది. ఎంపురాన్ చిత్రం ఈ నెల 27న విడుదలైన విషయం తెలిసిందే. ఈ మూవీకి ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్నది. మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ఎల్ 2 ఎంపురాన్‌పై ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. ఆర్‌ఎస్‌ఎస్ మౌత్ పీస్ ఆర్గనైజర్‌లో ప్రచురించిన కథనం ప్రకారం.. ఈ చిత్రం 2002 గోద్రా అల్లర్ల నేపథ్యాన్ని ఉపయోగించి హిందూ వ్యతిరేక రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకువస్తుందని ఆరోపించింది. ఈ మూవీ స్టోరీ హిందువులను కించపరచడమే కాకుండా.. ప్రత్యేకంగా హిందూ అనుకూల రాజకీయ భావజాలాలను లక్ష్యంగా చేసుకుంటుందని విమర్శించింది. ఈ సినిమా హిందూ వ్యతిరేక, బీజేపీ వ్యతిరేక కథనాన్ని వ్యాప్తి చేయడానికి ఒక మాధ్యమమని.. వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారంటూ మండిపడింది.భారతదేశంతో సహా ఉపఖండంలో జరుగుతున్న మారణహోమం మధ్య హిందువులను విలన్లుగా చిత్రీకరించే హిందూ వ్యతిరేక ప్రచార చిత్రం ఎంపురాన్ అంటూ మండిపడింది. బీజేపీ కేరళ ప్రధాన కార్యదర్శి పీ సుధీర్ మాట్లాడుతూ ఈ మూవీ తన దారిలో వెళ్తుందని.. పార్టీ సైతం తన పని తాను చేసుకుంటుందన్నారు. ఈ సినిమాతోనూ పార్టీ ప్రభావితం కాదని.. సంఘ్‌కు తమ అభిప్రాయాలను వ్యక్త పరిచే హక్కు ఉందని.. అది మంచి చిత్రమా? లేదా? అన్నది నిర్ణయించుకునే హక్కు ప్రేక్షకులకు ఉందని పేర్కొంది. కేరళ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, పాలక్కాడ్ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కుట్టతిల్ మూవీకి మద్దతు ప్రకటించారు. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ వంటి నిరాధారమైన అబద్ధాలు, మతపరమైన ద్వేషాలతో కూడిన చిత్రాలకు భావ ప్రకటనా స్వేచ్ఛను సమర్థించే వ్యక్తులు ఇప్పుడు ఎంపురాన్‌ను వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. మూవీని నిర్మించిన నిర్మాత పురస్కారానికి అర్హుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి దివంగత కొడియేరి బాలకృష్ణన్ కుమారుడు, నటుడు బినీష్ కొడియేరి పేర్కొన్నారు.

## భద్రత ఉండే కంటోన్మెంట్‌లో.. ఐఏఎఫ్ సివిల్ ఇంజినీర్‌ను కాల్చి చంపిన దుండగుడు

**లక్నో-నవభూమి:**అత్యంత భద్రత ఉండే కంటోన్మెంట్‌లోని క్వాటర్స్‌లో నివసిస్తున్న భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సివిల్ ఇంజినీర్‌ను ఒక దుండగుడు కాల్చి చంపాడు. ఐఏఎఫ్ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కలకలం రేపిన ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాకు 51 ఏళ్ల సత్యేంద్ర నారాయణ్ మిశ్రా, ఐఏఎఫ్‌లో సివిల్ ఇంజినీర్. ప్రయాగ్‌రాజ్ కంటోన్మెంట్ ప్రాంతంలోని ఎయిర్‌ఫోర్స్ క్వాటర్స్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు.కాగా, శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మిశ్రా నివాసం వద్దకు వచ్చాడు. గార్డెన్ బయట నుంచి పేరుతో ఆయనను పిలిచాడు. బెడ్ రూమ్‌లో ఉన్న మిశ్రా కిటికీ తెరిచి చూశాడు.


## హలో.. 'నాకు ఇండియా నుంచి ఐఫోన్ కొని పంపించు తమ్ముడూ'.. మనోళ్లకి అమెరికాలో ఉన్న ఫ్రెండ్స్



**న్యూఢిల్లీ-నవభూమి:**రెండో సారి అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ట్రంప్ నిర్ణయాలు కేవలం ప్రపంచ దేశాల మధ్య ట్రేడ్ వార్‌నే కాదు.. ఆయా దేశాల ప్రజల కొనుగోలు శక్తిపై కూడా ప్రభావం చూపే అవకాశాలున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ వార్త హల్‌చల్ చేస్తోంది.అదేమిటంటే.. భారత్‌పై అమెరికా టారిఫ్‌లు విధించకముందే, దిగ్గజ సంస్థ యాపిల్ ముందు జాగ్రత్త పడినట్లు.. భారత్ నుంచి 3 రోజుల్లోనే, 5 సరకు రవాణా విమానాల్లో అమెరికాకు ఐఫోన్లు, ఇతర ఉత్పత్తులను తరలించినట్లు సమాచారం. తమ ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలు విధిస్తున్నందున, ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు నుంచీ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు వినబడుతోంది.

భారత్‌లో తయారు చేయిస్తున్న ఐఫోన్లు, ఇతర ఉత్పత్తులను అమెరికాకు తీసుకెళ్లినప్పుడు.. అదనపు సుంకాలు వేస్తే.. ఆమేర ధర కూడా పెంచాల్సి వస్తుంది. సుంకాలు అమల్లోకి రాకముందే.. వీటిని పట్టుకెళ్తే.. కొంతకాలం అయినా ధరలు పెంచకుండా, ప్రస్తుత ధరలకే విక్రయించొచ్చనేది యాపిల్ ప్రణాళికగా అర్థమవుతోంది. అమెరికా సంస్థ అయిన యాపిల్.. భారత్‌లో ఐఫోన్లు, ఇతర పరికరాల తయారీ/ అసెంబ్లింగ్ చేయిస్తున్న విషయం తెలిసిందే. ఇంతకుముందు మన దేశం నుంచి అమెరికాకు చేసే ఫోన్ల ఎగుమతులపై సుంకాలు ఏమీ లేవు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి 10 శాతం సుంకం అమల్లోకి వచ్చింది. అలాగే.. ఏప్రిల్ 9వ తేదీ నుంచి ఇది కాస్త 26 శాతం కానుంది. ఆ మేరకు ధర పెంచి ఐఫోన్లు అమ్మాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మార్చి చివరిలోనే భారత్ నుంచి యాపిల్ సంస్థ, మూడు రోజుల్లో 5 విమానాల్లో ఐఫోన్లు, ఇతర పరికరాలను ఎగుమతి చేసినట్లు సమాచారం.అమెరికాలో ట్రంప్ తీసుకున్న ఈ టారిఫ్ నిర్ణయాలు అక్కడి ఎన్‌ఆర్‌ఐలను ఊహించని దిశలో నడిపించే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా యూఎస్ మార్కెట్లో ఐఫోన్ల ధరలు బాగా పెరగబోతున్న నేపథ్యంలో యాపిల్ ప్రొడక్ట్స్ కొనుగోలుకు ఇకపై భారతదేశం మంచి ఆప్షన్‌గా మారొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమయంలో ఇండియాలో తయారవుతున్న ఐఫోన్లు మళ్లీ మెయిన్ ఆప్షన్‌గా మారే అవకాశం ఉంది. యాపిల్ ఇప్పటికే భారత్‌లో భారీ స్థాయిలో అసెంబ్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. భారత్ నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అమెరికాలో టారిఫ్ శాతం చైనాతో పోలిస్తే తక్కువగా ఉండటంతో అక్కడున్న ఎన్‌ఆర్‌ఐలు, భారత్‌లో ఉన్న తమ బంధువులను ఐఫోన్ కొనమని అడిగే పరిస్థితి తలెత్తొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పదో తరగతి విద్యార్థులకు అలర్ట్..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. అయితే.. ఈ పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏడు రోజుల్లోగా పూర్తి చేసేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మూల్యాంకనం ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈసారి రికార్డు స్థాయిలో వీలైనంత ముందుగానే ఫలితాలను వెల్లడించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. అన్నీ అనుకూలిస్తే 2025 ఏప్రిల్ నెలాఖరులోపే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఒకవేళ కుదరకపోతే మే మొదటి వారంలో AP SSC Results విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈక్రమంలో ఎక్కువమంది ఉపాధ్యాయులతో సకాలంలో మూల్యాంకన ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి ఏపీ పదో తరగతి ఫలితాలను వాట్సాప్ (9552300009) ద్వారా విడుదల చేసే విధంగా విద్యాశాఖ అధికారులు ప్లాన్ చేస్తున్నారు. అలాగే.. అధికారిక వెబ్‌సైట్ https://www.bse.ap.gov.in ద్వారా కూడా తమ ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.

టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు మూల్యాంకనం జరుగుతుంది. అలాగే ఏప్రిల్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సార్వత్రిక విద్యాపీఠం 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా పత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లా కేంద్రాల్లో మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్స్ ఆయా రోజుల్లో రోజుకు 40 పేపర్ల చొప్పున మూల్యాంకనం చేస్తారు.

మూల్యాంకనం చేసిన పత్రాల పునఃపరిశీలనలో మార్కుల తేడాలు వస్తే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలతోపాటు జరిమానా విధిస్తామని, కేంద్రాల్లో సెల్‌ఫోన్లను పూర్తిగా నిషేధించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు జవాబు పత్రాల మూల్యాంకనం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అదేశించారు. ఇక పదో తరగతి ఫలితాలు ఏప్రిల్ నెల చివరి నాటికి లేదా మే నెల ప్రారంభంలో విడుదల చేసే అవకాశం ఉంది.

ఏపీ ప్రభుత్వం ఇచ్చిన మనమిత్ర వాట్సాప్ నెంబర్ 9552300009 నెంబర్‌కు హాయ్ (Hi) అని మెసేజ్ చేయగానే.. సేవను ఎంచుకోండి అంటూ ఒక ఆప్షన్ వస్తుంది.

దానిపై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని సేవలు కనిపిస్తాయి.

అందులో విద్య సేవలపై క్లిక్ చేయాలి

అందులో పరీక్ష ఫలితాలు (10వ తరగతి/ ఎస్ఎస్‌సీ) డౌన్లోడ్‌పై క్లిక్ చేయాలి.

10వ తరగతి / ఎస్ఎస్‌సీ ఫలితాలు డౌన్లోడ్ చేసుకోండి అనే ఆప్షన్ ఉంటుంది.

హాల్‌టికెట్/ ఆధార్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ఫలితాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## ఏప్రిల్ నెల స్కూల్ సెలవులు లిస్ట్ ఇదే.. మొత్తం ఎన్ని రోజులంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఏప్రిల్ నెలలోకి అడుగు పెట్టేశాం. ఈనెలలో సాధారణ సెలవులతో పాటు వేసవి సెలవులు (%ూబఎఎవతీ ఎశీశ్రీఱఖుఎం%) కూడా రానున్నాయి. అయితే వేసవి సెలవుల కంటే ముందు అంటే ఏప్రిల్ నెలలో పాఠశాలలకు సాధారణ సెలవులు కూడా ఉన్నాయి. సమ్మర్ హాలిడేస్ ఏప్రిల్ 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలలో పండుగలు, ప్రత్యేక దినాల సందర్భంగా విద్యార్థులకు సెలవులు రానున్నాయి. ఏప్రిల్ నెలలో విద్యాసంస్థలకు ఎన్ని రోజులు సెలవులు ఉన్నాయో చూద్దాం..

**ఏప్రిల్ నెల సెలవులు :**

మార్చి 31వ తేదీ రంజాన్ (%=ఖుఝుఖుఅ%) పండుగ ఉంది. ఈ నేపథ్యంలో మరుసటి రోజు అంటే ఏప్రిల్ 1వ తేదీ కూడా పండుగ సెలవు ఉంటుంది. దీంతో రంజాన్ పండుగకు తెలంగాణలో రెండు రోజులు సెలవులు రానున్నాయి.

ఏప్రిల్ 6వ తేదీన ఆదివారం : ఈరోజు శ్రీరామనవమి. ఆలయాల్లో రాముల వారి పెళ్లి వైభవంగా జరుపుతారు. ఆ రోజున అన్ని విద్యాసంస్థలకు సెలవు ఉంటుంది. కానీ ఈసారి శ్రీరామనవమి పండుగ ఆదివారం నాడే రానుండటంతో సాధారణంగా సెలవు ఉంటుంది.

ఏప్రిల్ 10వ తేదీ గురువారం: మహావీర్ జయంతి. ఈ సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉంటుంది.

ఏప్రిల్ 14వ తేదీ సోమవారం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలకు సెలవు ఉంటుంది.

ఏప్రిల్ 18వ తేదీ శుక్రవారం : ఈరోజున 'గుడ్ ఫ్రైడే'. ఇది ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. ఈరోజు కూడా అన్ని పాఠశాలలు, కాలేజీలకు సెలవు ఉంటుంది.

ఇవి కాకుండా రెండో శనివారం, ఆదివారాలు కలిపి 5 ఉన్నాయి. ఇవన్నీ కలిపి ఏప్రిల్ నెలలో 7 లేదా 8 రోజులు సెలవులు రానున్నాయి.

ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు :

ఇదిలా ఉండగా.. వేసవి సెలవుల కోసం విద్యార్థులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఒక్కపూట బడులు కొనసాగుతున్నాయి. ఏప్రిల్, మే, జూన్ నెలలో వేసవి సెలవులు ఉండనున్నాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వేసవి సెలవుల్లో భాగంగా ఈసారి 45 రోజులకు పైగా పాఠశాలలు మూత పడనున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 24 నుంచి సెలవులు ప్రకటించి.. తిరిగి జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సమాచారం. త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.తెలుగు రాష్ట్రాల్లో సమ్మర్ హాలిడేస్‌పై స్పష్టత వచ్చేసింది. రెండు రాష్ట్రాల్లోనూ అటు ఇంటర్మీడియట్, ఇటు పదో తరగతి పరీక్షలు ముగిశాయి. ఇక మిగిలింది 1 నుంచి 9వ తరగతి పరీక్షలు మాత్రమే. ఇవి కూడా పూర్తయితే సమ్మర్ హాలిడేస్ ప్రారంభమవుతాయి. ఇప్పటికే వేసవి సెలవుల తేదీ కోసం విద్యార్థులు ఎదురు చూస్తుండగా ఒంటి పూట బడులు, ఆ తర్వాత కొద్ది రోజులకే పాఠశాలలకు వేసవి సెలవులు రానున్నాయి. వేసవి సెలవుల తేదీలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ జూన్ 12న పాఠశాలలు పునప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## భారతీయ విద్యార్థులకు సెల్ఫ్-డిపోర్టేషన్ ముప్పు.. వెంటాడుతోన్న చిన్నచిన్న తప్పులు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికా అధికారులు అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తున్నారు. స్వల్ప నేరాలు అంటే ట్రాఫిక్ ఉల్లంఘనలు కూడా ఇందులో ఉన్నాయి. గతంలో కాలేజీ క్యాంపస్‌లో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు, నిరసనల ఆరోపణలపై విదేశీ విద్యార్థులను వారి వారి దేశానికి తిరిగి వెళ్లాలని కోరిన తర్వాత ఇలా జరుగుతోంది. డజన్ల కొద్దీ భారతీయ విద్యార్థులకు వారి %F%-1 వీసా చెల్లదని, వెంటనే దేశం విడిచి వెళ్లాలని పాఠశాల అధికారులు ఇమెయిల్స్ పంపారు.క్యాంపస్‌లో దేశవ్యతిరేక నిరసనలు, ఆందోళనల ఆరోపణలతో అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసిన అమెరికా అధికారులు ఇప్పుడు చిన్న చిన్న నేరాలపై వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ నేరాల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలు కూడా ఉండటం గమనార్హం. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తోన్న పదుల సంఖ్యలో భారతీయ విద్యార్థులు.. గత కొన్ని రోజుల్లో సంబంధిత విద్యా సంస్థలపై అజమాయిషీ ఉన్న అధికారుల నుంచి మెయిల్స్ అందుకున్నారు. అందులో వారి %ఖీ%-1 స్టూడెంట్ వీసా ఇకపై చెల్లదని, తక్షణమే అమెరికాను వీడాలని ఆదేశించారు. విద్యార్థులు మద్యం సేవించి వాహనం నడపడం, లైన్ మారడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు, షాఫ్ లిఫ్టింగ్ వంటి వాటిని వీసా రద్దుకు కారణాలుగా పేర్కొనడం గమనార్హం.

వందలకొద్దీ అంతర్జాతీయ విద్యార్థులకు తక్షణమే అమెరికాను వీడాలని ఆదేశిస్తూ యూఎస్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ నుంచి మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. సామాజిక మాధ్యమాలలో పోస్టులు షేర్ చేసినా కూడా విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు చెబుతున్నాయి.విద్యార్థులకు పంపిన మెయిల్స్‌లో. "మీ %SEVIS (Student and Exchange Visitor Information System%) రికార్డ్ రద్దయ్యింది అంటే మీకు చెల్లుబాటు అయ్యే %ఖీ%-1 స్టూడెంట్ స్టేటస్ లేదు. అంటే మీరు అమెరికాలో చట్టపరంగా ఉండలేరు.. మీ ఫారమ్ %×%-20 చెల్లదు. మీ చెల్లదు. మీకు ఇకపై అమెరికాలో పనిచేసే అవకాశం లేదు" అని పేర్కొన్నారు అంతేకాదు, 'మీ వీసా రద్దయినట్లయితే, మీ పాస్‌పోర్టులో ఉన్న %ఖీ%-1 వీసా ఇక చెల్లదు. మీరు అమెరికాలో ఉంటే తక్షణమే వెళ్లిపోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి' అని హెచ్చరించారు.మిస్సోరి, టెక్సాస్, నెబ్రాస్కా తదితర రాష్ట్రాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులకు ఇటువంటి మెయిల్స్ వచ్చినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా గుర్తించింది. వీరిలో కనీసం ఐదుగురు విద్యార్థులను సంప్రదించగా.. గత 15 రోజులలో ఇలాంటి ఈమెయిల్స్ అందుకున్నట్టు తెలిపారు.డ్రంకెన్ డ్రైవ్, లైన్ మారడం, వేగంగా వాహనం నడపడం వంటి చిన్న నేరాలకు %ూజుఎ×ూ% రద్దు చేయడం చాలా అరుదు' ఇమ్మిగ్రేషన్ లాయర్ పర్వతనేని చందు అన్నారు. గత నాలుగు రోజుల్లోనే తనకు ఇలాంటి 30 కేసులపై విద్యార్థుల నుంచి కాల్స్ వచ్చాయని ఆయన చెప్పారు.ఓ విద్యార్థి మాట్లాడుతూ.. "రెండేళ్ల క్రితం 70 జోన్‌లో 80 డ్రైవింగ్ చేసి జరిమానా చెల్లించాను. అరెస్ట్ కాలేదు. ఇప్పుడు మాత్రం వీసా రద్దు చేయడం అన్యాయంగా అనిపిస్తోంది" అని వాపోయాడు. మరో విద్యార్థి 'ఒక్కసారి మద్యం తాగి డ్రైవ్ చేశాను. కోర్టు సూచనలన్నీ పాటించాను. అయితే ఇప్పుడు డిపోర్ట్ కావాలని చెబుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. 'వాల్‌మార్ట్‌లో %$%144 విలువైన వస్తువులు స్కాన్ చేయడం మర్చిపోయాను. అరెస్ట్ అయినా నా అకడమిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని కేసును ఒక నెలలోనే మూసేశారు.

## వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదు..

### ఆర్‌జీకార్ ఘటనపై కోర్టుకు సీబీఐ నివేదిక




**న్యూఢిల్లీ-నవభూమి:** కోల్‌కతా ఆర్‌జీకార్ వైద్య కళాశాల ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య కేసు దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణ జరుపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కోల్‌కతా హైకోర్టుకు తన నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదని పేర్కొంది. దర్యాప్తు సమయంలో సేకరించిన అన్ని ఆధారాలు, నిపుణుల అభిప్రాయాలు వైద్యురాలిపై జరిగింది సామూహిక అత్యాచారం కాదని సూచిస్తున్నాయని స్పష్టం చేసింది.సీబీఐ తరఫున న్యాయవాది డిప్యూటీ సొలిసిటర్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ ఘటనాస్థలం నుంచి సేకరించిన అన్ని డీఎన్ఏ నమూనాలకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులతో కూడిన 14 మంది సభ్యుల మెడికల్ బోర్డు ఈ పరీక్ష ఫలితాలను పరీక్షించిందన్నారు. ఏ ఫోరెన్సిక్ ఆధారాలు కూడా సామూహిక అత్యాచారం జరిగినట్లు నిర్ధారించలేదని స్పష్టం చేశారు. డీఎన్ఏ ప్రొఫైలింగ్ దోషిగా తేలిన నిందితుడు సంజయ్ రాయ్ ప్రమేయాన్ని మాత్రమే నిర్ధారించినట్లు కోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాలు నాశనం చేయడంతో పాటు పలువురి అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలపై విచారణ జరుగుతోందన్నారు.కాగా, 2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీకార్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. ఘటన అనంతరం ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సంజయ్ రాయ్‌ని ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐ విచారించింది.ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్ పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చి కోర్టుకు సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు దోషికి శిక్ష ఖరారు చేసింది. అతడికి జీవితఖైదు విధిస్తూ ఈ ఏడాది జనవరి 20న తీర్పు వెలువరించింది. అతడికి రూ.50 వేలు జరిమానా కూడా విధించింది. అంతేకాదు బాధిత కుటుంబానికి రూ.17లక్షల పరిహారం ఇవ్వాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, కోర్టు తీర్పుపై బాధిత కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలంటూ వైద్యురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## స్మార్ట్ ఫోన్ బానిసలు!.. రోజుకు ఐదారు గంటలు సోషల్ మీడియాకే అంకితం



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతీయుల్లో చాలా మంది స్మార్ట్ ఫోన్లకు బానిసలయ్యారు. రోజుకు ఐదారు గంటలు సోషల్ మీడియాకే అంకితమైపోతున్నారు. గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఈవై విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2024లో భారతీయులు గతంలో ఎన్నడూ లేని విధంగా స్మార్ట్‌ఫోన్లపైన వెచ్చించే ఐదు గంటల్లో దాదాపు 70 శాతం సమయాన్ని సోషల్ మీడియా, వీడియో స్ట్రీమింగ్, గేమింగ్‌కే కేటాయిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. మొట్టమొదటిసారి డిజిటల్ ప్లాట్‌ఫారాలు టెలివిజన్‌ను కూడా అధిగమించిన విషయాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది.

భారతీయుల ఆన్‌లైన్‌లో గడుపుతున్న సమయం పెరుగుతుండడంతో మెటా, అమెజాన్ వంటి ప్రపంచ టెక్ దిగ్గజాల మధ్య పోటీ కూడా పెరుగుతోంది. ఒకపక్క డిజిటల్ మీడియా వ్యాపారం విస్తరిస్తుండగా టెలివిజన్, ప్రింట్, రేడియో వంటి సంప్రదాయ మీడియా రెవెన్యూ, మార్కెట్ వాటా 2024లో దిగజారడం గమనార్హమని ఆ నివేదిక వెల్లడించింది.

**మన స్క్రీన్ టైమ్ రికార్డులివి!**

స్మార్ట్ ఫోన్ యూజర్ల సంఖ్య - 120 కోట్లు

ఇంటర్నెట్ వినియోగదారులు - 85 కోట్లు

నిరుడు భారతీయులు స్మార్ట్‌ఫోన్లలో గడిపిన మొత్తం కాలం %-% 1.1 లక్షల కోట్ల గంటలు

ఎక్కువగా చూస్తున్నది - సోషల్ మీడియా, గేమింగ్, వీడియోలు

5జీ నెట్‌వర్క్ యూజర్లు వాడుతున్న నెట్- నెలకు సుమారు 21.2 జీబీ

ప్రపంచంలో రోజువారీ స్క్రీన్ టైమ్‌లో భారత్ ర్యాంక్ - 3

ఆసక్తికర అంశాలు

జియో హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్ వంటి వాటికి 100 మిలియన్ల పెయిడ్ యూజర్లు పెరిగారు.

కంటెంట్‌ను యూజర్లు వీక్షించేలా చేయడంలో కృత్రిమ మేధ కూడా తన వంతు పాత్ర పోషిస్తున్నది.



## శ్రీరామనవమి శుభాకాంక్షలతో.. స్టన్నింగ్‌గా రామం ఫస్ట్ లుక్

గోపీచంద్‌తో చిత్రాలయం స్టూడియోస్‌పై నిర్మాత వేణు దోనేపూడి విశ్వం సినిమాను తెరకెక్కించారని తెలిసిందే. తాజాగా ఈ బ్యానర్ నుంచి అదిరిపోయే అప్‌డేట్ అందించారు మేకర్స్. వేణు దోనేపూడి టీం నిర్మిస్తోన్న కొత్త చిత్రం రామం ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రామం ఫస్ట్ లుక్ విడుదల చేశారు.జైశ్రీరామ్ నినాదంతో ఉన్న జెండాను పట్టుకొని గుర్రపుస్వామి చేస్తూ ఉన్న లుక్ స్టన్నింగ్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. యోధుల గాథను ఆవిష్కరించే నేపథ్యంలో సినిమా ఉండబోతుందని ఫస్ట్ లుక్ ద్వారా తెలియజేశారు మేకర్స్. సమస్త మానవాళికి తారక మంత్రం శ్రీరామనామం.ధర్మ సంస్థాపనకు శ్రీరామచంద్రుడు చూపిన బాటే కాదు.. అధర్మాన్ని నిర్మూలించేందుకు ఆయన కోదండం చేపట్టి చూపిన వీరత్వం గురించి.. అలాంటి గొప్ప సమగ్ర మూర్తిమత్వాన్ని ఆధారంగా అలనాటి రామరాజ్యాన్ని నేటి కాలానికి కనెక్ట్ చేస్తూ ఇప్పటివరకు రానట్వంటి వైవిధ్యమైన కథతో ఈ సినిమా మీ ముందుకు రానుందని చెప్పుకొచ్చారు వేణు దోనేపూడి.ఈ సినిమాలో టాలీవుడ్‌కు చెందిన ఓ రైజింగ్ స్టార్ హీరోగా కనిపించబోతున్నాడని.. దేశవ్యాప్తంగా పాపులా రిటీ ఉన్న యాక్టర్లు, సాంకేతిక నిపుణులు ఈ సినిమాలో భాగం కానున్నారని తెలిపారు.



## ఊపేయడానికి సిద్ధమైన హాట్ బ్యూటీ!




'ఇస్మార్ట్ శంకర్' తో హాట్ బ్యూటీ గా వెలుగులోకి వచ్చిన నభా నటేష్ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు తొలుత ఓ లవ్ స్టోరీతో వచ్చిన సమయంలో పూరి కళ్లలో పడటంతో 'ఇస్మార్ట్ శంకర్' లో చాన్స్ అందుకుంది. దీంతో నభా అవకాశాలకు దూరమైంది. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటూ అటెన్షన్ డ్రా చేస్తుంది. ఇన్ స్టాలో వెడెక్కించే ఫోటోలతో..భంగిమలతో అలరిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా బ్యూటీ ఐటం భామగా కొత్త టర్నింగ్ తీసుకుంది. అదీ బాలీవుడ్ లో ఆ ఛాన్స్ రావడం విశేషం. సన్ని డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని అనే యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ! ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్- పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు హిందీలోనే నిర్మిస్తున్నాయి. ఇందులో ఐటం పాటకు పలువురు భామల్ని పరిశీలించి చివరిగా నభా నటేష్ ని ఎంపిక చేసారు. ఈ పాట కోసం హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఓ భారీ సెట్ ని సిద్ధం చేసారు. నేటి నుంచే ఆ పాట చిత్రీ కరణ కూడా మొదలవుతుందని సమాచారం. ఇప్పటి వరకూ నభా నటేష్ ఐటం పాటల్లో నటించలేదు. తొలిసారి ఆ రకంగానూ అమ్మడు అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. హీరోయిన్ అవకాశాలు లేని నేపథ్యం లో? మొదలైన ఈ కొత్త జర్నీతోనైనా బిజీ అవుతుందేమో చూడాలి. తెలుగులో చివరిగా డార్లింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా గత ఏడాది రిలీజ్ అయింది. ఆ తర్వాత మళ్లీ కొత్త ప్రాజెక్ట్ దేనికి సైన్ చేయలేదు.



## కిస్సిక్ మేకింగ్ చూశారా..!

అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన 'పుష్ప 2' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమా విజయంలో అన్ని విషయాలతో పాటు సంగీతం కూడా అత్యంత కీలకంగా వర్క్ చేసింది అనడంలో సందేహం లేదు. సినిమాలోని అన్ని పాటలకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా కిస్సిక్ సాంగ్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమా స్థాయిని పెంచడంలో కిస్సిక్ సాంగ్ కీలక పాత్ర పోషించింది, సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కిస్సిక్ పాటలో అల్లు అర్జున్‌తో శ్రీలీల వేసిన స్టెప్స్‌కి మంచి స్పందన వచ్చింది. బాలీవుడ్ హీరోయిన్‌తో చేయాలనుకున్న కిస్సిక్ పాటను శ్రీలీలతో చేసిన విషయం తెల్సిందే. శ్రీలీల స్టెప్పుతో వార్నర్, నితిన్ డ్యాన్స్.. రాబిన్ హుడ్ బజ్ టాప్ గేర్ లో! గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ అందించిన కిస్సిక్ సాంగ్ మేకింగ్ వీడియో తాజాగా విడుదలైంది. సాధారణంగా మేకింగ్ వీడియో అంటే నిమిషం లేదా రెండు నిమిషాలు ఉంటుంది. కానీ ఈ మేకింగ్ వీడియో విభిన్నంగా మొత్తం పాట ఉన్నంత సేపు ఉంది. నాలుగు నిమిషాలకు పైగా ఉన్న ఈ మేకింగ్ వీడియో రియల్ టైం పాట ఎలా ఉంటుందో దాన్ని చూపిస్తూ అక్కడక్కడ మేకింగ్ విజువల్స్‌ను వదిలారు. దాంతో పాట చూస్తున్న ఫీల్ కలగడంతో మేకింగ్ విజువల్స్‌ను చూసే అవకాశం కూడా ప్రేక్షకులకు ఈ వీడియోతో దక్కింది. అందుకే తక్కువ సమయంలోనే ఈ వీడియోకు లక్షకు పైగా వ్యూస్ వచ్చాయి. సినిమా వచ్చి నాలుగు నెలలు అవుతున్నా క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఇదే బాండింగ్ సినిమా వరకు వెళితే.. కిస్సిక్ సాంగ్‌తో శ్రీలీలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి గుర్తింపు లభించింది. ముఖ్యంగా శ్రీలీల డాన్స్ గురించి అంతా మాట్లాడుకునే విధంగా ఉందంటూ అంతా కామెంట్ చేశారు. అల్లు అర్జున్‌కు శ్రీలీల సరి జోడీ కాదు అంటూ కొందరు కామెంట్ చేసినా ఓవరాల్‌గా సినిమాలోని కిస్సిక్ సాంగ్‌కి హిట్ టాక్ దక్కింది. సినిమా విజయంలో కిస్సిక్ కీలక పాత్ర పోషించింది అనడంలో సందేహం లేదని సినీ విశ్లేషకులు సైతం అభిప్రాయం వ్యక్తం చేశారు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న పుష్ప 2 సినిమాలో హీరోయిన్‌గా రష్మిక మందన్న నటించిన విషయం తెల్సిందే. ఈ మేకింగ్ వీడియోలో రష్మిక మందన్నను చూడవచ్చు. పుష్ప 1 లో అల్లు అర్జున్‌తో ప్రత్యేక పాట ఊ అంటావా లో సమంత నటించిన విషయం తెల్సిందే. మొదటి పార్ట్‌లో ఐటెం సాంగ్ సూపర్ హిట్ దక్కించుకున్న నేపథ్యంలో సెకండ్ పార్ట్‌లో ఆ స్థాయిలో ఐటెం సాంగ్ ఉంటుందా అనే అనుమానంను కొందరు వ్యక్తం చేశారు. కిస్సిక్ సాంగ్ ఏకంగా సమంతను కూడా మెప్పించే విధంగా రూపొందింది. సమంత సైతం కిస్సిక్‌కి మంచి రివ్యూను ఇచ్చిన విషయం తెల్సిందే. పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.1850 కోట్ల వసూళ్లు రాబట్టడం ద్వారా పాన్ ఇండియా రేంజ్‌లో అరుదైన రికార్డులను నమోదు చేసింది. హిందీలో ఈ సినిమా దాదాపు వెయ్యి కోట్ల వసూళ్లు రాబట్టి నెం.1 స్థానంలో నిలిచింది.


## శ్రుతిహాసన్ కలల డైరెక్టర్ ఎవరో తెలుసా?



విశ్వనటుడు కమల్ హాసన్ వారసురాలిగా శ్రుతి హాసన్ చిత్ర పరిశ్రమలోకి వచ్చి రాణిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తమిళ, తెలుగు, హిందీ చిత్రాల్లో నటించింది. నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకుంది. ఎంతో మంది హీరోలతో ..మరెంతో మంది స్టార్ డైరెక్టర్లతో పనిచేసింది. సాధారణంగా ఏ హీరోయిన్ అయినా పనిచేయాలనే డైరెక్టర్ ఎవరు? అంటే వెంటనే మణిరత్నం పేరు చెబుతుంటారు. ఆయన జానర్ మంచి రొమాంటిక్ స్టోరీల్లో నటించాలని ఆశ పడుతుంటారు. ఆ తర్వాత శంకర్ పేరు వినిపిస్తుంది. ఇండియన్ సినిమాలో వీళ్లిద్దరు ఎంతో ప్రత్యేకమైన డైరెక్టర్లు. కాలం మారినా..తరాలు మారినా? వాళ్లతో పనిచేయడం అన్నది ప్రతీ నటి ఓ డ్రీమ్గా భావిస్తుంది. కానీ శ్రుతి హాసన్ డ్రీమ్ లో ఆ స్టార్ డైరెక్టర్లు ఇద్దరు లేరు. శ్రుతి హాసన్ కలల డైరెక్టర్ ఎవరు? అంటే యువ దర్శకుడు లోకేష్ కనగరాజ్ పేరు చెప్పింది. ఈయన పట్టు మని పది సినిమాలు కూడా తీయలేదు. చేసింది నాలుగైదు సినిమాలే. అయితే దర్శకుడిగా తనకంటూ ఓ బ్రాండ్‌ని క్రియేట్ చేసుకున్నాడు. పాన్ ఇండియా మార్కెట్ లో లోకేష్ అంటే ఓబ్రాండ్. తనకంటూ ఓ యూనివర్స్ ని క్రియేట్ చేసుకుని సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడతను సూపర్ స్టార్ రజనీ కాంత్ హీరోగా కూలీ చిత్రం తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో శ్రుతి హాసన్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తుంది. ఆ రకంగా శ్రుతి హాసన్ డ్రీమ్ కూలీ చిత్రంతో నెర వేరుతుంది.

ఈ సినిమా కంటే ముందే అమ్మడు లోకష్ తో కలిసి ఓ యాడ్ షూడ్ లో రొమాంటిక్ గానూ నటించింది. ఆ షూట్ తర్వాత ఇద్దరి మధ్య రిలేషన్ ఉన్నట్లు సోషల్ మీడియాలో కథనాలు కూడా వచ్చాయి.

## అందాల పీసీ మళ్లీ వచ్చింది!



గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా చాలా రోజుల తర్వాత ఇండియన్ మూవీలో నటిస్తుంది. అదీ మన టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న సినిమా కావడం విశేషం. గత నెలలో హైదరాబాద్ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా పాల్గొన్న విషయం తెల్సిందే. %యాూవీదీ%29 సినిమా షూటింగ్‌లో పాల్గొనడం కోసం అమెరికా నుంచి ఆ సమయంలో వచ్చిన ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో కొన్ని రోజుల పాటు ఉండి షూటింగ్ పూర్తి చేసుకుని ముంబై వెళ్లి పోయింది. అక్కడ తన సోదరుడి వివాహ వేడుకల్లో పాల్గొంది. దాదాపు వారం నుంచి పది రోజుల పాటు ఆ వివాహ వేడుకల్లో ప్రియాంక చోప్రా తన భర్తతో కలిసి పాల్గొంది. పెళ్లి వేడుకల తర్వాత అమెరికా వెళ్లి పోయిన ప్రియాంక చోప్రా తిరిగి ఇండియాకు వచ్చింది. హైదరాబాద్‌కి వచ్చినట్లు ఈమె స్వయంగా చెప్పుకొచ్చింది. ఈమె ఇండియాకు వచ్చింది అంటే కచ్చితంగా %యాూవీదీ%29 సినిమా కొత్త షెడ్యూల్ కోసం అయ్యి ఉంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా కాంబో సీన్స్‌ను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొదటి షెడ్యూల్‌ను అల్యూమీనియం ఫ్యాక్టరీలో నిర్వహించిన మేకర్స్ సెకండ్ షెడ్యూల్‌ను ఒడిశాలో నిర్వహించారు. మూడో షెడ్యూల్ ఎక్కడ అనే విషయమై క్లారిటీ రావాల్సి ఉంది. ఏమాత్రం బ్రేక్ తీసుకోకుండా రాజమౌళి ఈ సినిమాను బ్యాక్ టు బ్యాక్ షెడ్యూల్స్ తో ప్లాన్ చేస్తున్నాడు. ప్రియాంక చోప్రా ఇండియా రావడంకు ముందు ఈ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అమెరికాలో ఈ ఫోటోను తీసుకుని ఉంటుంది. అందాల ప్రియాంక చోప్రా వయసు పెరుగుతున్నా కొద్ది మరింత అందంగా కనిపిస్తుందని, పాతికేళ్ల పడుచు అమ్మాయి తరహాలో ప్రియాంక చోప్రా ఈ పోటోలో కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. సన్నని ఫిజిక్‌తో పాటు, చక్కని రూపం ఈ అమ్మడి సొంతం. అందుకే ఈమెకు బాలీవుడ్ నుంచే కాకుండా ఏకంగా హాలీవుడ్‌లోనూ ఈమెకు అభిమానులు ఉన్నారు. హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌ల్లోనూ ఈమె నటిస్తూ కన్నుల విందు చేస్తుంది. ఫుల్ జీన్స్ ధరించి, వైట్ టాప్‌లో హొయలు పోతూ పీసీ సెల్ఫీకి పోజ్ ఇచ్చింది. పీసీ నావెల్ రింగ్ నెటిజన్స్ చూపు తిప్పనివ్వడం లేదు. మహేష్ బాబు సినిమాలో ఈమెను ఎప్పుడు చూస్తామా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే బాండింగ్ సినిమా వరకు వెళితే.. సినిమాలో మహేష్ బాబుకు ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుందా లేదంటే కీలక పాత్రలో కనిపించబోతుందా అనే ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో మరో హీరోయిన్ ఉంటుంది అనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రియాంక పాత్ర గురించి మరింతగా చర్చ జరుగుతోంది. అసలు విషయం ఏంటి అనేది రాజమౌళి నోరు తెరిస్తే కాని తెలిసే అవకాశం లేదు. త్వరలో రాజమౌళి ఈ సినిమా విషయమై అన్ని విషయాలను వెల్లడించేందుకు గాను మీడియా సమావేశం ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రియాంక చోప్రా మరో వైపు హాలీవుడ్‌లో ఒక సినిమాను చేయడంతో పాటు మరో వెబ్ సిరీస్‌ను చేస్తున్నట్లు తెలుస్తోంది.

## బన్నీ.. ఒకేసారి రెండు టార్గెట్లు!



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌ను 'పుష్ప 2' మరో ఎత్తుకు తీసుకెళ్లింది. సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 1800 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి బన్నీకి పాన్ ఇండియా స్టార్‌డమ్ ముద్ర వేసింది. అయితే ఈ రెండు భాగాల 'పుష్ప' కోసం బన్నీ దాదాపు ఐదేళ్ల సమయం వెచ్చించాల్సి వచ్చింది. ఇది ఆయనకు స్టార్ హీరోగా ఉండే అత్యున్నత సమయంలో చాలా ఎక్కువ టైం. ఇప్పుడు అదే లోటును భర్తీ చేయడానికి బన్నీ పూర్తిగా స్పీడ్ మోడ్‌లోకి మారిపోయారు. పుష్ప 2 విజ యంతో పాటు వచ్చిన వన్ మేన్ మాస్ ఇమేజ్‌ను ఉపయోగించుకుంటూ, అల్లు అర్జున్ తన తదుపరి ప్రాజెక్టులకు క్లియర్ షెడ్యూల్ ప్లాన్ చేసుకున్నాడు. ఇందులో భాగంగా అట్లీ డైరెక్షన్‌లో ఓ భారీ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌కు కమిట్ అయ్యాడు. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్, ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి. ఇది పూర్తిగా మాస్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ రూపొందించనున్న చిత్రంగా తెలుస్తోంది. ఇప్పటికే నిర్మాత నాగవంశీ త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్నీ చేయబోయే సినిమా గురించి క్లారిటీ ఇచ్చాడు. "అల్లు అర్జున్ గారు రెండు సినిమాలను ఒకేసారి ప్లాన్ చేయాలనుకున్నారు. మేము మా షూటింగ్ షెడ్యూల్‌ను కూడా అలా ప్లాన్ చేస్తున్నాం. త్రివిక్రమ్ గారి సినిమా 2025 ద్వితీయార్థంలో స్టార్ట్ అవుతుంది," అంటూ వెల్లడించారు. అంటే అట్లీ సినిమా షూటింగ్ కొనసాగుతుండగానే త్రివిక్రమ్ చిత్రం సెట్స్‌పైకి రానుంది. ఒకదాని తర్వాత ఒకటి కాకుండా, రెండింటినీ సమాంతరంగా చేయాలన్నది బన్నీ ఫిక్స్ చేసిన డెడ్‌లైన్. ఇది చూస్తే బన్నీ గతంలో చేసిన తప్పును మళ్లీ చేయకుండా, మార్కెట్‌ను పూర్తిగా క్యాష్ చేసుకునే దిశగా దూసుకెళు న్నాడనే విషయం స్పష్టమవుతోంది. స్టార్ హీరోగా ఉన్న సమయంలో ఎక్కువ సినిమాలు చేయడం, ఎక్కువ మార్కెట్ బేస్ సెట్ చేసుకోవడం ఇప్పుడు అవసరమైనది. 'పుష్ప 2' తో వచ్చిన మ్యానరిజమ్, క్రేజ్‌ను కాపాడుకోవాలంటే కన్సిస్టెంట్‌గా సినిమాలు విడుదల చేయాల్సిన అవసరం బన్నీకి ఉంది. ప్రస్తుతం త్రివిక్రమ్ స్క్రిప్ట్ వర్క్‌లో బిజీగా ఉన్నాడు. అట్లీ సినిమా కూడా బన్నీ సిగ్నల్ ఇవ్వగానే సెట్స్‌పైకి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు 2025లో బ్యాక్ టు బ్యాక్ బన్నీని పాన్ ఇండియా స్టార్‌గా మరింత ఎస్టాబ్లిష్ చేసే అవకాశాలున్నాయి. అన్ని విషయాల్లో క్లారిటీ, కంట్రోల్ ఉన్న బన్నీకి ఇప్పుడు తక్కువ టైమ్‌లో ఎక్కువ వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. మరి ఈ ప్రయత్నంలో అతని మార్కెట్ రేంజ్, అలాగే హీరోగా క్రేజ్.. ఇంకా ఏ స్థాయిలో పెరుగుతుందో చూడాలి.

## ఎమ్ఎల్ఆర్ పతక ధమాకా



**హైదరాబాద్-నవ భూమి:** వయసు ఒక నంబర్ మాత్రమేనని నిరూపించారు మర్రి లక్ష్మణ్‌రెడ్డి(ఎమ్ఎల్ఆర్). ఎనిమిది పదుల వయసులో కుర్రాళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా ఐదు పతకాలతో సత్తాచాటారు.

చండీగఢ్(పంజాబ్) వేదికగా జరిగిన 7వ జాతీయ స్విమ్మింగ్ టోర్నీలో 81 ఏండ్ల లక్ష్మణ్‌రెడ్డి 400మీటర్ల ఫ్రీస్టయిల్‌తో పాటు 200మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో స్వర్ణాలు, 100మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో రజతం, రిలే ఈవెంట్లలో రెండు కాంస్యాలు సొంతం చేసుకున్నారు. ఐదు పతకాలు సాధించిన లక్ష్మణ్‌రెడ్డిని ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆర్‌సీబీ అదుర్స్.. ముంబైపై ఉత్కంఠ విజయం




**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్‌లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను ఊపేసింది. ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెడుతూ ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో ముంబై ఇండియన్స్‌పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)దే పైచేయి అయ్యింది. సోమవారం వాంఖడేలో జరిగిన హోరాహోరీ పోరులో ఆర్‌సీబీ 12 పరుగుల తేడాతో ముంబైపై అద్భుత విజయం సాధించింది. తొలుత విరాట్ కోహ్లీ(42 బంతుల్లో 67, 8 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ రజత్ పటీదార్ (32 బంతుల్లో 64, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌లకు తోడు ఆఖర్లో జితేశ్ శర్మ (19 బంతుల్లో 40 నాటౌట్, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 221 పరుగుల భారీ స్కోరు చేసింది.ఆర్‌సీబీ బ్యాటర్ల ధాటికి ముంబై బౌలర్లు సొంత వేదికలో ఘోరంగా విఫలమయ్యారు. గాయంతో మూడు నెలల విరామం తర్వాత ఫీల్డ్‌లోకి వచ్చిన బుమ్రా(0/29) వికెట్లు తీయకపోయినా ఆకట్టుకున్నాడు. రికార్డు ఛేదనలో ముంబై 20 ఓవర్లు ముగిసేసరికి 209/9 స్కోరు చేసింది. తిలక్‌వర్మ(56), హార్దిక్ పాండ్యా(42) పోరాడినా ఫలితం లేకపోయింది. కృనాల్ పాండ్యాకు నాలుగు వికెట్లు దక్కాయి.

## బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్




**నింగ్బో (చైనా):న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్ షిప్‌నకు వేళైంది. చైనాలోని నింగ్బో వేదికగా ఆరు రోజుల పాటు సాగే ఈ టోర్నీలో భారత్ స్టార్ షట్లర్లతో బరిలో నిలిచింది. సాత్విక్-చిరాగ్ ద్వయం తప్పుకున్న నేపథ్యంలో భారత బృందాన్ని పీవీ సింధు, లక్ష్యసేన్ నడిపించనున్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌తో పాటు ప్రణయ్, రజావత్, కిరణ్ జార్జి అదృష్టాన్ని పరీక్షించుకో నున్నారు. సేన్ తన తొలి మ్యాచ్‌లోనే కఠిన ప్రత్యర్థి లీ చియా హౌతో తలపడను న్నాడు. ఒకవేళ అతడు క్వార్టర్స్ చేరితే అక్కడ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ షి యు కితో ఆడాల్సి ఉంటుంది. మహిళల సింగిల్స్‌లో సింధు, బన్సోద్, అనుపమ, ఆకర్షి బరిలో నిలిచారు. సింధు తొలి రౌండ్‌లో తన కంటే తక్కువ ర్యాంకు కలిగిన ఎస్తర్ నురుమితో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే ఆమె రెండో రౌండ్‌లో జపాన్ అమ్మాయి యమాగుచిని ఢీకొననుంది. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లోనూ భారత్ నుంచి పలువురు షట్లర్లు బరిలో ఉన్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**